ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
సిటీ

fb/prajasakti
Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajamahendravaram, Srikakulam, ongole and Ananthapuramu
www.prajasakti.com
సంపుటి : 37 సంచిక : 233 | విజయవాడ, బుధవారం 23 ఆగస్టు 2017 | 12 + 12 పేజీలు వెల : 4.00



మీడియాతో మాట్లాడుతున్న తిరుగుబాటు ఎంఎల్ఏలు

నిన్న విలీనం.. నేడు తిరుగుబాటు

- పళనిస్వామి సర్కారుకు 19 మంది ఎంఎల్ఏల మద్దతు ఉపసంహరణ
- గవర్నర్‌కు లేఖల అందచేత
- అదే బాటలో మరో ముగ్గురు
- బలపరీక్షకు స్టాలిన్ డిమాండ్, ఎప్పుడైనా సిద్ధమన్న వైద్యలింగం

ప్రజాశక్తి - చెన్నయ్ ప్రతినిధి

తమిళనాడు రాజకీయాల్లో సంక్షోభం ఇంకా కొనసాగుతోంది. అన్నా డిఎంకెలోని పళనిస్వామి, పన్నీర్ సెల్వం గ్రూపులు విలీనమైన మరుసటి రోజే ఆ పార్టీలో తిరుగుబాటు ప్రారంభమైంది. దినకరన్ వర్గానికి చెందిన 19 మంది ఎమ్మెల్యేలు ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరిస్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు రాజ్‌భవన్‌లో గవర్నర్ విద్యాసాగరరావును మంగళవారం కలిసి ఈ మేరకు వేర్వేరుగా లేఖలు అందించారు. ముఖ్యమంత్రి పళనిస్వామి తమ విశ్వాసాన్ని కోల్పోయినందున తాము ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించుకుంటున్నట్లు వారు తమ లేఖలో పేర్కొన్నారు. ఈ విషయంలో జోక్యం చేసుకుని రాజ్యాంగ ప్రక్రియను సజావుగా కొనసాగేలా చర్యలు తీసుకోవాలని వారు గవర్నర్‌ను కోరారు. ఈ పరిణామం చోటుచేసుకున్న కాసేపటికే విశ్వాసపరీక్షను డిమాండ్ చూస్తూ డిఎంకె నేత స్టాలిన్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ ప్రకటనలో దినకరన్‌తో గవర్నర్‌ను కలిసిన 19 మంది ఎంఎల్ఏలు కాకుండా మిగతా 8లో

తలాక్‌కి తలాక్



త్రిపుల్ తలాక్ రాజ్యాంగ విరుద్ధం

- సుప్రీంకోర్టు తీర్పు
- త్రిపుల్ తలాక్ ఏకపక్షమన్న న్యాయమూర్తులు
- ఆర్నెల్లలోగా చట్టం చేయాలని పార్లమెంట్‌కు సూచన
- ముస్లిం మహిళల హర్షం

న్యూఢిల్లీ : ముస్లిం మహిళలకు త్రిపుల్ తలాక్ ద్వారా విడాకులిచ్చే పద్ధతి రాజ్యాంగ విరుద్ధమని సుప్రీంకోర్టు మంగళవారం తీర్పు వెలువరించింది. దీనిని నిషేధిస్తూ ఆరునెలల్లో చట్టం తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. అప్పటివరకు ఈ వ్యవహారంపై ఎటువంటి పిటిషన్లు తీసుకోబోమని స్పష్టం చేసింది. త్రిపుల్ తలాక్ పద్ధతిని వ్యతిరేకిస్తూ యుపికి చెందిన సైరా బానో దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన ప్రధాన న్యాయమూర్తి జెఎస్ ఖేహర్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల ధర్మాసనం 3:2 మెజార్టీతో ఈ తీర్పును వెలువరించింది. బెంచ్‌లో జస్టిస్ కురియన్, జస్టిస్ లలిత్, జస్టిస్ నారిమన్‌లు తలాక్ పద్ధతిని వ్యతిరేకిస్తూ తీర్పు ఇచ్చారు. చీఫ్ జస్టిస్ ఖేహర్, న్యాయమూర్తి నజీర్‌లు మెజార్టీ తీర్పును వ్యతిరేకించారు. ఈ అంశం కోర్టుల పరిధిలోకి రాదని, పార్లమెంటుకు వదిలివేయాలని వారు చెప్పారు. ముమ్మారు తలాక్ రాజ్యాంగ విరుద్ధమని, ఇస్లాం దేశాల్లోనే దీనిని నిషేధించారని, భారత్‌లో ఎందుకు కొనసాగించాలని తలాక్ విధానాన్ని వ్యతిరేకించిన న్యాయమూర్తులు వేరువేరుగా ఇచ్చిన తీర్పుల్లో ప్రశ్నించారు. ధర్మాసనానికి నేతృత్వం వహించిన ప్రధాన న్యాయమూర్తి జెఎస్ ఖేహర్ మాత్రం ఈ త్రిపుల్ తలాక్ విధానం రాజ్యాంగంలోని ఆర్టికల్ 25 (మత స్వేచ్ఛ)లో భాగమేనని వ్యాఖ్యానించారు. దాదాపు 1,400 ఏళ్ల నుండి అనుసరిస్తున్న ఈ విధానం మత సంప్రదాయంగా మారిందని, ఈ విధానం రాజ్యాంగంలోని 14,19,21 ఆర్టికల్స్‌కు వ్యతిరేకం కాదని వివరించారు. అందువల్ల ఈ అంశం కోర్టుల పరిధిలోకి రాదని పార్లమెంట్ విచక్షణకు వదిలివేయాలని ఆయన సూచించారు. ఈ అభిప్రాయాన్ని న్యాయమూర్తి ఎస్ అబ్దుల్ నజీర్ ఒక్కరే సమర్థించటంతో ఇది కేవలం మైనార్టీ తీర్పుగానే మిగిలిపోయింది. తీర్పును వెలువరించిన అనంతరం కోర్టు తుది ఉత్తర్వులను ప్రధాన న్యాయమూర్తి జెఎస్ ఖేహర్ కిక్కిరిసిన కోర్టు హాలులో చదివి వినిపిస్తూ '3.:2 మెజార్టీతో త్రిపుల్ తలాక్ విధానాన్ని రద్దు చేస్తున్నట్లు' ప్రకటించారు.

భార్యలకు విడాకులిచ్చేందుకు ముస్లిం పురుషులు అనుసరిస్తున్న ఈ త్రిపుల్ తలాక్ విధానం 'స్పష్టంగా ఏకపక్షమైన'దని న్యాయమూర్తి నారీమన్ వ్యాఖ్యానించారు. పిటిషనర్లు (ముస్లిం మహిళలు) న్యాయం కోరుతూ తమ వద్దకు వచ్చినపుడు కోర్టు చేతులు మిగతా 8లో

చారిత్రాత్మకం : మోడీ



ఈ తీర్పు చారిత్రాత్మకమైనదని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ట్విట్టర్‌లో హర్షం వ్యక్తం చేశారు. ముస్లిం మహిళలకు సమానత్వాన్ని కల్పించే ఈ తీర్పు మహిళా సాధికారికతలో శక్తివంతమైన ఆయుధంగా పనిచేస్తుందని ఆయన ఒక ట్వీట్‌లో వ్యాఖ్యానించారు.

స్వాగతించిన సిపిఎం

త్రిపుల్ తలాక్ విధానంపై సుప్రీం కోర్టు వెలువరించిన తీర్పును తాము స్వాగతిస్తున్నట్లు సిపిఎం పొలిట్‌బ్యూరో ఒక ప్రకటనలో పేర్కొంది. తీర్పు పూర్తి ప్రతిని అధ్యయనం చేసిన తరువాత సమగ్రంగా స్పందిస్తామని వెల్లడించింది.

అమలులో సవాళ్లు తప్పవు : అసదుద్దీన్



త్రిపుల్ తలాక్ రద్దు అమలులో క్షేత్ర స్థాయిలో కఠినమైన సవాళ్లు ఎదుర్కోవాల్సి ఉంటుందని ఎంఐఎం జాతీయ అధ్యక్షులు, ఎంపి అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. తలాక్ రద్దుపై సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నామన్నారు. కానీ ఈ తీర్పును అమలు చేయాలంటే క్షేత్ర స్థాయిలో కఠినమైన సవాళ్లు ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. ఈ అభిప్రాయం తమ పార్టీది మాత్రమే అని, ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డుది కాదన్నారు.

సెప్టెంబరు 10న ముస్లిమ్ లా బోర్డ్ సమావేశం

త్రిపుల్ తలాక్ అంశంలో సుప్రీంకోర్టు వెల్లడించిన తీర్పుపై అఖిల భారత ముస్లిం పర్సనల్ లా బోర్డ్ తీవ్రంగా స్పందించింది. తమ పర్సనల్ చట్టాల్లో జోక్యాన్ని సహించబోమని వ్యాఖ్యానించింది. సుప్రీంకోర్టు తీర్పును సమీక్షించేందుకు సెప్టెంబరు 10న భోపాల్‌లో సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు ఎఐఎంపిఎల్‌బి కార్యదర్శి, న్యాయ సలహాదారుడు జఫర్‌యాబ్ జిలానీ పేర్కొన్నారు. త్రిపుల్ తలాక్‌ను బోర్డు తీవ్రంగా వ్యతిరేకిస్తోందని, దీని నివారణకు ఇదివరకే తగు చర్యలు తీసుకున్నామని జిలానీ వివరించారు. పెళ్లి సమయంలోనే నవదంపతులకు దీని గురించి వివరించాలని ఖ్వాజీలకు ఇటీవల ఆదేశించినట్లుగా పేర్కొన్నారు. పూర్తిగా సమీక్షించిన తరువాతనే సుప్రీంకోర్టు తీర్పుపై స్పందిస్తామని, అయితే పర్సనల్ లాలో ఇతరుల జోక్యాన్ని సహించబోమని పేర్కొన్నారు.

విభజన చట్టం మేరకే జలాల పంపకం

కృష్ణా నది యాజమాన్య బోర్డు

2



విజయవాడ గాంధీనగర్‌లో బోసిపోయిన ఎస్‌బిఐ కార్యాలయం

స్తంభించిన బ్యాంకులు

- సమ్మెలో పాల్గొన్న 10 లక్షల మంది ఉద్యోగులు
- లక్షా 30 వేల బ్రాంచీల్లో నిలిచిన కార్యకలాపాలు

న్యూఢిల్లీ : తమ డిమాండ్ల సాధనకై బ్యాంకు ఉద్యోగులు నిర్వహించిన ఒక రోజు సమ్మెతో దేశవ్యాప్తంగా 21 ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో కార్యకలాపాలు నిలిచిపోయాయి. దాదాపు 10 లక్షల మంది బ్యాంకు ఉద్యోగులు సమ్మెలో పాల్గొనడంతో దేశవ్యాప్తంగావున్న సుమారు లక్షా 30 వేల బ్రాంచీల్లో బ్యాంకింగ్ సేవలు స్తంభించాయి. దీంతో ఖాతాదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మోడీ ప్రభుత్వం ఇటీవల తీసుకున్న నిర్ణయాలకు వ్యతిరేకంగా బ్యాంక్ యూనియన్ల యునైటెడ్ ఫోరం (యుఎఫ్‌బియు) పిలుపు మేరకు మిగతా 9లో

వైసిపి అభ్యర్థి శిల్పా ఇంట్లో సోదాలు



ప్రజాశక్తి - నంద్యాల క్రైం

నంద్యాల ఉపఎన్నిక బుధవారం జరుగు తున్న నేపథ్యంలో వైసిపి అభ్యర్థి శిల్పామోహన్‌రెడ్డి ఇంటిపై, శిల్పా సహకార సొసైటీపై మంగళవారం రాత్రి పోలీసులు సోదాలు నిర్వహించారు. అనంతరం శిల్పా ఇంట్లో ఉన్న బంధువులు, ఇతరులను బయటకు పంపించారు. శిల్పా ఇంట్లో వారు పోలింగ్ ఏజెంట్లమని చెప్పినా వినకుండా బలవంతంగా బయటకు పంపారు. ఈ సంఘటనపై వైసిపి అభ్యర్థి శిల్పామోహన్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు ఏక పక్షంగా వ్యవహరిస్తూ తమ ఇంటిపై, సహకార సంస్థలపై దాడులు చేయడం, బెదిరింపులకు మిగతా 9లో

నంద్యాలలో నేడే పోలింగ్

9



జీవో 279 రద్దు చేయకపోతే సమ్మె తప్పదు

- మున్సిపల్ కార్మికుల జెఎసి హెచ్చరిక
- చలో విజయవాడ మహా ప్రదర్శన, బహిరంగ సభ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మున్సిపల్ కార్మికుల ఉపాధిని దెబ్బతీసే 279 జీవోను రద్దు చేయాలని, సెప్టెంబరు 15లోగా సమస్యలను పరిష్కరించాలని ఎపి మున్సిపల్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ జెఎసి డిమాండ్ చేసింది. లేకుంటే నిరవధిక సమ్మె చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించింది. జెఎసి మంగళవారం మిగతా 9లో



35వ డివిజన్‌లో టిడిపి రెబల్‌గా పోటీచేస్తున్న బలుసూరి రామకృష్ణకు మద్దతుగా స్థానిక ఎంఎల్ఎ వనమాడి వెంకటేశ్వరరావు, బిజెపి జిల్లా అధ్యక్షుడు యెనిమిరెడ్డి మాలకొండయ్య ప్రచారం

రెబల్స్‌కు జై


కాకినాడలో టిడిపి, బిజెపి వింత నాటకం

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

కాకినాడ కార్పొరేషన్ ఎన్నికల్లో రెబల్స్‌గా నిలిచిన తెలుగు తమ్ముళ్లకే టిడిపి, బిజెపిలు మద్దతు తెలిపే విచిత్ర పరిస్థితి నెలకొంది. కార్పొరేషన్‌లోని 48 డివిజన్లకు ఈ నెల 29న ఎన్నికలు జరగనున్నాయి. ప్రతి ఎన్నికలోనూ బిజెపికి ఒకటో రెండో డివిజన్లు కేటాయించేవారు. కేంద్రంలో బిజెపి అధికారంలో మిగతా 9లో

నీటి కోసం న్యాయ పోరాటం

- ముఖ్యమంత్రి చంద్రబాబు
- ఉచిత ఇసుకతో ప్రయోజనం శూన్యం
- ఇసుక అక్రమ రవాణాపై పిడి చట్టం
- హిజ్రాలకూ సంక్షేమ పథకాలు



సంక్షేమ పథకాలపై పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కనీస ధర్మాన్ని పాటించడం లేదు...

కృష్ణా నదికి ఎగువ రాష్ట్రాలు కనీస ధర్మాన్ని పాటించడం లేదు.. దిగువ రాష్ట్రాలకు వాటా ప్రకారం ఇవ్వాల్సిన నీటిని విడుదల చేయడం లేదు.. వరదలు వస్తే దిగువ రాష్ట్రాలు గురవడం తప్ప, అవసరానికి నీటిని పొందలేకపోతున్నాం. .. దీనిపై న్యాయ పోరాటం చేస్తాం.. అని ఎపి ముఖ్యమంత్రి ఎన్ చంద్రబాబునాయుడు స్పష్టం చేశారు. ఇసుక విధానం, మద్యం పాలసీ, విశాఖ భూ కుంభకోణం తదితర ముఖ్యమైన అంశాలపై ఐవిఆర్ఎస్ సర్వే వివరాలను వెల్లడిస్తూ సిఎం సచివాలయంలోని తన కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఇసుకను ఉచితంగా ఇస్తున్నా ప్రజలకు ప్రయోజనం చేకూరటం లేదని సిఎం చెప్పారు. ఇతర రాష్ట్రాలకు ఇసుక తరలింపు, లోడింగ్, రవాణా ఛార్జీలు తదితరాల వల్ల ఇసుకను ఉచితంగా ప్రజలకు ఇస్తున్నా ఆశించిన ప్రయోజనం నెరవేరటం లేదన్నారు. ఈ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. తమిళనాడు, కర్ణాటక, తెలంగాణల్లో లారీ ఇసుక రూ.60 వేల నుంచి రూ.70 వేలు ధర పలుకుతోందన్నారు. ఈ అక్రమ తరలింపును అక్రమ తరలింపును ఉక్కుపాదంతో అణిచి వేస్తామన్నారు. ఇతర రాష్ట్రాలకు ఇసుక తరలించేవారిపై పిడి చట్టం ప్రయోగిస్తామని, రీచ్‌లకు ఉపాధి పథకంలో ర్యాంప్‌ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని, గనులు, రియల్‌టైం గవర్నరెన్స్‌ను అనుసంధానం చేస్తున్నామని వివరించారు. త్వరలో ఇందుకొక ప్రత్యేక యాప్ తీసుకొస్తున్నట్లు తెలిపారు.

మద్యం బెల్టు షాపుల మూసివేత సరైన నిర్ణయమని 98 శాతం ప్రజలు సర్వేలో చెప్పారన్నారు. ఇంకా ఆ షాపులున్నాయని నిర్వాహకులు కొత్తదారులు వెతుక్కుంటున్నారని అన్నారు. దీన్ని అరికట్టేందుకు మొబైల్ రైడింగ్ పార్టీలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. మద్యం బాటిళ్లు ఏ షాపు నుంచి బయటకు వస్తే ఆ షాపు యజమానిపై చర్యలుంటాయన్నారు.

ఇళ్ల స్థలాల పంపిణీలో 35 మంది అధికారుల అవినీతి

ఇళ్ల స్థలాల పంపిణీపై సర్వేలో 35 మంది అధికారులు అవినీతికి పాల్పడినట్లు వెల్లడైందన్నారు. వారిపై కేసులు పెట్టాలని ఆదేశించినట్లు చెప్పారు. టౌన్ ప్లానింగ్ విధానంపై 85 శాతం మంది సంతృప్తి, 9 శాతం ఫర్వాలేదని, 6 శాతం బాగాలేదని అభిప్రాయాలు వచ్చాయని చెప్పారు. అన్న అమృత హస్తంలో భాగంగా భోజనంపై 85 శాతం సంతృప్తి, 15 శాతం అసంతృప్తి వ్యక్తం మిగతా 9లో

విశాఖ భూ కుంభకోణంపై సిట్ విచారణ సరైందే..

విశాఖ భూ కుంభకోణంపై సిట్ విచారణ సరైన చర్యేనని 78 శాతం, సరైంది కాదని 18 శాతం, దీనిపై తెలియదనే అభిప్రాయం 4 శాతం సర్వేలో అభిప్రాయాలొచ్చాయన్నారు. భవిష్యత్తులో భూ సమస్యలకు తావు లేకుండా చేస్తామన్నారు.

ప్రజ్ఞ

1. భారత నేవీలోకి చేరిన ఐఎ 152 నౌకను ఏ పోర్టు నుంచి సముద్రం లోకి ప్రవేశపెట్టారు?
2. ఏ దేశం నుంచి దిగుమతయ్యే టెంపర్డ్ గ్లాస్‌పై ప్రభుత్వం అదనపు పన్ను విధించింది?
3. శస్త్ర చికిత్స నిర్వహించే అతి చిన్న రోబోను ఏ దేశ శాస్త్రవేత్తలు రూపొం దించారు?
4. వానపాములో రెండు కొత్త జాతులను ఏ రాష్ట్రంలో కనిపెట్టారు?
5. డాటా రిలే శాటిలైట్ - ఎమ్‌ను ఏ సంస్థ ప్రయోగించింది?

సమాధానాలు 7లో

ప్రజాశక్తిపై స్పందన ఫోన్: 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది. 94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా ఉండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.
అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి దినపత్రిక, ఎంబి విజ్ఞానకేంద్రం, డోర్.నెం.27-30-4, గవర్నరుపేట, విజయవాడ-520002కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

విభజన చట్టం మేరకే జలాల పంపకం



కృష్ణా నది యాజమాన్య బోర్డు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విభజన చట్టంలో పేర్కొన్న వాటాల ఆధారంగానే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు కృష్ణా నది నీటిని పంచుకోవాలని కృష్ణా నదీ యాజమాన్య బోర్డు స్పష్టం చేసింది. విజయవాడలోని గేట్‌వే హోటల్‌లో మంగళవారం ఈ బోర్డు సమావేశమైంది. ఈ సందర్భంగా బోర్డు చైర్మన్ శ్రీవాస్తవ మాట్లాడుతూ ఎగువ రాష్ట్రాలతో పాటు నీటిని వినియోగించుకోవటంలో దిగువ రాష్ట్రాలనూ సమాన భాగస్వాములుగానే గుర్తించాలన్నారు. కర్ణాటకలోని ప్రాజెక్టుల్లో నీరు సమృద్ధిగా ఉందని, దిగువ రాష్ట్రాలకు నీటిని విడుదల చేయాలని కేంద్రానికి బజాజ్ కమిటీ లేఖ రాయాల్సి ఉంటుందన్నారు. నీటి పంపకాలు, వివాదాలపై అపెక్స్ కమిటీని ఏర్పాటు చేయాలని రెండు తెలుగు రాష్ట్రాలూ ఇప్పటికే లేఖలు రాశాయన్నారు. దీనిపై కేంద్ర ప్రభుత్వమే నిర్ణయం తీసుకోవాల్సి ఉంద న్నారు. నీటి పంపకాల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మధ్య స్వల్ప భేదాభిప్రాయాలు న్యాయని తెలిపారు. రెండు రాష్ట్రాల్లోని ప్రాజెక్టుల దిగువన తొలిదశలో 18 టెలిమెట్రీ స్టేషన్లను ఏర్పాటు చేశామన్నారు. రెండో దశలో మరో 29 ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. శ్రీశైలం, నాగార్జున సాగర్‌లలో నీటి లభ్యత తక్కువ ఉన్నా, ఎక్కువ ఉన్నా ప్రోటోకాల్ ఆధారంగానే ఇరు రాష్ట్రాలు పంచుకోవాలని ఆయన సూచించారు. మరోవైపు హైదరాబాద్ తాగునీటి అవసరాల కోసం 400 క్యూసెక్కుల నీటిని తెలంగాణ తీసుకుంటోందని, సమాచార లోపం వల్ల కొన్నిసార్లు ఈ నీటి విడుదలలో ఏర్పడుతున్న ఆలస్యంతో వివాదాలు తలెత్తుతున్నాయని సభ్య కార్యదర్శి సమీర్ ఛటర్జీ తెలిపారు. సమావేశంలో ఏపి, తెలం గాణకు చెందిన నీటిపారుదల శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఉమ్మడి ప్రాజెక్టులను బోర్డు పరిధిలోకి తేవాలి
అపెక్స్ కమిటీ సభ్యులు గోపాలకృష్ణ

ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న జూరాల, నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్టులను కృష్ణా నది యాజమాన్య బోర్డు కిందకు తీసుకురావాలని ఆంధ్రప్రదేశ్ జలవనరులశాఖ అపెక్స్ కమిటీ సభ్యులు ఆళ్ల గోపాలకృష్ణ, నాగార్జునసాగర్ కుడి, ఎడమ ప్రాజెక్టు కమిటీల చైర్మన్లు భుజంగ రాయలు, వై పుల్లయ్య చౌదరిలు కోరారు. కృష్ణా నది యాజమాన్య బోర్డు సమావేశానికి విచ్చేసిన బోర్డు చైర్మన్ శ్రీవాస్తవను కలిసి ఈ మేరకు వారు వినతి పత్రం అందజేశారు. విభజన చట్టంలో పేర్కొన్న అంశాలను అమలు చేయాలని, బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ ప్రకారం ఎగువ రాష్ట్రాల నుంచి రావాల్సిన నీటిని సకాలంలో విడుదల చేయించాలని వారు విజ్ఞప్తి చేశారు. నాగార్జున సాగర్ కుడి కాలువ ప్రధాన రెగ్యులేటర్ గుంటూరు జిల్లాలో ఉన్నందున దాని నిర్వహణ బాధ్యతను ఆంధ్రప్రదేశ్‌కు అప్పగించాలని కోరారు.

రాష్ట్ర హక్కులను కాపాడటంలో బాబు వైఫల్యం :శివాజి

కృష్ణా నదీ జలాలపై రాష్ట్ర హక్కులను కాపాడటంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పూర్తిగా విఫలమయ్యారని కృష్ణా డెల్టా పరిరక్షణ సమితి కన్వీనర్ కొలుసుకొండ శివాజీ ఒక ప్రకటనలో విమర్శించారు. మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలు జల దోపిడీ చేస్తుంటే రాష్ట్ర ముఖ్యమంత్రి చోద్యం చూస్తున్నారన్నారు. మరోపక్క ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కూడా రాష్ట్ర ప్రయోజనాలపై దృష్టి పెట్టకుండా రాజకీయ విమర్శలకే ప్రాధాన్యత ఇస్తున్నా రన్నారు. తక్షణం ఎగువ రాష్ట్రాల నుంచి నీటిని విడుదల చేయించుకోలేకపోతే పంటలు బతికే అవకాశం లేదని, తాగునీటికీ తీవ్ర ఇబ్బందులు పడే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై రాష్ట్రం నుంచి అఖిలపక్ష ప్రతినిధి వర్గాన్ని ప్రధాని వద్దకు తీసుకెళ్లి ఒత్తిడి తీసుకురావాలని ఆయన సూచించారు.



వచ్చే ఏడాది నుంచే ఎయిమ్స్‌లో ఎంబిబిఎస్

సిఎంకు కేంద్ర మంత్రి జెపి నడ్డా హామీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

తాత్కాలిక భవనాల్లో వచ్చే విద్యా సంవత్సరం నుంచే ఎయిమ్స్‌లో ఎంబిబిఎస్ కోర్సును ప్రారంభిస్తామని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జెపి నడ్డా సిఎంకు హామీ ఇచ్చారు. రాష్ట్రంలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల్లో సీట్ల పెంపునకు సహకరిస్తామన్నారు. మంగళవారం ముఖ్యమంత్రి చంద్రబాబును ఉండవల్లిలోని తన నివాసంలో కలుసుకున్న జెపి నడ్డా పలు అంశాలపై చర్చించారు. మంగళగిరి ఎయిమ్స్ నిర్మాణం పూర్తయ్యేవరకు వేచి చూడకుండా తరగతులు నిర్వహించాలని సిఎం ఆయనను కోరారు. 11 మెడికల్ కాలేజీలను అప్‌గ్రేడ్ చేసేందుకు నడ్డా అంగీకరించారు. ఫాతిమా కాలేజీ విద్యార్థులకు న్యాయం జరిగేలా చూస్తామని ఆయన హామీ ఇచ్చారు.

సెప్టెంబర్ 15 కల్లా ఉమ్మడి సర్వీస్ రూల్స్

- ఈనెల 29లోగా డ్రాఫ్ట్ రూల్స్
- సర్వీస్ రూల్స్ కమిటీ నిర్ణయం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉపాధ్యాయ ఉమ్మడి సర్వీస్ రూల్స్ సెప్టెంబర్ 15 నాటికి రూపొందించాలని సర్వీస్ రూల్స్ కమిటీ నిర్ణయించింది. ఈ కమిటీ చైర్మన్ ఎంవి సత్యనారాయణ అధ్యక్షతన విజయవాడలోని ప్రైవేట్ హోటల్‌లో మంగళవారం సమావేశమైంది. ఈనెల 29 లోగా విద్యాశాఖ ముసాయిదా రూల్స్‌ను తయారు చేయాలని నిర్ణయించింది. వీటిపై ఏమైనా అభ్యంతరాలు, సవరణలు ఉంటే సెప్టెంబర్ 9లోగా మార్పులు చేయాలని తీర్మానించింది. సెప్టెంబర్ 13న మరోసారి కమిటీ సమావేశమై 15నాటికి సర్వీస్ రూల్స్ ఖరారు చేయాలని కమిటి నిర్ణయం తీసుకుంది.

కమిటీ ముందుకు పలు సూచనలు

గిరిజన, సంక్షేమ, మున్సిపల్ ఉపాధ్యాయులను కూడా సర్వీస్ రూల్స్‌లో చేర్చాలని టీచర్ ఎమ్మెల్సీలు, ఉపాధ్యాయ సంఘాల నేతలు ఈ సమావేశంలో సూచించారు. జూనియర్ లెక్చరర్లుగా ఉపాధ్యాయులు ప్రమోషన్లు పొందేందుకు అడ్డంకులు తొలగించాలని కోరారు. ప్రమోషన్లు వల్ల కాంట్రాక్టు లెక్చరర్లు నష్టపోకుండా చర్యలు తీసుకోవాలనే అంశంలో ఏకాభిప్రాయం వ్యక్తమైంది. ఇంటర్మీడియేట్ విద్యను పాఠశాల విద్యలో విలీనం చేయాలని సూచించారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి డిప్యూటీ డిఇఒ పోస్టు, బోధన అనుభవం ఉన్న వారికే పర్యవేక్షణ అధికారులుగా ప్రమోషన్లు కల్పించాలని, వ్యాయమ విద్యకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. రాష్ట్ర విభజన తరువాత విద్యాశాఖలో రద్దయిన పోస్టులను పునరుద్ధరించాలని, సర్వశిక్షా అభియాన్‌లోని పోస్టులను విద్యాశాఖే నుంచే భర్తీ చేయాలని సూచించారు. ఎస్ఇఆర్‌టి, డైట్‌లు, బిఇడి కళాశాలలు, మండలస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పర్యవేక్షణ వ్యవస్థ బలోపేతమయ్యేలా సర్వీస్ రూల్స్ రూపొందించాలని శాసన మండలి పిడిఎఫ్ ఫ్లోర్ లీడర్ వి బాలసుబ్రహ్మణ్యం సూచించారు. ఏ క్యాడర్‌కు నష్టం కలగకుండా అందరి అభిప్రాయాలు పరిగణలోకి తీసుకొని విద్యాశాఖకు శాశ్వతంగా ఉపయోగపడేలా సర్వీస్ రూల్స్ తయారు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో పిడిఎఫ్ ఎమ్మెల్సీ రాము సూర్యారావు, కత్తి నరసింహరెడ్డి, ఎఎస్ రామకృష్ణ, శ్రీనివాసులు నాయుడు, పాఠశాల విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ కె రవీంద్రనాథ్ రెడ్డి, అడిషనల్ డైరెక్టర్ ఎస్‌విఎం కృష్ణ, ఆర్‌జెడి దేవానంద్‌రెడ్డి, వివిధ ఉపాధ్యాయ సంఘాల అధ్యక్షులు ఐ వెంకటేశ్వరరావు(యుటిఎఫ్), షణ్మార్తి(ఎస్టీయు), జి హృదయరాజు(ఎపిటిఎఫ్), కమలాకర్‌రావు(పిఆర్‌టియు), న్ రఘురామిరెడ్డి(ఎపిటిఎఫ్ 257),జి నారాయణ రెడ్డి(హెచ్ఎంఎ), ఎం సరేష్(ఆపస్), బి తిరుపాల్(జిటిఎ) తదితరులు పాల్గొన్నారు.

వాతావరణం



రెండ్రోజులు భారీ వర్షాలు

ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి

కోస్తాంధ్రలో బుధ, గురువారం పలుచోట్ల ఓ మోస్తరుగాను, అక్కడక్కడా భారీ వర్షాలు, రాయలసీమలో గురువారం ఓ మోస్తారు నుంచి చెదురుమదురు జల్లులు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం పేర్కొంది. నైరుతి రుతుపవనాల ద్రోణి ఆగ్నేయ, ఈశాన్య బంగాళాఖాతంలో చురుగ్గా కదులుతున్నట్లు తెలిపింది. మరోవైపు ఒడిశా నుంచి కోస్తాంధ్ర, రాయలసీమ మీదుగా దక్షిణ తమిళనాడు వరకు ద్రోణి స్థిరంగా కొనసాగుతోందని పేర్కొంది. వీటి ప్రభావంతో ఇప్పటికే రాష్ట్రంలో పలుచోట్ల జల్లులు పడుతున్నాయి. మంగళవారం ఉదయానికి వింజమూరులో 3.5, కొమరాడ 3.4, రాచెర్ల 3.0, బొబ్బిలి 2.9, తెనాలి 2.7, వెలిగొండ 2.5, కావలి 2.1, రాయచోటి 4.0, పుంగనూరు 2.7, సత్యవేడు 2.6, చిన్నమండెం 2.5, రాజంపేట 2.4, ఎమ్మిగనూరు 2.2 సెంటీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది.

టంగుటూరికి సిఎం నివాళి

నేడు వినోదరాయునిపాలెంలో విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

తెలుగువారి ఐక్యతకు అవిరళ కృషి చేసిన టంగుటూరి ప్రకాశం పంతులు స్వాతంత్ర్య కాంక్ష కలిగించిన నేతల్లో అగ్ర భాగాన ఉంటారని ముఖ్యమంత్రి చంద్రబాబు కొనియాడారు. బుధవారం టంగుటూరి జయంతి సందర్భంగా ఆయనకు సిఎం నివాళులర్పించారు. బుధవారం ఆయన జన్మస్థలం ప్రకాశం జిల్లా వినోదరాయునిపాలెంలో టంగుటూరి విగ్రహాన్ని సిఎం ఆవిష్కరిస్తామని ప్రభుత్వ సలహాదారు పరకాల ప్రభాకర్ మంగళవారం సచివాలయంలో మీడియాకు తెలిపారు.

మిలియన్ మార్చ్‌కు ఫ్యాప్టో సంపూర్ణ మద్దతు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం(సిపిఎస్)రద్దు కోసం సెప్టెంబర్ 1న వేలాదిమంది ఉపాధ్యాయులు, ఉద్యోగులతో జరిగే మిలియన్ మార్చ్‌కు ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య(ఫ్యాప్టో) సంపూర్ణ మద్దతు తెలిపింది. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో సభ్య సంఘాలు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొంటారని ఫ్యాప్టో చైర్మన్ పి బాబురెడ్డి, సెక్రటరీ జనరల్ జి హృదయరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో ఉపాధ్యాయ, ఉద్యోగుల భద్రతను కాలరాసే సిపిఎస్‌ను 2004 సెప్టెంబర్ 1 నుంచి రాష్ట్రంలో అమలు చేస్తున్నారన్నారు.

ఉపరాష్ట్రపతి సన్మానసభ స్థలాన్ని పరిశీలించిన కామినేని

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సచివాలయం ప్రాంగణంలో ఉపరాష్ట్రపతి సన్మాన సభ స్థలాన్ని, వేదిక ఏర్పాట్లను మంత్రి కామినేని శ్రీనివాస్ మంగళవారం పరిశీలించారు. ఈనెల 26న సచివాలయం వద్ద ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడుకు సన్మానం చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. గుంటూరు జిల్లా కలెక్టర్ కోన శశిధర్, సిఆర్డీయే కమిషనర్ చెరుకూరి శ్రీధర్, ఇతర అధికారులు మంత్రితోపాటు పరిశీలించారు.



వైసిపిపై భన్వరాల్‌కు ఫిర్యాదు చేస్తున్న టిడిపి నేతలు కొనకళ్ల నారాయణ, కేశినేని నాని, పల్లె రఘునాథరెడ్డి



టిడిపిపై భన్వరాల్‌కు ఫిర్యాదు చేస్తున్న వైసిపి నేతలు జి శ్రీకాంత్‌రెడ్డి తదితర నాయకులు

పోటా పోటీగా ఫిర్యాదులు

ఈసీని కలిసిన టిడిపి, వైసిపి నేతలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నంద్యాల ఉప ఎన్నిక ప్రచారంలో చోటుచేసుకున్న పరిణామాలపై అధికార టిడిపి, ప్రతిపక్ష వైసిపి పోటా పోటీగా ఎన్నికల సంఘానికి ఫిర్యాదులు చేశాయి. మంగళవారం టిడిపి ఎంపీలు కొనకళ్ల నారాయణ, కేసినేని నాని, ప్రభుత్వ విప్ పల్లె రఘునాథరెడ్డి, వైసిపి ఎమ్మెల్యే జి. శ్రీకాంత్‌రెడ్డి, శివకుమార్, మధుసూధన్‌రెడ్డిలు వేర్వేరుగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి భన్వర్‌లాల్‌తో భేటీ ఆయ్యారు. మోడల్ కోడ్‌ను ఉల్లంఘించి మరీ వైఎస్ జగన్‌కు చెందిన సాక్షి దిన పత్రిక, ఛానెల్ ఎన్నికలను ప్రభావితం చేసే విధంగా వార్తా కథనాల్ని ప్రసారం చేసిందని మరోసారి ఫిర్యాదు చేశారు. దీనికి సంబంధించి వివిధ పేపర్ కటింగ్‌లు, వీడియో క్లిప్పింగ్‌లను భన్వర్‌లాల్‌కు అందజేశారు. ఎన్నికల ప్రచారం ముగిసినా మంత్రులు ఇంకా నంద్యాల నియోజక వర్గంలోనే తిష్టవేసి ఓటర్లను ప్రభావితం చేస్తున్నా రని వైసిపి ఎమ్మెల్యేలు ఈసీ దృష్టికి తీసుకొచ్చారు. వీటికి సంబంధించిన వీడియో ఫుటేజీలను అందజేశారు.

నంద్యాల ఉప ఎన్నికల సందర్భంగా వైసిపి విచ్చలవిడిగా నిబంధనలు ఉల్లంఘించి అక్రమాలు, దౌర్జన్యాలకు పాల్పడిందని టిడిపి ఎంపీ కొనకళ్ల నారాయణ మీడియాకు తెలిపారు. డబ్బులు పంచుతూ 43 మంది వైసిపి నేతలు దొరికిపోగా వారిని కాపాడేందుకు ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి పోలీస్ స్టేషన్‌కు వెళ్లి వారి విధులకు ఆటంకం కలిగించారన్నారు.

నంద్యాల ఉప ఎన్నిక ప్రచారం గడువు ముగిసినా మంత్రులు, టిడిపి నాయకులు నియోజకవర్గంలోనే ఉన్నారని వైఎస్సార్ సిపి నాయకులు మంగళవారం ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి, కె.శివకుమార్, చల్లా మధుసూదన్ రెడ్డి వినతి పత్రాన్ని అందజేశారు. సీఎం చంద్రబాబు ప్రెస్‌మీట్ల అంశాన్ని భన్వర్‌లాల్ దృష్టికి తీసుకురాగా కర్నూలు జిల్లాలో ప్రసారం కాకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి మీడియాకు తెలిపారు. ఓటర్లకు డబ్బులు పంచుతూ దొరికిపోయిన టిడిపి ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఈసిని కోరామన్నారు.

టీచర్స్‌డే ఏర్పాట్లపై మంత్రి గంటా సమీక్ష



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉపాధ్యాయ దినోత్సవం, అమ్మకు వందం కార్యక్రమాల నిర్వహణ ఏర్పాట్లు, విద్యాశాఖ అమలు చేస్తున్న కార్యక్రమాలను ఆ శాఖ ఉన్నతాధికారులతో మంత్రి గంటా శ్రీనివాసరావు మంగళవారం సచివాలయంలో సమీక్షించారు. బయోమెట్రిక్‌తో ఆధార్ అనుసంధానం, వర్చువల్ తరగతులు, డిజిటల్ పాఠశాలలు, తదితర అంశాలను చర్చించారు. ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆదిత్యనాథ్ దాస్, ఇంటర్మీడియేట్, పాఠశాల విద్య, సాంకేతిక విద్య, సర్వశిక్షా అభియాన్ అధికారులు, ఉన్నత విద్యామండలి సలహాదారు వెంకట్ పాల్గొన్నారు.

క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించండి

- మరుగుదొడ్ల నిర్వహణ మెరుగుపడాలి
- ఎయిడెడ్ పాఠశాలలపై అసంతృప్తి
- విద్యాశాఖ అధికారులకు సిఎస్ ఆదేశాలు



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యాశాఖ అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించి పాఠశాలల వాస్తవ పరిస్థితులను తెలుసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్ కుమార్ విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. సచివాలయంలో మంగళవారం విద్యాశాఖపై ఆయన సమీక్ష నిర్వహించారు. పాఠశాలల్లో ఇప్పటికీ మరుగుదొడ్లు పూర్తి స్థాయిలో నిర్మాణం కాకపోవడం, పూర్తయిన చోట నిర్వహణ సరిగా లేకపోవడంపై సిఎస్ అసంతృప్తి వ్యక్తం చేశారు. సేవా సంస్థలకు మరుగుదొడ్ల నిర్వహణను అప్పగించాలన్నారు. అధికారులు కార్యాలయాల్లో కూర్చుంటే సమస్యలకు పరిష్కారం దొరకదన్నారు. మరుగుదొడ్ల నిర్వహణ సక్రమంగా ఉండేలా చూసేందుకు పూర్తి బాధ్యత వహించాలని విద్యాశాఖ కమిషనర్ సంధ్యారాణికి సూచించారు. విద్యా ప్రమాణాలు పాటించని ఎయిడెడ్ పాఠశాలలపై కఠినంగా వ్యవహరించాలన్నారు. ప్రాథమిక పాఠశాలల్లో మౌళిక సదుపాయాల కల్పనలో అలసత్వం వహించవద్దన్నారు. ఈ సమీక్షలో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ఆదిత్యనాథ్ దాస్, కళాశాల విద్యాశాఖ కమిషనర్ బి ఉదయలక్ష్మి పాల్గొన్నారు.

ఐటిడిఎల పనితీరు మరింత మెరుగుపడాలి

ఏజన్సీల్లోని ఐటిడిఎల పనితీరు మెరుగుపడితేనే గిరిజనుల జీవన ప్రమాణాలు పెరుగుతాయని సిఎస్ స్పష్టం చేశారు. గిరిజన సంక్షేమ, పంచాయతీరాజ్, వైద్య, ఆరోగ్య శాఖ అధికారులతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. చాపరాయి ఘటనను సిఎస్ ప్రస్తావించారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా మూడు శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. సమీక్షలో గిరిజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి సిసోడియా, పంచాయతీ రాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి కె జవహర్ రెడ్డి, ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి పూనం మాలకొండయ్య పాల్గొన్నారు.

పట్టణాలు, నగరాల్లో 'ఆనందలహరి'

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని పట్టణాలు, నగరాల్లో ఆనంద లహరి పేరుతో వారాంతపు వినోద కార్యక్రమాలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. సాంస్కృతిక శాఖ అధికారులతో మంగళవారం సమావేశమైన ముఖ్యమంత్రి చంద్రబాబు పలు ప్రతిపాదనలను మంగళవారం ఆమోదించారు. విజయవాడలోని సత్యనారాయణపురంలో రూ.10 కోట్లతో కళాభవన్ ఏర్పాటుకు ఆయన అనుమతించారు. ఈ భవనానికి ఇప్పటికే స్థలాన్ని గుర్తించామని అధికారులు వివరించారు. వచ్చే నెలలో సచివాలయంలో భారీ ఎత్తున ఫుడ్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నట్లు సిఎం తెలిపారు.

19, 20 తేదీలో సేవ్ బచ్‌పన్ యాత్ర

కర్నూలు, అనంతపురం మీదుగా వచ్చేనెల 19, 20 తేదీల్లో బాలల హక్కుల ఉద్యమ నేత సత్యార్థి నిర్వహించనున్న యాత్రలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొననున్నారు. కెఎస్‌సిఎఫ్ ఫౌండేషన్ తరపున 'సురక్షిత్ బచ్‌పన్, సురక్షిత్ భారత్' నినాదంతో ఈ యాత్ర చేపడుతోంది. సెప్టెంబర్ 1న కన్యాకుమారిలో మొదలై అక్టోబర్ 1న జుబువా వద్ద ముగియనున్న ఈ యాత్ర ఢిల్లీ, ఆగ్రా, కోల్‌కతా, తదితర నగరాల మీదుగా సాగుతుంది.



తపాలా కూలీలు!

- బ్రిటీష్ కాలంనాటి వ్యవస్థ
- వెట్టిచాకిరీ బతుకులు
- అత్తెసరు వేతనాలు
- దయనీయం

డాక్ సేవకుల జీవనం

వారంతా పేరుకు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు.. వేలకు వేలు వేతనాలు అందుతాయనే ఆపోహ అందరిలోనూ ఉంది. అయితే వారు చేసేది వెట్టి చాకిరీ.. వచ్చే వేతనాలు మాత్రం కూలీల కన్నా దారుణం. సంవత్సరాల తరబడి పని చేస్తున్నా రూ.ఆరు వేల నుంచి రూ.13 వేలకు మించి రావడం లేదు. ఉద్యోగ విరమణ పొందితే కనీసం పింఛను కూడా లేని దుస్థితి. వయస్సు మీరిన తరువాత వారి భవిష్యత్తు అగమ్యగోచరంగా మారుతోంది. వారే గ్రామీణ తపాలా ఉద్యోగులు (డాక్ సేవకులు). కనీస వేతనాలు, పింఛను వంటి సమస్యల పరిష్కారం కోసం వారు ఈ నెల 16వ తేదీ నుంచి నిరవధిక సమ్మె చేస్తున్నారు. వారి సమస్యలపై 'ప్రజాశక్తి' అందిస్తున్న ఫోకస్..

ప్రజాశక్తి - చిత్తూరు ప్రతినిధి

బ్రిటీష్ ప్రభుత్వం రవాణా కోసం రైల్వేలను, బట్వాడా కోసం పోస్టల్ వ్యవస్థలను బలోపేతం చేసింది. 150 ఏళ్ల క్రితమే ఈ రెండు వ్యవస్థలు భారతదేశంలో పురుడు పోసుకున్నాయి. అప్పటినుంచి ఇప్పటివరకూ సాగుతున్నాయి. ఒక ప్రాంతంలో ఉన్న సమాచారాన్ని చేరవే యడానికి, ప్రభుత్వ కార్యకలాపాలను వేగవంతం చేసేందుకు పోస్టల్ వ్యవస్థను బ్రిటీష్ వారు విస్తృతంగా వినియోగించేవారు. 150 సంవత్సరాల క్రితమే అదనపు ఏజెంట్లు అనే పేరుతో నియమించింది. వీరినే ఇప్పుడు.. గ్రామీణ డాక్ సేవకులు (గ్రామీణ తపాల ఉద్యోగులు)అని పిలుస్తున్నారు. 2.76 లక్షల మంది దేశవాప్తంగా విధులు నిర్వహిస్తున్నారు. డాక్ సేవకుల్లో బిపిఎం, ఎండి, ఎంసి, ఎంపి అనే నాలుగు విభాగాలున్నాయి. ఇంత పెద్ద సంఖ్యలో ఉన్నప్పటికీ ఎన్నడూ వెలుగులోకి రాలేదు.

వెట్టిచాకిరీ ఇలా..

బిపిఎం (బ్రాంచ్ పోస్ట్ మాస్టరు) : ప్రజల వద్ద నుంచి నగదు లావాదేవీలు నిర్వహిస్తుంటారు. ఇందులో రికరింగ్ డిపాజిట్లు, పొదుపు ఖాతాలు, నెలవారీ వడ్డీ పథకం, సుకన్య సంవృద్ధి యోజన పథకం తాలుకూ ఖాతాలు, గ్రామీణ పోస్టల్ జీవిత బీమా, పోస్టల్ బీమా దీంతో పాటు కెవైసి బాండ్లు, రెవెన్యూ స్టాంపులు, పోస్టల్ స్టాంపుల అమ్మడం వంటి పనులు చేస్తున్నారు. అలాగే గ్రామీణ ఉపాధి హామీ పనుల్లో కూలీలకు బిల్లులు కూడా వీరే ఇస్తున్నారు. చిన్న మొత్తాల పొదుపు ఖాతాలు కూడా వీరే నిర్వహిస్తున్నారు. గతేడాది వరకు సామాజిక పింఛన్లు కూడా వీరే ఇచ్చేవారు.

ఎండి (మెయిల్ డెలివిరర్) : రిజిస్టర్ పోస్టులు, స్పీడ్ పోస్టులు, క్యాష్ ఆన్ డెలివరీలు, మనియార్డర్లు, ఆర్డినరీ ఉత్తరాలు, పార్శిళ్లు వీటన్నింటినీ ప్రతి ఇంటికీ వెళ్లి బట్వాడా చేయాలి. వీరిలో ఒక్కొక్కరికీ మూడు నుంచి నాలుగు పంచాయతీల్లో 20 గ్రామాలుంటాయి.

దాదాపు 20 నుంచి 30 కిలోమీటర్ల పరిధిలో వారికి వచ్చిన వాటిని బట్వాడా చేయాల్సి ఉంది.

ఎంసి (మెయిల్ క్యారియర్): ప్రధాన తపాల కార్యాలయం నుంచి వచ్చిన ఉత్తరాలను వీరు గ్రామీణ ప్రాంతాల్లోని పోస్ట్ ఆఫీసులకు చేర్చుతారు. అక్కడ మిగిలిపోయినవి, కొత్తగా వచ్చిన ఉత్తరాలను ఇతరత్రా వాటిని తీసుకొని ప్రధాన కార్యాలయానికి చేర్చాలి.

ఎంపి (మెయిల్ ప్యాకర్) : సబ్ కార్యాలయంలో ఉంటారు. వీరు రైల్వే మెయిల్ సర్వీసుల నుంచి వచ్చిన ఉత్తరాలు, ఇతరత్రా వస్తువులను ప్రధాన పోస్టాఫీసుకు చేర్చుతారు. పోస్టర్ మాస్టర్‌కు అసిస్టెంటుగానూ పని చేస్తుంటారు. హమాలీల్లాగా వీరు వెట్టి చాకిరీ చేస్తున్నారు.

అత్తెసరు వేతనాలే

ఇలా పోస్టల్ వ్యవస్థలో గొడ్డుచాకిరీ చేస్తున్నా వీరికి అత్తెసరు వేతనాలే అందుతున్నాయి. ఒక్కొక్కరూ 35 నుంచి 40 ఏళ్లపాటు విధులు నిర్వహిస్తున్నారు. అయినా వీరికి వేతనాలు మాత్రం నామమాత్రమే. రూ.6,500 నుంచి సీనియారిటీని బట్టి రూ.13వేలే ఇస్తున్నారు. పేరుకు వీరు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు. పిఎఫ్‌లు లేవు, యూనిఫారం ఇవ్వరు. కనీసం రిటైర్డు అయిన తరువాత పింఛను కూడా లేదు. ఉద్యోగ విరమణ పొందిన తరువాత కేవలం రూ.1.20 లక్షలు ముట్టజెప్పుతున్నారు.

ఉద్యోగం పోయిన తరువాత వీరి కుటుంబాలన్నీ వీధులపాలు కావాల్సిందే. వయస్సు ఉన్నంత వరకు చాకిరీచేసి తరువాత బిక్కుబిక్కుమంటూ జీవితం వెళ్లబుచ్చాల్సిన దుస్థితి నెలకుంది.

వీరి డిమాండ్లు ఇవే..

- కమలేష్ చంద్ర ముఖర్జీ కమిటీ సిఫార్సులను వెంటనే అమలు చేయాలి.
- జిడిఎస్‌లకు ఎనిమిది గంటల పనిని కల్పించాలి. సివిల్ సర్వెంట్ హోదా ఇవ్వాలి.
- డిల్లీ, మద్రాసు కోర్టు తీర్పుల ఆధారంగా జిడిఎస్‌లకు పింఛను మంజూరు చేయాలి.
- లక్ష్యాల పేరుతో వేదింపులు ఆపేయాలి



గొడ్డు చాకిరీ చేస్తున్నా



నేను 37 ఏళ్లుగా పని చేస్తున్నా. నా పరిధిలో మూడు పంచాయతీలున్నాయి. వాటిల్లో 20 గ్రామాలున్నాయి. ఏ చిన్న ఉత్తరం వచ్చినా కిలోమీటర్ల దూరం వెళ్లి వారి ఇంటికి చేర్చాలి. మొత్తం సైకిల్‌పైనే తిరగాలి. ఎలాంటి అలవెన్సులూ లేవు. నాకు జీతం మాత్రం రూ.9,200 ఇస్తున్నారు. సైకిల్ గాలి నిమిత్తం రూ.90 మాత్రమే ఇస్తున్నారు. పేరుకు నాలుగు గంటల పని అని చెప్పారు. అయితే ఎనిమిది గంటలు తిరిగినా పని ఎక్కువగానే ఉంది.

- విజయకుమార్, డాక్ సేవకులు



108 సేవలపై 'బిజెపి' పెత్తనం

- నిధులు విడుదలలో ప్రభుత్వ తాత్సారం
- మూలన పడుతున్న వాహనాలు
- ఆందోళనలో ఉద్యోగులు, రోగులు

ప్రజాశక్తి-విజయనగరం ప్రతినిధి

అత్యవసర సమయాల్లో ప్రజల ప్రాణాలు కాపాడే 108 సేవలపై బిజెపి ప్రభుత్వం పెత్తనం చెలాయిస్తోంది. రాష్ట్రంలో 108సేవల ఏజెన్సీని తన పార్టీకి చెందిన బివిజి (భారత్ వికాస్ గ్రూపు) సంస్థకు కట్టబెట్టేందుకు పావులు కదిపింది. ఎటువంటి అనుభవం లేని ఆ గ్రూపునకు ఇటీవల టెండర్లను ఖరారు చేసిన విషయం తెలిసిందే. అయితే దీనిపై ప్రస్తుత బాధ్యతలు చూస్తున్న జివికె (గున్నపురెడ్డి వెంకట కృష్ణారెడ్డి) సంస్థ కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకున్నది. దీంతో ఏమీ చేయలేని బివిజి సంస్థ అధికారంలో ఉన్న కేంద్ర ప్రభుత్వం అండతో 108 సేవలకు అడ్డంకులు సృష్టిస్తోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే ఇటీవల 108 వాహనాలకు డీజిల్ నిధులను నిలుపుదల చేసింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా 108 వాహన రాకపోకలు నిలిచిపోయాయి. చివరికి ఆయా జిల్లా కలెక్టర్ల చొరవతో ప్రభుత్వంపై ఒత్తిడి రావడంతో మళ్లీ నిధులు విడుదలయ్యాయి.

రాష్ట్రంలో 108 వాహనాలు 452 ఉన్నాయి. వీటిలో రాష్ట్ర వ్యాప్తంగా 2500 మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. అయితే ప్రభుత్వం సక్రమంగా నిధులు విడుదల చేయకపోవడంతో ఒకపక్క ఉద్యోగులకు, మరోవైపు వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. ఇప్పటికే జిల్లాలో జామి, ఎస్.కోట, మెంటాడ, గరివిడి, గరుగుబిల్లి వాహనాలు మూలకు చేరుకున్నాయి. వాహనాలు కండిషన్‌లో లేక ఫోన్ చేసిన రెండు మూడు గంటల వరకు రావడం లేదని రోగులు గగ్గోలు పెడుతున్నారు.

వాస్తవానికి 108 సేవలను 2005లో సత్యం కంప్యూటర్స్ సంస్థ ప్రారంభించింది. తరువాత వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం వచ్చాక జివికె సంస్థ 108 సేవలను నడుపుతూ వస్తుంది. అయితే కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ 108 సేవలను బిజెపికి చెందిన బివిజి సంస్థకు కట్టబెట్టాలని ప్రభుత్వం చూస్తోంది. ఈ సంస్థలో బిజెపి ముఖ్య నాయకులకు చెందిన వ్యక్తులు భాగస్వాములుగా ఉన్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే బివిజి సంస్థ 108 సేవలను దక్కించుకోవాలన్న లక్ష్యంతో 2016లో నిర్వహించిన టెండర్లను ప్రభుత్వం ఖరారు చేసింది. కనీసం అనుభవం లేని బివిజి సంస్థకు అప్పగించడం సరికాదని జివికె సంస్థ కోర్టు నుంచి స్టే తెచ్చింది. ప్రభుత్వం నిర్ణయానికి అడ్డంగా ఉన్న జివికె సంస్థను ఇబ్బందులు గురి చేయాలన్న లక్ష్యంతో 108 వాహన సేవలకు అంతరాయం కలిగించేలా ప్రభుత్వం నిధుల విడుదలలో తాత్సారానికి గురి చేస్తోందని సర్వత్రా వినిపిస్తోంది. తాజాగా వాహన మరమ్మతులకు, నిర్వహణకు కావాల్సిన నిధులను ప్రభుత్వం విడుదల చేయకుండా నిలిపేయడంతో 108 వాహనాలు మరమ్మతులకు నోచుకోవడం లేదు. సిబ్బంది జీతాలు పెంచడంలోనూ ప్రభుత్వం ఆసక్తి చూపడం లేదు. దీంతో 108 సేవలు రాష్ట్రంలో అగమ్యగోచరంగా మారాయి.

నర్రా కన్‌స్ట్రక్షన్‌పై ఆర్అండ్‌బి వేటు

రూ.11 లక్షలు జరిమానా

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ ప్రతినిధి

విజయవాడ కోర్టు భవనాల సముదాయం (కోర్టు కాంప్లెక్స్) నిర్మాణంలో జాప్యం చేస్తున్న నర్రా కన్‌స్ట్రక్షన్‌పై రహదారుల భవనాల శాఖ (అర్అండ్‌బి) వేటు వేసింది. సకాలంలో భవనం నిర్మాణ పనులు నిర్వహించనందుకు కన్‌స్ట్రక్షన్ సంస్థకు రూ.11 లక్షలు జరిమానా విధించింది. కోర్టు భవనాల సముదాయాన్ని రూ.58 కోట్లతో నిర్మించేందుకు 14 ఫిబ్రవరి 2014లో కాంట్రాక్టు సంస్థ ఆర్అండ్‌బితో ఒప్పందం చేసుకుంది. ఈ ఒప్పందం ప్రకారం 3 ఫిబ్రవరి 2017కు భవన నిర్మాణం పూర్తి చేయాలి. ఇప్పటికి కాంట్రాక్టు సంస్థ నాలుగో వంతు పనులు కూడా పూర్తి చేయలేదు. ఈ పనుల నిమిత్తం కాంట్రాక్టు సంస్థకు రూ.10 కోట్ల చెల్లింపులు జరిగాయి. ఎన్ని సార్లు నోటీసులిచ్చినా షెడ్యూల్‌కనుగుణంగా పనులు జరగకపోవడంతో పనుల జాప్యంపై హైకోర్టు న్యాయమూర్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో కాంట్రాక్టు సంస్థకు ఆర్అండ్‌బి ఉద్వాసన పలికింది.

ప్రాథమిక హక్కును హరిస్తున్నారు

మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం

ప్రజాశక్తి-కిర్లంపూడి, జగ్గంపేట(తూర్పుగోదావరి)

రిజర్వేషన్ల సాధన కోసం పోరాడుతున్నామని, కాపులకు నిరసన తెలిపే హక్కును కూడా హరిస్తున్నారని మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తూర్పుగోదావరి జిల్లా కిర్లంపూడిలోని తన నివాసం నుంచి ముద్రగడ తన అనుచరులతో 28వ రోజు మంగళవారం పాదయాత్ర ప్రారంభించగా గేటువద్ద పోలీసులు అడ్డుకున్నారు. పోలీసులతో వాగ్వాదానికి దిగి ప్రశ్నల వర్షం కురిపించారు. మాజీ డిజిపి దినేష్‌రెడ్డి పోలీసు మేనిఫెస్టోలో పోలీస్‌స్టేషన్‌కు ఎవరొచ్చినా సంతోషంగా తిరిగివెళ్లాలని, అప్పుడే పోలీసులపై ప్రజలకు నిజమైన విశ్వాసం ఉంటుందని పేర్కొన్నట్లు గుర్తు చేశారు. కాపుల సమస్యను తెలిపేందుకు చలో అమరావతి పాదయాత్ర చేస్తుంటే నిరసన తెలిపే ప్రాథమిక హక్కుకూడా లేకుండా పశువుల మాదిరిగా గృహనిర్బంధం చేసి హింసించడం ఎంతవరకూ న్యాయమని పోలీసులను ప్రశ్నించారు. రిజర్వేషన్లకోసం శాంతియుతంగా పోరాడుతుంటే గృహనిర్బంధం చేయడం ఎంతవరకూ న్యాయమని అన్నారు.

స్వచ్ఛ భారత్‌తోపాటు మౌలిక సదుపాయాలు

కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జెపి నడ్డా

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

దేశంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండేందుకు స్వచ్ఛభారత్‌ను పాటించడంతోపాటు ఆస్పత్రుల్లో మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామని కేంద్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి జెపి.నడ్డా చెప్పారు. గుంటూరులోని హిందూ ఫార్మసీ కళాశాలలో మంగళవారం బిజెపి గుంటూరు నగర అధ్యక్షులు ఎ.ఆంజనేయులు అధ్యక్షతన జరిగిన 'సంకల్పంతో సిద్ధి' సభలో జెపి.నడ్డా మాట్లాడారు. అనంతరం గుంటూరు మెడికల్ కళాశాలలో వైద్య విద్యార్థులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి ఆయన మాట్లాడుతూ.. దేశంలో 100 శాతం మందికి వాక్సినేషన్ వేస్తున్నామని చెప్పారు. దేశవ్యాప్తంగా కిడ్ని వ్యాధి గ్రస్తుల కోసం 400 ఆస్పత్రుల్లో ఉచిత డయాలసిస్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. యూనివర్సల్ హెల్త్ మిషన్ ద్వారా దేశంలో 100 జిల్లాల ఆస్పత్రుల్లో వ్యాధి నిర్ధారణ పరీక్షా కేంద్రాలను ఆధునీకరిస్తున్నామని తెలిపారు. అనేక కీలక వ్యాధులకు పరీక్షలు ఉచితంగా చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. వైద్య ఆరోగ్య రంగానికి తగిన ప్రాధాన్యత ఇచ్చి ప్రభుత్వ ఆస్పత్రుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామని వివరించారు. రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి కామినేని శ్రీనివాస్ మాట్లాడుతూ.. నీట్ వైద్య పరీక్షలకు సంబంధించి 371-డి అంశాన్ని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని వివరించారు. ఈ విషయమై కేంద్రం సానుకూలంగా నిర్ణయం తీసుకుందని చెప్పారు.

నిలకడగా గోదావరి

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం ప్రతినిధి

గోదావరి నీటిమట్టం నిలకడగా ఉంది. భద్రాచలం వద్ద మంగళవారం సాయంత్రం నీటిమట్టం 21.70 అడుగులు ఉంది. అదే సమయంలో ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద 10.90 అడుగుల నీటిమట్టం నమోదైంది. బ్యారేజీకి చెందిన 175 గేట్లను 0.50 మీటర్ల ఎత్తుకు లేపి 2.50 లక్షల క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడుదల చేశారు. గోదావరి నిలకడగా ఉండటంతో తూర్పు డెల్టా కాలువలకు మంగళవారం 4,500 క్యూసెక్కుల నీటిని విడిచిపెట్టారు. పశ్చిమ డెల్టా కాలువలకు నాలుగు వేల క్యూసెక్కులు, మధ్య డెల్టా కాలువలకు 1,900 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. గోదావరి ఇన్‌ఫ్లో మూడు లక్షల క్యూసెక్కులు ఉండటంతో కాళేశ్వరం వద్ద మంగళవారం 5.46 అడుగుల నీటిమట్టం నమోదైంది. అదేవిధంగా పేరూరు వద్ద 6.58 అడుగులు, దుమ్ముగూడెం వద్ద 7.08 అడుగులు, కూనవరం వద్ద 8.03 అడుగులు, కుంట వద్ద 5.57 అడుగులు, కోయిదా వద్ద 10.18 అడుగులు, పోలవరం వద్ద 7.46 అడుగులు, రాజమహేంద్రవరం హేవ్‌లాక్ బ్రిడ్జి వద్ద 13.94 అడుగుల నీటిమట్టం నమోదైంది.

కాషాయ నీడలో తమిళనాటకం


సంపాదకీయం

జయలలిత మరణానంతరం తమిళనాట అన్నాడిఎంకెలో ఏర్పడిన నాయకత్వ శూన్యాన్ని ఉపయోగించుకుని ఆ రాష్ట్రంలో తిష్ట వేయడానికి బిజెపి ఆడుతున్న కపట నాటకాలు రాష్ట్రాన్ని సంక్షోభంలోకి తీసుకుపోతున్నాయి. జయలలితకు వారసురాలిగా తెరపైకి వచ్చిన కొద్ది రోజులకే శశికళ జైలుపాలు కావడం, ఆమె ఆశీస్సులతో ముఖ్యమంత్రి పదవినధిష్టించిన పళని స్వామి చివరికి తన అధినాయకురాలికే ఎదురుతిరగడం, ఆమెకు బద్ధ విరోధి అయిన పన్నీర్ సెల్వంతో చేతులు కలపడం... అంతా ఢిల్లీలోని బిజెపి కార్యాలయంలో రాసి పెట్టిన స్క్రిప్టు ప్రకారమే జరుగుతోంది. గతంలో మూడు సార్లు తాత్కాలిక ముఖ్యమంత్రిగా వ్యవహరించిన అన్నాడిఎంకె చీలిక గ్రూపు నాయకుడు పన్నీర్‌సెల్వానికి ఉప ముఖ్యమంత్రి పదవిని, ఆయన అనుచరులకు కొన్ని మంత్రిపదవులను కట్టబెట్టేందుకు అంగీకరించడంతో విలీనంజరిగిపోయింది. గత ఎనిమిది మాసాలుగా మంత్రి పదవులకు దూరంగా వుండాల్సి రావడంతో పన్నీర్ సెల్వం గ్రూపు ఎమ్మెల్యేల్లో అసహనం పెరిగిపోయింది. ఇది పన్నీర్ సెల్వానికి ఇబ్బందికరంగా మారింది. కేంద్రంలో బిజెపి దళారీ పాత్ర పోషించి పన్నీర్ గ్రూపు అధికార దాహాన్నితీర్చింది. గవర్నరు దగ్గరుండి ఈ రెండు గ్రూపుల నేతల చేతులు కలపడం, ఆ వెంటనే ప్రధాని నరేంద్ర మోడీ పన్నీర్‌కు ఫోన్ చేసి అభినందించడం ఇవన్నీ అన్నాడిఎంకె అంతర్గత వ్యవహారాల్లో బిజెపి జోక్యాన్ని స్పష్టంగా కళ్లకు కడుతున్నాయి.

ఈ విలీనంతో తమకు ఇక ఢోకా లేదనుకున్న పళని, పన్నీర్ సెల్వం ద్వయానికి శశికళ మేనల్లుడు, అన్నాడిఎంకె డిప్యూటీ జనరల్ సెక్రటరీ అయిన టిటివి దినకరన్ గ్రూపు నుంచి ఊహించని షాక్ ఎదురైంది. విలీనం జరిగి 24 గంటలైనా కాకమునుపే దినకరన్ మద్దతుదారులైన 19 మంది ఎమ్మెల్యేలు రాజ్‌భవన్‌కెళ్లి గవర్నరును కలిసి పళనిస్వామి ప్రభుత్వానికి తమ మద్దతు ఉపసంహరిస్తున్నట్లు లేఖ ఇచ్చారు. పన్నీర్ సెల్వం గ్రూపుతో విలీనం తమకు ఎంతమాత్రం ఇష్టం లేదని బహిరంగంగా ప్రకటించారు. రెండు గ్రూపుల విలీనం తరువాత 233 స్థానాలున్న అసెంబ్లీలో స్పీకర్‌తో కలుపుకుంటే 117 మంది మద్దతు పళనిస్వామికి వుంది. దినకరన్‌కు చెందిన 19 మంది మద్దతు ఉపసంహరించుకున్నట్లు ప్రకటించడంతో పళని ప్రభుత్వం మైనార్టీలో పడింది. గవర్నరు బిజెపి అధినాయకత్వం ప్రభావానికి లోను కాకుండా రాజ్యాంగ బద్ధంగా వ్యవహరించినట్లయితే శాసనసభలో బలాబలాల ప్రదర్శనకు ఆదేశించాలి. అదే జరిగితే అన్నాడిఎంకె ప్రభుత్వం పతనం ఖాయమవుతుంది. దినకరన్ గ్రూపు సహకారంతో ప్రభుత్వ ఏర్పాటుకు పావులు కదుపుతున్న ప్రతిపక్ష డిఎంకెకు అప్పుడు అవకాశం లభిస్తుంది. అయితే ఇదంతా బిజెపి రాజ్యాంగ బద్ధంగా వ్యవహరిస్తుందా లేక రాజకీయ అవకాశవాదంతో మరిన్ని కుత్సితాలకు పాల్పడుతుందా అన్నదానిపై ఆధారపడి ఉంటుంది.

మొత్తం మీద చూసినప్పుడు అన్నాడిఎంకెలో చీలికలకు, విలీనాలకు ఎలాంటి సూత్రబద్ధమైన విధానం కానీ, సిద్ధాంత ప్రాతిపదిక కానీ లేదు. అన్ని ప్రాంతీయ పార్టీల మాదిరిగానే ఇక్కడా వ్యక్తిగత ప్రయోజనాలు, వ్యాపార ప్రయోజనాలే కీలకపాత్ర వహించాయి. జయలలిత మృతి తరువాత అన్నాడిఎంకెలో సమర్థులైన, ప్రజాకర్షణ కలిగిన నాయకులు లేకపోవడం ఆ పార్టీకి ఒక పెద్ద లోపం. ఏక వ్యక్తి ఆకర్షణపై ఆధారపడి నడిచే అన్ని పార్టీల మాదిరిగానే ఇక్కడా జరిగింది. గతంలో ఎంజి రామచంద్రన్ వంటి ప్రజాకర్షణ కలిగిన పెద్ద నాయకుడు చనిపోతే ఆయనకు వారసురాలిగా జయలలిత నిలదొక్కుకోడానికి ముందు ఇప్పటిలాగే పార్టీలో చీలికలు, శిగపట్లు జరిగాయి. అయితే జయలలిత ప్రజాకర్షణ గలిగిన నాయకురాలిగా నిలదొక్కుకున్నారు. ప్రస్తుతం అన్నాడిఎంకె నాయకత్వం దానికి పూర్తి విరుద్ధమైన దిశలో వెళ్తోంది. తమ మధ్య వచ్చిన పొరపొచ్చాలను పరిష్కరించే పనిని బిజెపి చేతుల్లో పెట్టడమంటే పార్టీ ఆత్మహత్యకు పాల్పడడమే. ఏమైనా అన్నాడిఎంకెలో రెండు వర్గాల విలీనంతో కథ సుఖాంతం కాలేదని దినకరన్ వర్గం ఎంఎల్‌ఎలు నేడు గవర్నరును కలిసిన ఉదంతం తెలియజేస్తోంది. రానున్న రోజుల్లో పార్టీలోని వివిధ వర్గాలు ఎటువంటి వైఖరి తీసుకుంటాయన్న దానిపై తమిళనాడు రాజకీయాల గమనం ఆధారపడి ఉంటుంది. ఏమైనా రాష్ట్రంలో ఏర్పడిన సంక్షోభం మరికొంత కాలం ఉంటుందని మాత్రం స్పష్టమవుతోంది. పార్టీల బలాబలాలను తేల్చే వేదికైన శాసన సభేనని గతంలో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును అందరూ గుర్తెరిగి మెలగాలి. అలా కాకుండా బిజెపి చేస్తున్న తెరవెనుక రాజకీయాల వల్ల ప్రజాస్వామ్యం బలహీన పడుతుంది.


మహనీయుల మాట



చదువుకున్న పౌరులు లేకుండా ఏ దేశమూ అభివృద్ధి చెందలేదు. కట్లు తెంపుకోవడానికి కత్తిలాంటి ఆయుధం చదువొక్కటే.

- నెల్సన్ మండేలా


మాంద్యం సుడిలో ఆర్థిక వ్యవస్థ



ప్రభాత్ పట్నాయక్

ప్రజా ప్రస్థానం

ఆర్థిక మంత్రిత్వ శాఖ ప్రచురించిన ఆర్థిక సర్వే రెండవ సంపుటి భారత ఆర్థిక వ్యవస్థ తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయినట్టు చెబుతున్నది. 2016-17 సంవత్సరంలో వాస్తవంలో జోడింపబడిన స్థూల విలువ (గ్రాస్ వాల్యూ యాడెడ్-జీవీఏ) 6.6 శాతం. స్థూల జాతీయోత్పత్తిలో నికర పరోక్ష పన్నులు కలిసి ఉంటాయి కాబట్టి అది ఉత్పత్తి ధోరణులను వాస్తవంగా ప్రతిబింబించదు. కాబట్టి జీవీఏని చూడటమే సరైన పద్ధతి. ఇదే విలువ 2015-16లో 7.9 శాతంగా ఉన్నది. అంతకంటే ముఖ్యమైన విషయం ఏమంటే 2016-17లో జీవీఏ త్రైమాసిక వృద్ధి రేటు ప్రతి త్రైమాసికంలో క్షీణిస్తూ వచ్చింది. కేవలం 5.6 శాతంగా వున్న నాలుగవ త్రైమాసిక వృద్ధి రేటు అంతకు ముందు ఏడాది 2015-16 లోని అదే త్రైమాసికంలో కంటే దాదాపు 3 శాతం తక్కువగా ఉంది. అంతేకాకుండా ఈ వృద్ధి రేటు కూడా కృత్రిమంగా రెండు కారకాల కారణంగా బలోపేతమైంది. ఆ రెండు కారకాలు ఏమంటే వాతావరణం అనుకూలించటం వల్ల పంటలు బాగా పండటం. ఏడవ వేతన సంఘం సిఫారసులు అమలు వల్ల ప్రభుత్వ పాలన, రక్షణ రంగాలలో వ్యయం పెరగడం. ఉదాహరణకు వ్యవసాయ రంగంలో వాస్తవ జీవీఏ వృద్ధి రేటు 2016-17లో 4.9 శాతం ఉంటే అంతకు ముందుటేడాదిలో అది కేవలం 0.7 శాతంగా ఉంది. ఇక ప్రభుత్వ, రక్షణ రంగాలలో 2016-17లో వాస్తవ జీవీఏ వృద్ధి రేటు 11.3 శాతం ఉండగా అంతకు ముందు ఏడాది అది కేవలం 6.9 శాతం వుంది. మనం ఈ రెండు రంగాలను తీసివేసి చూస్తే సర్వేలో చెప్పినట్టు 'అసలైన జీవీఏ' వస్తుంది. 2015-16 లోని జీవీఏ వృద్ధి రేటైన 9.8 శాతంతో పోల్చినప్పుడు 2016-17లో ఈ వృద్ధి రేటు కేవలం 6.2 శాతంగా ఉంది. అంటే 3.6 శాతం వృద్ధి రేటు పతనమైందన్నమాట. ఏడాదంతా వృద్ధి రేటు తక్కువగా ఉండటమే కాకుండా అది క్రమేణా పతనమవుతూ వచ్చింది. చివరి త్రైమాసికానికి వచ్చేసరికి 2015-16తో పోల్చినప్పుడు ఆ మరుసటి ఏడాది 6.8 శాతం దాకా పతనమైంది. ఇది తిరుగులేని పతనం. అంతేకాకుండా ఈ క్షీణత తప్పకుండా వచ్చే ఏడాది కూడా కొనసాగుతుంది. ఇందుకు మూడు కారణాలున్నాయి. ప్రభుత్వ, రక్షణ రంగాల వ్యయంలో జరిగిన పెరుగుదల ఇక ముందు ఉండదనేది మొదటిది. దీనితో ఆర్థిక వ్యవస్థ రెండు విధాలుగా ప్రభావితం అవుతుంది. ఈ రంగంలో వృద్ధి రేటు స్పష్టంగా మందగిస్తుందనేది మొదటిది. అయితే స్పష్టంగా లేని రెండవ కారణం ఈ విధంగా ఉంటుంది. ఒకవేళ ప్రభుత్వం వేతనాలను రూ.100 పెంచిందనుకుందాం. ఇది ప్రత్యక్షంగా ఆ మేరకు ఉత్పత్తి పెరిగినట్టుగా కనిపిస్తుంది. అయితే దీనితో ఆ రూ.100 ఖర్చు కావటంతో డిమాండ్ పెరిగి ఇతర రంగాలలో ఉత్పత్తి పెరుగుతుంది. అప్పుడు ఆ రంగాలలో అదనపు ఆదాయం వస్తుంది. అలా చేతికందిన అదనపు ఆదాయాలను కూడా ఖర్చు చేయటంవల్ల మరిన్ని ఆదాయాలు వస్తాయి. ప్రభుత్వ ఖర్చులో చోటుచేసుకునే ఈ పెరుగుదలను 'గుణకార ప్రభావం' అంటారు. అప్పుడు ఏ రంగాలలోనైతే ఆదాయాలు వచ్చాయో ఆ ఆదాయాలను ఖర్చు చేయడంతో మరింతగా ఆదాయాలు పెరగటానికి దారితీస్తుంది. ప్రభుత్వ వ్యయం రూ.100 పెరిగినా 'గుణకార ప్రభావం'తో జీవీఏ గణనీయంగా 300 లేక అంతకు మించి పెరుగుతుంది. ఏడవ వేతన సంఘం సిఫారసులను ప్రభుత్వం అమలు చేయటం వల్ల జీవీఏ పెరిగిందని సర్వే పేర్కొన్నప్పుడు అది మొత్తం ఆర్థిక వ్యవస్థపై 'గుణకార ప్రభావం' గురించి కాకుండా ఈ రంగంలోని జీవీఏ పెరుగుదలను మాత్రమే సూచిస్తున్నది. 2016-17లో 'కీలక' రంగంలో జరిగిన వృద్ధి రేటు కూడా ప్రభుత్వ పాలన, రక్షణ రంగాలలో చేసిన ప్రభుత్వ వ్యయంతో బలోపేతమైంది. అది ఈ రంగాలలో జరిగిన జీవీఏలో ప్రతిబింబించింది. వాస్తవం ఇలా వున్నప్పటికీ... ఒకవేళ 2016-17లో జీవీఏ వృద్ధి రేటు కేవలం 6.2 శాతం మాత్రమే వుంటే, అలా బలోపేతం చేయకుండా వుంటే, పరిస్థితి ఎంత దారుణంగా ఉండేదో ఊహించుకోవచ్చు. అయితే ఊహించినట్టుగానే వచ్చే ఏడాది ఇలా బలోపేతం చేయటం కుదరదు గనుక దీని గుణకార ప్రభావం ఉండదు. కాబట్టి మొత్తంగా చూసినప్పుడు జీవీఏ పెరుగుదల గణనీయమైన కుదింపునకు గురవుతుంది. విద్యుత్, టెలికమ్యూనికేషన్ రంగాలకు చెందిన అనేక కంపెనీల బ్యాలన్స్ షీట్లు (ఆస్తులు-అప్పుల నివేదిక) ప్రతికూలంగా మారటంతో ఈ క్షీణత మరింత వేగవంతం కావటం రెండవ కారకంగా ఉంటుంది. ఇలా ప్రతికూలంగా మారిన బ్యాలన్స్ షీట్లు, ముఖ్యంగా ఇటువంటి కంపెనీలకు పెద్ద ఎత్తున అప్పులు ఇవ్వటం వలన ఏర్పడిన నిరర్థక ఆస్తులు ప్రభుత్వ రంగ బ్యాంకులకు ప్రమాదకారిగా మారతాయి. ఎందుకు ప్రభుత్వ రంగ బ్యాంకులే ప్రమాదంలో పడుతున్నాయి? అనే ప్రశ్నను అడగవలసిన అవసరం ఉన్నది. 'ప్రాథమిక సౌకర్యాల' అభివృద్ధి పేరిట ప్రభుత్వం ఈ రంగం లోని కార్పొరేట్ కంపెనీలకు ప్రభుత్వ రంగ బ్యాంకుల చేత పెద్ద ఎత్తున అప్పులు ఇప్పించటంవల్ల ఈ పరిస్థితి ఏర్పడింది. ప్రయివేటు రంగంలోని బ్యాంకులు, విదేశీ బ్యాంకులు ఈ ఉచ్చులో పడకుండా తమ తెలివితేటలను ప్రదర్శించాయి. ప్రభుత్వం ఈ బ్యాంకులను బలవంతపెట్టలేకపోయింది. తత్ఫలితంగా ప్రయివేటు రంగ బ్యాంకులు కాకుండా ప్రభుత్వ రంగ బ్యాంకులు సంక్షోభంలో పడ్డాయి.



ప్రభుత్వరంగ బ్యాంకులు వత్తిడికి గురవుతున్నాయనే పేరుతో ప్రభుత్వం వాటిని ప్రయివేటీకరించాలనుకోవటం ఒక వింత! ప్రభుత్వం వత్తిడి చేసి ప్రయివేటు కంపెనీలకు అప్పులు ఇప్పించి ప్రభుత్వ రంగ బ్యాంకులను సంక్షోభంలో పడేలా చేసింది. ఇప్పుడు అదే ప్రభుత్వం 'ప్రయివేటు బ్యాంకులు అప్పులు ఇవ్వటంలో తెలివిగా వ్యవహరిస్తాయనే' పేరుతో ఈ బ్యాంకులను ప్రయివేటీకరించాలని ప్రయత్నిస్తోంది!

ఇలాంటి పరిస్థితిని ఎదుర్కొంటున్న ప్రభుత్వ రంగ బ్యాంకులు కొత్తగా అప్పులు ఇవ్వటానికి జంకుతున్నాయి. ఆర్థిక వ్యవస్థలో మాంద్య పరిస్థితుల వల్ల కొత్తగా అప్పులు అడిగేవారు కూడా తగ్గిపోయారనుకోండి. అయితే అప్పు కోసం ఉన్న డిమాండ్ కంటే ఇచ్చిన అప్పు తక్కువగా ఉన్నదని సర్వే తెలియజేస్తున్నది. ఈ పరిస్థితి రాబోయే రోజుల్లో కూడా మారదు. అందుకు భిన్నంగా 2017-18లో ఇది మరింతగా కుంగదీసి ఆర్థికాభివృద్ధిని దెబ్బ తీస్తుంది. ప్రభుత్వరంగ బ్యాంకులు వత్తిడికి గురవుతున్నాయనే పేరుతో ప్రభుత్వం వాటిని ప్రయివేటీకరించాలనుకోవటం ఒక వింత! ప్రభుత్వం వత్తిడి చేసి ప్రయివేటు కంపెనీలకు అప్పులు ఇప్పించి ప్రభుత్వ రంగ బ్యాంకులను సంక్షోభంలో పడేలా చేసింది. ఇప్పుడు అదే ప్రభుత్వం 'ప్రయివేటు బ్యాంకులు అప్పులు ఇవ్వటంలో తెలివిగా వ్యవహరిస్తాయనే' పేరుతో ఈ బ్యాంకులను ప్రయివేటీకరించాలని ప్రయత్నిస్తోంది!

మూడోది, విదేశీ రంగానికి సంబంధించినది. అమెరికా ప్రస్తుతం వడ్డీ రేట్లను పెంచే ఆలోచన చేయటంలేదనేది సుస్పష్టం. ఇలాంటి పరిస్థితులలో ఎక్కువ వడ్డీ రేటుగల భారతదేశం వంటి దేశాలకు విదేశీ ద్రవ్య పెట్టుబడులు వెల్లువెత్తుతాయి. ఇది ఆయా కరెన్సీల మారకపు రేటు పెరగటానికి దారితీస్తుంది. సమీప భవిష్యత్తులో పెరుగుతున్న భారత మారకపు విలువ తగ్గే అవకాశం లేదు. ఈ మధ్యకాలంలో చైనా తన కరెన్సీ విలువను తగ్గించిన నేపథ్యంలో ఇది జరుగుతున్నది. దీని ప్రభావంవల్ల అసలే అంతంత మాత్రంగా వున్న భారతదేశ ఎగుమతుల వృద్ధి రేటు క్షీణించే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా అమెరికా బయటి నుంచి చేయించుకుంటున్న సేవలను నిరోధించేందుకు డొనాల్డ్ ట్రంప్ ప్రయత్నిస్తున్న ప్రస్తుత తరుణంలో భారత సేవారంగ ఎగుమతులు ప్రతికూల పరిస్థితిని ఎదుర్కొంటాయి.

మనం ఈ కారకాలన్నింటినీ జత చేసినప్పుడు 2017-18లో భారత ఆర్థిక వ్యవస్థలో వృద్ధి రేటు గణనీయంగా మందగిస్తుందనేది సుస్పష్టం. 2016-17లో జీవీఏని బాగా నమోదు చేసిన వ్యవసాయ రంగంలో కూడా క్షీణత ఉంటుంది. క్లుప్తంగా చెప్పాలంటే ఆర్థిక వ్యవస్థ పీకలదాకా మాంద్యంలో మునుగుతుంది. అందుబాటులో వున్న సమాచారం ప్రకారం గత రెండేళ్లలో సంఘటిత రంగంలో ఉద్యోగ కల్పన తీవ్ర స్థాయిలో క్షీణించింది. ఈ క్షీణత మరింతగా తీవ్రతరం కాబోతున్నది. నిజానికి ఈ సర్వే ద్రవ్య నిర్వహణను సరిదిద్దుకోవాలనే సూచించింది. ఎందుకంటే ఈ ప్రభుత్వం తన ద్రవ్య లోటును నియంత్రించే ఎఫ్‌ఆర్‌బీఎమ్ నిబంధనలకు కట్టుబడి ఉన్నది. అంటే తాను చేపట్టిన రూ.100 రుణం స్థాయిలో సమిష్టి డిమాండ్ కుదింపునకు గురవుతుంది. డిమాండ్ తగినంతగా లేని ఆర్థిక వ్యవస్థలో ఎఫ్‌ఆర్‌బీఎమ్ నిబంధనలను ఉల్లంఘించటానికి ఎందుకు వెనుకాడవలసి వస్తుందో సర్వే పేర్కొనలేదు. ఆర్థిక వ్యవస్థ సంక్షోభంలో కూరుకుపోతున్నప్పుడు, దానికి పరిష్కారంగా ప్రభుత్వ వ్యయాన్ని పెంచవలసి వచ్చినప్పుడు తాను చేసిన పనికి మాలిన చట్టం చట్రంలో ప్రభుత్వం ఎందుకు ఖైదీగా ఉండాలి? ఎఫ్‌ఆర్‌బీఎమ్ నిబంధనలను బేఖాతరు చేస్తే అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడికి కోపం వస్తుందనేది నిజం. అయితే ఈ దేశాన్ని ఈ దేశ ప్రజల ప్రయోజనం కోసం నడపాలా లేదా అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి ప్రయోజనం కోసం నడపాలా? ఒకవేళ అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి తన పెట్టుబడులను ఉపసంహరించుకోదలిస్తే (అది అంత సులువు కాదు) అటువంటి తీవ్ర పరిస్థితులలో పెట్టుబడుల ప్రవాహాలపై నియంత్రణ విధించటం 'ఎల్లవేళలా తప్పు కాదు' అని ఇప్పుడు అంతర్జాతీయ ద్రవ్య నిధి కూడా అంగీకరిస్తున్నది కదా. అయితే ఇదంతా ఎన్‌డీఏ ప్రభుత్వ వివేకంలో భాగంగా లేదు. ★

'పాము'ల చుట్టూ సీరియళ్ళు

ప్రజాగళం

ప్రతి ఒక్కరికీ టీవీ చూడడం జీవితానికి అత్యవసరమైన దినచర్యగా మారిపోయింది. ఇది వరకు ఆడవారంటే సీరియళ్ళు, మగవాళ్ళు స్పోర్ట్స్, ఇంగ్లీషు ఛానళ్ళు, పిల్లలు కార్టూన్ ఛానళ్ళు చూస్తారనే ముద్ర ఉండేది. ఇప్పుడలా కాదు. సర్వజన సమానత్వం. కుటుంబంలో ఏ బేధం లేకుండా అందరూ ఇప్పుడు సీరియళ్ళే చూస్తున్నారనేది అతిశయోక్తి కాదు. అందునా సీరియళ్ళు కొనసాగించడానికి ఒక్కో సమయంలో ఒక్కో ట్రెండ్‌ను తీసుకువస్తున్నారు. కొన్నాళ్లు ప్లాస్టిక్ సర్జరీలు విరివిగా సాగితే, తరువాత కొన్నాళ్ళు ప్రేతాత్మలు రాజ్యమేలాయి. ట్రెండ్ ఏదైనా చిన్న చిన్న విషయాలకే తరతరాలు పగబట్టి చంపుకునే శాడిస్టు ప్రయత్నాలే ఈ సీరియళ్ళ సారాంశం. అందులో ఇప్పుడు సాగుతున్న ట్రెండ్ పాములు.



ప్రకృతికి సంబంధించినంతవరకు పాము ఒక విష జంతువు. దాని మనుగడ కోసం అది ఆహారాన్ని వెతుక్కుంటుంది. ఆత్మరక్షణ కోసం కాటు వేస్తుంది. కానీ ఇప్పుడు అనేక ఛానళ్ళ లో ప్రసారం అవుతున్న పోటాపోటీ పాముల సీరియళ్ళు ఆ వాస్తవాన్ని మరుగునపడేశాయి. గ్రాఫిక్స్ ఉపయోగించి అతి జుగుప్సాకరమైన సన్నివేశాలతో జనాన్ని ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నాయి. ఒక సీరియల్లో దయ్యానికి పాముకు పోటీ, ఒక సీరియల్లో మనుషులకు పాముకు పోటీ, ఇంకొక దాన్లో పాముకు పాముకు పోటీ. ఈ పోటాపోటీ సన్నివేశాల్లో మరింత మసాలా వేయడానికి గ్రాఫిక్స్ మాయాజాలం. సగం పాము - సగం మనిషి, ప్రపంచాన్ని కాపాడే నాగమణి, ఆ నాగమణి దుష్టుల చేతుల్లో పడకుండా కాపాడే ఓ కుటుంబం ఇలా సాగుతున్నాయి ఆ సీరియళ్ళు.

ప్రపంచాన్ని నాగమణే కాపాడుతుంటే ఇన్ని ఉత్పాతాలు, దుర్మార్గాలు జరగకుండా ఆగలేదేం? అసలు సగటు ఆయుర్దాయం 20 ఏళ్ళకు మించని పాము ... మనిషి రూపంలో వందేళ్ళు ఎలా బతుకుతుంది? ఈ ప్రశ్నలు వేస్తేనే పాపం అన్నట్లు పిల్లల ఆలోచనల్ని మలుస్తుంటే వారిలో మనం కలిగిస్తున్న చైతన్యం ఏమిటి? విజ్ఞాన ఫలాల్ని మనం అనుభవిస్తున్నాం. వాటి వల్లే మనిషి జీవితం ఎంతో సాఫీగా, వేగంగా కదులుతుంటే మనం ఆ విజ్ఞానాన్ని వదిలేసి మూఢనమ్మకాల్ని ఆచరిస్తున్నాం.

రెండున్నర గంటలు సినిమాను ఎవరు చూడాలి, ఫలానా సన్నివేశం చూడొచ్చా చూడకూడదా అని నిర్ణయించే సెన్సార్ బోర్డు ఇంటిల్లిపాది ఏళ్ళ తరబడి చూసే ఈ కార్యక్రమాలకు ఎందుకు వర్తించదు. ఇప్పటికే చాలా మంది పిల్లలు ఈ పాముల సీరియళ్ళు చూసి తమ ఇంట్లో అద్దాన్ని చూసి భయపడుతున్నారు. తమ గదిలోనే ఒక మూలకు వెళ్ళడానికి భయపడుతున్నారు. ఇంత భయంకరమైన సన్నివేశాలను పిల్లలు చూస్తుంటే అది వారి మనస్సులపై ఎంత దుష్ప్రభావం చూపిస్తుంది? పసి మనసులు ఎంత ఉద్వేగాలకు లోనవుతాయి? చాలామంది పిల్లల్లో భయం, పీడకలలకు గురై వారి మానసిక ఆరోగ్యాలు పాక్షికంగా దెబ్బ తింటున్న పరిస్థితి కనబడుతోంది.

ఇప్పటి వరకు శాస్త్రవేత్తలు పాములు పాలు తాగవు, మీరు వేసే గుడ్లు తినవు అని నిరూపించడానికి నానా తంటాలు పడుతున్నారు. నాగులచవితికి మనం పుట్టలో వేసే గుడ్లు మధ్యాహ్నానికి మన పక్క సందులో గంపలు, గంపలుగా అమ్మకానికి పెడతారని మనకందరికీ తెలుసు. అయినా మన తర్కాన్ని మన భయం తొక్కేస్తుంది. మన పెద్దలు మన మీద రుద్దిన మూఢనమ్మకాల వల్ల మనం ఇంత వివేచనా శక్తిని కోల్పోతే రేపటి తరాలు ఎలా తయారవుతాయి? అందుకే వారి ప్రశ్నలకు సరైన సమాధానాలు ఇవ్వాలి. అందులోనే మనకూ సమాధానం దొరుకుతుంది. వాస్తవానికి టీవీల్లో ప్రసారమయ్యే ఈ తరహా కార్యక్రమాలు చూసేందుకు పిల్లలను ప్రోత్సహించకుండా వుంటేనే మంచిది. ప్రభుత్వం కూడా ఇటువంటి మూఢనమ్మకాలను ప్రేరేపించే కార్యక్రమాలను, భావోద్వేగాలపై దుష్ప్రభావాలు చూపించే కార్యక్రమాలు ప్రసారం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలి.

గీతావాణి వల్లభనేని

కమలం నీడలో రెండాకులు




జయలలిత మరణం తర్వాత రెండుగా చీలిన 'రెండాకుల' గుర్తు కలిగిన అన్నాద్రవిడ మున్నేట్ర కజగం (అన్నాడిఎంకె) పార్టీ... కేంద్ర పెద్దల సౌజన్యంతో మళ్ళీ ఒక్కటయ్యింది. అయితే విడిపోయిన ఆ రెండాకులూ ఎంత పటిష్టంగా, ఎంతకాలం కలిసి ఉంటాయో చెప్పడం కష్టం. రెండుగా చీలిన ఈ పార్టీలో ఒక గ్రూపుకు నాయకత్వం వహిస్తున్న ఈపీఎస్ (పళనిస్వామి), మరో గ్రూపు లీడర్ ఓపీఎస్(పనీర్ సెల్వం)లు ఇప్పుడు యూపీఎస్ మీద ఆధారపడ్డారు. అంటే ఈ కలయిక తాత్కాలికమే. ఏఐడీఎంకే పార్టీ కి అసలు కరెంటు జయలలిత. ఆమె మరణంతోనే ఆ పార్టీ మనుగడ ప్రశ్నార్థకమైందనొచ్చు. ఇక మిగిలిన పార్టీ పెద్దలు తమలోనే ప్రత్యామ్నాయం వెదుక్కోకుండా యూపీఎస్ (కేంద్రం) మీద ఆధారపడ్డారు. ఏక వ్యక్తి పాలన వున్న ఏ పార్టీ అయినా ఇదే రకం పరిస్థితి ఎదుర్కోవడమనేది సర్వసాధారణం. అయితే ఆ తరహా సంక్షోభం నుంచి త్వరగా బయటపడాలి. తమ సిద్ధాంతాల కనుగుణంగా ప్రజామద్దతు పొందాలి. లేని పక్షంలో ప్రజాజీవితంలో మనుగడ కోల్పోవడం ఖాయం. అందుకే కమలం నీడలో రెండాకులూ వడలిపోకూడదంటే ప్రజాపాలనపై దృష్టి పెట్టాలి.

డా.డి.వి.జి.శంకరరావు, పార్వతీపురం.


ఎగ్జిబిషన్లకూ జిఎస్‌టి తిప్పలు

కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన జిఎస్‌టి విధానం ఒక్కో రంగాన్ని ఒక్కో విధంగా కుదిపేస్తోంది. వినోదంపై వేసిన పన్నులో భాగంగా ఎగ్జిబిషన్లకూ జిఎస్‌టి తిప్పలు తప్పడం లేదు. ఇతర రాష్ట్రాల నుంచి మన రాష్ట్రంలో ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేసే వారికి జిఎస్‌టి తర్వాత టెంపరరీ జిఎస్‌టి నెంబరు 90 రోజుల వరకు తీసుకోవచ్చని అనుమతి ఇచ్చారు. కాని ఈ టెంపరరీ నెంబరు కేటాయించడంలో జాప్యం జరుగుతోంది. దాని వలన హాలు రిజర్వు చేసుకొన్న తేదీలకు ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేయలేక పోతున్నారు. దీంతో హాలు నిర్వాహకులు కూడా నష్టపోతున్నారు. అంతేకాక ఇన్‌వెన్స్‌ల ప్రకారం బిల్లులు రాసి 9 శాతం సిజిఎస్‌టి, 9 శాతం ఎస్‌జిఎస్‌టిగా వసూలు చేసి ఆన్‌లైన్లోనే కట్టవలసిందిగా చెబుతున్నారు. అంటే తప్పని సరిగా ఆడిటర్స్ పర్యవేక్షణలోనే రిటర్నులు ఇవ్వవలసిందిగా ఈ జిఎస్‌టి విధానాలు వున్నాయి. ఇది సామాన్య వ్యాపారస్తుడికి కంటకంగా మారింది. అందుకే ఈ టెంపరరీ జిఎస్‌టి నెంబరు జారీ చేసే విధానంలో సడలింపులు ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా వుంది. ఏదేమైనా ఈ విధానంలో జిఎస్‌టి ప్రొవిజనల్ నెంబరును ప్రతి వ్యాపారస్తుడికి, ఇతర ముఖ్యుల ద్వారా జిఎస్‌టి చెల్లించే వార్కి, త్వరిత గతిన అందేవిధంగా చూడాల్సిన బాధ్యత కేంద్రానిదే.




కె రమణారావు, విజయవాడ.

దేశభక్తిని నిరూపించుకోవాల్సింది మోడీనే !



జె.ప్రభాకర్

చర్చ



స్వాతంత్ర్య సంగ్రామంలో ఎక్కడా కానరాని ఆర్‌ఎస్‌ఎస్ ఇపుడు దేశభక్తి గురించి మాట్లాడటం విడ్డూరమే. మోడీకి నిజంగా దేశభక్తి ఉంటే మన దేశ ప్రజలకు అవసరమైన వస్తువులు మన దేశంలోనే తయారు చేసి దేశ స్వావలంబన సాధించాలి. కానీ ఆర్‌ఎస్‌ఎస్, మోడీ బృందం ఆ పని చేయకుండా ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టడానికి ప్రయత్నిస్తోంది .

'దేశభక్తి ఉన్నవారు చైనా వస్తువులను బహిష్కరించండి' అంటూ ఇటీవల 'స్వదేశీ జాగరణ్ మంచ్' లాంటి కొన్ని సంస్థలు కరపత్రాలు వేసి ప్రచారం చేస్తున్నాయి. ఆరెస్సెస్ ప్రధాన కార్యదర్శి సురేష్ భయ్యాజీ జోషీ, యోగా గురువు రామ్‌దేవ్ బాబాలు చైనా వస్తువులను బహిష్కరించాలని స్వాతంత్ర్య దినోత్సవం నాడు పిలుపునిచ్చారు. 'స్వదేశీ జాగరణ్ మంచ్' కార్యదర్శి చైనా వస్తువులపై అధిక పన్నులు వసూలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 'చైనా వస్తువులు నకిలీవని, నాణ్యత లేనివని, అక్రమంగా దేశంలోకి ప్రవేశిస్తున్నాయని, చైనా టపాసుల్లో హానికర రసాయనాలు ఉన్నాయని, దేశభక్తి ఉన్నవారు చైనా వస్తువులను బహిష్కరించాలని' ఆర్‌ఎస్‌ఎస్ ప్రచారం చేస్తోంది. గతంలోనూ ఇటువంటి ప్రచారమే సోషల్ మీడియాలో పెద్దయెత్తున సాగింది.

పాక్, చైనా వస్తువులను నిషేధించాలని, పాకిస్తాన్ క్రికెట్ టీమ్‌ను భారతదేశంలో అనుమతించవద్దని, పాక్ నటుల సినిమాలను నిషేధించాలని ఆర్‌ఎస్‌ఎస్ గ్రూపులు ప్రచారం చేసిన కాలంలోనే మోడీ సర్కారు పాకిస్తాన్‌తోనూ, చైనాతోనూ ఎటువంటి అంతరాయం కలగకుండా వాణిజ్యం కొనసాగించింది. ఒకవైపు ఆర్‌ఎస్‌ఎస్ బృందాలే పాకిస్తాన్, చైనా వస్తువులను నిషేధించాలని ఊరూరా ప్రచారం చేస్తాయి. మరోవైపు వారే అధికారంలో ఉండి చైనాతో వ్యాపార ఒప్పందాలు చేసుకుంటారు. అంటే మోడీ బృందానిది నిజమైన దేశభక్తి కాదా!

యూరీ సెక్టార్‌లో సైనిక స్థావరంపై పాక్ మిలిటెంట్ల దాడి సందర్భంగా పాక్, చైనా వస్తువుల బహిష్కరణ ప్రచారం సాగింది. పాకిస్తాన్‌కు చైనా మద్దతు ఉందని, ఆయుధాలు సరఫరా చేస్తుందని అందుకే చైనా వస్తు బహిష్కరణ చేయాలని ప్రచారం చేశారు. పాకిస్తాన్‌కు సహాయం చేసినందున చైనా వస్తువులను బహిష్కరించాల్సిందే. మరి స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుండి పాక్‌కు ఆయుధాలు సరఫరా చేసింది అమెరికానే కదా? ఇటీవల పాక్‌లో ఉగ్రవాదుల వద్ద దొరికిన ఆయుధాలు కూడా అమెరికా తయారు చేసినవే కదా? అగ్రరాజ్యం అమెరికా - చైనా మధ్య 2016-17లో 578 బిలియన్ డాలర్ల వాణిజ్యం, అమెరికా - పాకిస్తాన్ మధ్య 5.5 బిలియన్ డాలర్ల వాణిజ్యం జరిగింది. మనకు గిట్టని పాకిస్తాన్‌కు ఆయుధాలు సరఫరా చేయడంతోపాటు పాక్- చైనాలతో వ్యాపారం చేస్తున్న అమెరికా వస్తువులను మనం బహిష్కరించవద్దా? అయినా అమెరికా వస్తువులను బహిష్కరించమని ఆర్‌ఎస్‌ఎస్ దాని అనుబంధ సంఘాలు చెప్పడంలేదు. మన దేశపు మొత్తం దిగుమతుల్లో చైనా వస్తువులు 16 శాతం ఉన్నాయి. వాటిని బహిష్కరించి మిగిలిన 84 శాతం విదేశీ వస్తువుల దిగుమతిని ఆమోదించడం దేశభక్తా? మొత్తం విదేశీ వస్తువులపై నిషేధం విదించి మోడీ ప్రభుత్వం తన దేశభక్తిని నిరూపించుకోవాలి.

స్వావలంబన ముఖ్యం

బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా సాగిన స్వాతంత్ర్యోద్యమంలో విదేశీ వస్తు బహిష్కరణ, క్విట్ ఇండియా నినాదాలు ముఖ్యమైనవి. కాని గత 25 ఏళ్లుగా సరళీకరణ ఆర్థిక విధానాలు తీసుకువచ్చి కాంగ్రెస్, బిజెపి ప్రభుత్వాలు విదేశీ కంపెనీలకు ఆహ్వానాలు పలుకుతున్నాయి. మోడీ పాలనలో సామ్రాజ్యవాదుల ప్రయోజనాలకు పెద్దపీట వేయడం పెరిగింది. బిజెపి నేతలు నేడు 'వెల్‌కమ్ ఇండియా' అంటూ విదేశీ కంపెనీలకు ఎర్ర తివాచీలు పరుస్తున్నారు. ఏ ప్రధాని చేయనన్ని విదేశీ పర్యటనలు మోడీ చేశారు. విదేశీ పెట్టుబడులను ఆకర్షించడానికి తెగ ఆరాటపడుతున్నారు. ఒక వైపు దేశంలో ఉన్న ప్రభుత్వ రంగ పరిశ్రమలను ఒక్కొక్కటిగా మూసివేస్తూ, మరోవైపు విదేశీ కంపెనీలకు తలుపులు బార్లా తెరుస్తున్నారు. చివరకు ఆహారధాన్యాలు, నూనెలు, పప్పులు, ఎరువులు సైతం దిగుమతి చేసుకుంటున్నాము. మన దేశంలో చౌకగా లభ్యమవుతున్న ఆయిల్, గ్యాస్‌లను అంబానీ లాభాల కోసం విదేశాలకు తరలిస్తుంటే, మనం మాత్రం దేశానికి అవసరమైన చమురును అధిక ధరకు దిగుమతి చేసుకుంటాము. దేశాభివృద్ధి మీద మన పాలకులకు ఎంత చిత్తశుద్ధి!

చైనా వస్తువులను బహిష్కరించాలంటే దానికి ముందు మనకు అవసరమైన వస్తువులను మనం తయారు చేసుకోవాలి. ఎన్నికల్లో గెలిస్తే 100 రోజుల్లో విదేశాల్లో ఉన్న నల్లధనాన్ని వెనక్కి రప్పిస్తానని వాగ్దానం చేసిన మోడి అధికార పీఠం ఎక్కి మూడేళ్ళవుతున్నా ఇంతవరకూ నల్లధనం కాదు కదా దాని నీడను కూడా తేలేదు. నల్లధనాన్ని తీసుకు వచ్చి చైనా కంటే నాణ్యమైనవి, చౌకయినవి మన దేశంలో తయారు చేస్తే, ఏ భారతీయుడూ చైనా వస్తువులను కొనడు.

ఎందుకీ ప్రచారం?


ఇండియా-చైనా మధ్య వాణిజ్యం క్రమంగా పెరుగుతోంది. మరోవైపు బ్రిక్స్ ఏర్పాటుతో రష్యా, చైనాలతో మన దేశం సంబంధాలు మరింత మెరుగుపర్చుకుంటుంది. దేశ ఆర్థిక వ్యవస్థ బలపర్చుకొనే ఈ పరిణామాలు అమెరికాకు మింగుడు పడటంలేదు. అతిపెద్ద మార్కెట్ కలిగిన భారతదేశం తమ ప్రయోజనాలకు అనుకూలంగా ఉండాలని బహుళజాతి కంపెనీలు పట్టుబడుతున్నాయి. మోడీ ప్రభుత్వం మన దేశాన్ని అమెరికాకు జూనియర్ భాగస్వామిగా మార్చింది. అమెరికాను ప్రసన్నం చేసుకోవడమే లక్ష్యంగా చైనా వస్తువుల బహిష్కరణకు ఆర్‌ఎస్‌ఎస్, స్వదేశీ జాగరణ్ మంచ్ లాంటి సంస్థలు ప్రచారం చేస్తున్నాయి. నల్లధనాన్ని అరికట్టడానికి, ఉగ్రవాదాన్ని అంతం చేయడానికి, దొంగనోట్లను అడ్డుకోవడానికి అంటూ అర్ధరాత్రి హడావిడిగా చేసిన పెద్దనోట్ల రద్దు కొండను తవ్వి ఎలుకను పట్టినట్టయ్యింది. జిఎస్‌టి వల్ల సరుకుల ధరలు బాగా తగ్గుతాయని చేసిన ప్రచారం అబద్ధమని నెలరోజుల్లోనే ప్రజలు గ్రహించారు. రోజురోజుకు 'గో సంరక్షణ' పేరుతో ముస్లింలు, దళితులపై పెరుగుతున్న దాడులు మోడీ ప్రభుత్వ ప్రతిష్టను దిగజార్చాయి. ఈ సమస్యలన్నింటి నుండి దేశ ప్రజల దృష్టిని మరల్చడానికే ఇపుడు వారికి 'దేశభక్తి - చైనా వస్తువుల బహిష్కరణ' ఆయుధాలయ్యాయి.

మోడీ అధికార పీఠం అధిష్టించిన తర్వాత దేశ ప్రజలపై ఆర్‌ఎస్‌ఎస్ భావజాలాన్ని బలవంతంగా రుద్దే ప్రయత్నం చేస్తున్నారు. ప్రజలకు రాజ్యాంగం ప్రసాదించిన హక్కులను కాలరాస్తున్నారు. ఏ బట్టలు వేసుకోవాలో, ఏం తినాలో, ఏ మతం ఆచరించాలో వారే నిర్ణయిస్తున్నారు. ఇపుడు ప్రజలు ఏదేశ వస్తువులు కొనాలో కూడా వారే నిర్ణయించి వాటినే కొనాలని లేదంటే దేశభక్తి లేనట్లేనని శెలవిస్తున్నారు. భారతదేశ ప్రజల దేశభక్తికి ఎవరి సర్టిఫికెట్లు అవసరం లేదు. స్వాతంత్ర్య సంగ్రామంలో ఎక్కడా కానరాని ఆర్‌ఎస్‌ఎస్ ఇపుడు దేశభక్తి గురించి మాట్లాడటం విడ్డూరమే. మోడీకి నిజంగా దేశభక్తి ఉంటే మన దేశ ప్రజలకు అవసరమైన వస్తువులు మన దేశంలోనే తయారు చేసి దేశ స్వావలంబన సాధించాలి. కానీ ఆర్‌ఎస్‌ఎస్, మోడీ బృందం ఆ పని చేయకుండా ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టడానికి ప్రయత్నిస్తోంది. ఆర్‌ఎస్‌ఎస్, దాని అనుబంధ సంఘాలు చేస్తున్న పాకిస్తాన్, చైనా వస్తువుల బహిష్కరణ ప్రచారం ద్వారా ప్రజల మధ్య విద్వేషంతో కూడిన విభజన తెచ్చి హిందూ మతోన్మాద శక్తులు రాజకీయ ప్రయోజనాలు, బహుళజాతి సంస్థల వ్యాపార ప్రయోజనాలు కాపాడాలని చూస్తోంది. కాబట్టి ఇపుడు దేశభక్తిని నిరూపించుకోవాల్సింది ప్రజలు కాదు. దేశాన్ని పాలిస్తున్న మోడీనే. తస్మాత్ జాగ్రత్త! దొంగ దేశభక్తులు మన మధ్యే తిరుగుతున్నారు. విద్వేష ప్రచారంతో మన ఐక్యతను చీల్చడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. కపట దేశభక్తుల నుండి మన దేశాన్ని కాపాడుకుందాం. ★

మెయిల్ @ ప్రజాశక్తి

ప్రజాశక్తి సంపాదక పేజీలో వ్యాసాలు మాత్రమే కాదు. వివిధ విషయాలపై మీ అభిప్రాయాలకు కూడా అవకాశం. మీరు అనుకునే ఏ సమస్య పైనైనా సరే- మరీ సుదీర్ఘం కాకుండా సూటిగా క్లుప్తంగా రాసి పంపించండి లేదా ఇ మెయిల్ చేయండి. వెంటనే ప్రచురిస్తాం.

ఇ- మెయిల్ అడ్రస్ :
editpageps@gmail.com





వినాయక చవితి పేరు వినగానే ఎవరైనా సరే బాల్యాన్ని నెమరేసుకుంటారు. మనలో చాలామంది చిన్నతనంలో తోబుట్టువులతో, దోస్తులతో ఊరంతా కలియతిరిగి పత్రిని తెచ్చుకున్నవారే. అంతేనా ... వినాయకుడి పండగ అనగానే నోరూరించే అంశమూ ఉంది... అవేనండీ మన నోరు తీపి చేసే ఉండ్రాళ్లు. నోట్లో వేసుకోగానే ఆహా ఏమి రుచి అనిపించే తెల్లటి ఉండ్రాళ్లు. ఇంకా కొందరైతే అదే ఉండ్రాళ్ల పిండితో బుల్లి వినాయకుడిని కూడా చేస్తారు. ఈసారి మన పిల్లలతో ఇలా ట్రై చేద్దాం. రుచికి, రుచి బలానికి బలం అనిపించే ఉండ్రాళ్లనూ పాయసాలనీ ఓ పట్టుపడదాం.!!

తియ్యని ఉండ్రాళ్లు

తీపి ఉండ్రాళ్ళు

కావల్సిన పదార్థాలు: బియ్యప్పిండి : కప్పు, బెల్లం: కప్పు, నీళ్ళు : కప్పు, నెయ్యి : రెండు గరిటెలు, వంట సోడా : చిటికెడు, ఉప్పు : చిటికెడు, ఉండ్రాళ్ళలో నింపడానికి పచ్చి కొబ్బరి కోరు : కప్పు, కొబ్బరి పొడి : అరకప్పు, వేయించిన గసాలు : టేబుల్ స్పూను, యాలకుల పొడి: అర టేబుల్‌స్పూను.

తయారుచేసే విధానం : కొబ్బరి, బెల్లం, యాలకుల పొడి, గసాలు కలిపి ఒక పాన్లో వేడి చెయ్యాలి. ఈ మిశ్రమం కాస్త ఉండకట్టే మాదిరి అయ్యే వరకూ ఉంచి దించాలి. గిన్నెలో నీళ్ళు తీసుకుని వేడి చెయ్యాలి. ఉప్పు, నెయ్యివేసి మరిగిన తర్వాత బియ్యప్పిండి కొద్దికొద్దిగా వేస్తూ ఉండలు కట్టకుండా కలుపుతుండాలి. తక్కువ మంటపైన పిండిని ఉడికించి గట్టిపడిన తర్వాత దీన్ని వెడల్పాటి పళ్లెంలోకి తీసుకుని చల్లార్చాలి. పిండిని నెయ్యి రాసుకున్న చేత్తో కలిపి, చిన్న ఉండను తీసుకుని చిన్న బంతిలాగా తయారు చేయాలి. అందులో కొబ్బరి పాకాన్ని కొద్దిగా వేసి గుండ్రంగా ఉండ్రాళ్ళలా చుట్టాలి లేదా మీకిష్టమైన ఆకృతుల్లో చేసి వీటిని తిరిగి ఒక గిన్నెలో పేర్చి కుక్కర్లో ఆవిరిపైన ఉడికించాలి. వీటిని వేడిగానైనా లేదా చల్లారాక అయినా నేతితో తింటే చాలా రుచిగా ఉంటాయి.



పాల ముంజులు

కావలసిన పదార్థాలు: కస్టర్డ్ పౌడర్– ఒక కప్పు, పాలు– అరలీటరు, చక్కెర– పావు కేజీ, నెయ్యి, డాల్డా –రెండు స్పూన్లు, (చిన్న ముక్కలుగా తరిగిన) చెర్రీ పళ్లు తగినన్ని.

తయారుచేసే విధానం: ముందుగా అరకప్పు పాలలో కస్టర్డ్ పౌడర్‌ను కరిగించాలి. మిగిలిన పాలను ఒక పొంగు వచ్చే వరకు మరగనివ్వాలి. చక్కెర వేసి బాగా కలపాలి. అది కరిగిన తర్వాత కస్టర్డ్ పాల మిశ్రమాన్ని పోస్తూ ఉండలు లేకుండా కలపాలి. మిశ్రమం దగ్గరపడిన తర్వాత కిందికి దించాలి. నెయిల్యు, డాల్డా పూసిన ఒక వెడల్పాటి ప్లేటులో ఈ మిశ్రమాన్ని పోసి చెర్రీ ముక్కలతో అలంకరించాలి. చల్లారిన తర్వాత కోవా బిళ్లల్లా గాని, చతురస్రాకారంలో గాని ముక్కలుగా కోసుకోవాలి.



పాల తాళికలు

కావలసిన పదార్థాలు : బియ్యప్పిండి–పెద్ద గ్లాసు, పాలు–ఒక లీటరు, నీళు ్ళ–ఒక లీటరు, సగ్గుబియ్యం–అరకప్పు, మైదాపిండి–అరకప్పు, బెల్లం–అరకిలో, పంచదార–ఒకకప్పు, జీడిపప్పు, కిస్‌మిస్–50గ్రాములు, యాలకుల పొడి–ఒక టీస్పూన్, ఉప్పు–తగినంత.

తయారుచేసే విధానం : మందపాటి గిన్నె స్టవ్‌పై ఉంచి అందులో పాలు, నీళ్లపోసి మరగనివ్వాలి. మరో గిన్నెలో బియ్యప్పిండి, మైదాపిండి, ఒక స్పూను బెల్లం, కొంచెం ఉప్పువేసి మరిగే పాలు కొద్ది కొద్దిగా పోసుకుంటూ పిండిని గట్టిగా కలుపుకోవాలి. తర్వాత మరుగుతున్న పాలలో సగ్గుబియ్యం వేసి, చక్రాల గిద్దలతోగాని, పాలతాళికల మూకుడుతోగాని పిండిని వత్తాలి. ఆఖర్లో చక్రాల గిద్దల్లోగాని, మూకుడులోగాని మిగిలిన పిండిలో కొంచెం నీళ్లపోసి బాగా కలిపి ఆ నీళ్లను కూడా దాంట్లోనే పోయాలి. బెల్లాన్ని మెత్తగా దంచి అందులో కప్పు పంచదార కలిపి, కప్పు నీళ్లపోసి తీగపాకం పట్టుకుని ఈ పాకాన్ని ఉడుకుతున్న పాల తాళికల గిన్నెలోపోసి యాలకుల పొడి వేయాలి. తినేటప్పుడు నేతిలో దోరగా వేయించిన జీడిపప్పు, కిస్‌మిస్ పైన చల్లుకోవాలి.

నవధాన్య పాయసం



కావలసిన పదార్థాలు: పెసలు, శనగలు, బొబ్బర్లు, జొన్నలు, బియ్యం, కందులు, గోధుమలు, సజ్జలు, ఉలవలు: టేబుల్‌స్పూను చొప్పున, బెల్లంతురుము: రెండు కప్పులు, యాలకులపొడి: టీస్పూను, పాలు: లీటరు, జీడిపప్పు: రుచికి సరిపడా, నెయ్యి: రెండు టేబుల్‌స్పూన్లు.

తయారుచేసే విధానం: నేతిలో జీడిపప్పు, బాదంపప్పు వేసి వేయించాలి. పెసలు, శనగలు, బొబ్బర్లు... అన్నీ కూడా ముందు రోజు రాత్రే నానబెట్టుకోవాలి. మర్నాడు వీటిలో సరిపడా నీళ్లపోసి ఉడికించుకోవాలి. ఓ మందపాటి గిన్నెలో పాలుపోసి సగమయ్యే వరకూ మరిగించాలి. తర్వాత ఉడికించిన నవధాన్యాలు, బెల్లంతురుము వేసి ఉడికించాలి. యాలకులపొడి కూడా వేయాలి. చివరగా నేతిలో వేయించిన బాదం, జీడిపప్పు ముక్కలు వేసి కలిపితే సరి.

పాల ఉండ్రాళ్లు

కావలసిన పదార్థాలు: బియ్యప్పిండి: కప్పు, పంచదార, బెల్లం తురుము: కప్పు, యాలకులపొడి: అరటీస్పూను, నెయ్యి: రెండు టీస్పూన్లు, మంచి నీళ్లు: రెండు కప్పులు, పాలు: కప్పు, జీడిపప్పు: తగినన్ని.

తయారుచేసే విధానం: మందపాటి గిన్నెలో రెండు కప్పుల నీళ్లపోసి మరిగించాలి. అందులోనే బియ్యప్పిండి కొంచెం కొంచెంగా వేసి కలుపుతూ ఐదు నిమిషాలు ఉడికించాలి. పిండి చల్లారాక నెయ్యి రాసుకుని ద్రాక్షపండు సైజులో గుండ్రని ఉండల్లా చేయాలి. ఇలా అన్నీ చేసుకుని ఓ గిన్నెలో ఉంచి ఇడ్లీపాత్రలో పెట్టి ఐదు నిమిషాలు ఉడికించి ఆరనివ్వాలి. మరో గిన్నెలో పాలుపోసి మరిగిన తర్వాత పంచదార, బెల్లం తురుము వేసి కరిగించాలి. చల్లారిన ఉండ్రాళ్లను పదినిమిషాలు ఉడికించాలి. దించేముందు యాలకులపొడి, నేతిలో వేయించిన జీడిపప్పు వేసి కలిపితే పాల ఉండ్రాళ్లు రెడీ.



బహుళ ప్రయోజనాలు



బియ్యప్పిండిలో విటమిన్–బి ఉంటుంది. షుగర్, డాల్డా, నెయ్యి, జీడిపప్పు వీటిలో విటమిన్– ఎ, డి, ఇ, కెతో పాటు ప్రొటీన్–ఎన్‌తో పాటు శక్తినిచ్చే పోషకాలు పుష్కలంగా ఉంటాయి. నవధాన్యాల్లో ఒకదానిలోని పోషకాలు ఇంకొక దానిలో కలిసిపోయి శరీరానికి బహుళ ప్రయోజనాలను కలుగుజేస్తాయి.

జానకి బడుగు, పోషకాహార నిపుణులు.



మీ కోసం

తుమ్ములు తగ్గాలంటే కొత్తిమీర వాసన చూస్తే సరి.

జీవన సౌరభం

మనం గొప్పవాళ్లు అయిన తర్వాత చప్పట్లు కొట్టేవారి కంటే ఏమీలేనప్పుడు వెన్నుతట్టేవాళ్లే నిజమైన స్నేహితులు.

కాళ్లు పగలకుండా ఇలా!



చర్మం పొడిబారడం, అధిక బరువు, ఎక్కువసేపు నిలబడి ఉండడం, పాదాలను సరిగా శుభ్రం చేసుకోకపోవడం వంటి వాటివల్ల కాళ్లు పగులుతాయి. కొంతమందికైతే కాళ్ల పగుళ్ళ నుంచి రక్తం కూడా వస్తుంటుంది. కొన్ని చిట్కాలు పాటించడం ద్వారా కాళ్ల పగుళ్ల నుంచి బయటపడవచ్చు.

- పడుకునే ముందు పాదాలను శుభ్రంగా కడుక్కొని, తడిలేకుండా తుడుచుకోవాలి. తరువాత వాజలీన్, పెట్రోలియం జెల్లీ లేదా కొబ్బరినూనె రాసుకొని, కాటన్ సాక్స్ వేసుకొని పడుకోవాలి. ఇలా ప్రతిరోజూ చేయడం వల్ల పాదాలు చాలా తక్కువ రోజుల్లోనే సున్నితంగా తయారవుతాయి.
- నిమ్మరసంలో ఆముదం నూనె, రోజ్‌వాటర్ కలపాలి. పాదాలను శుభ్రం చేసుకున్నాక ఈ మిశ్రమాన్ని పాదాలకు రాసుకోవాలి.
- గోరువెచ్చని నీటిలో కొద్దిగా రాతి ఉప్పు, నిమ్మరసం వేయాలి. ఆ నీటిలో పది నిమిషాలపాటు పాదాలను ఉంచాలి. ఇలా చేయడం వల్ల పాదాలు శుభ్రమవ్వడమే కాకుండా మృదువుగా తయారవుతాయి.
- ప్రతి రోజూ పాదాలను శుభ్రంచేసుకొని ఆలివ్ ఆయిల్ రాసుకోవడం ద్వారా కాళ్లపగుళ్ల నుంచి బయటపడొచ్చు.
- ఆముదం నూనె, కొబ్బరినూనె రెండింటినీ సమపాళల్లో కలపాలి. అందులో చిటికెడు పసుపు కలిపి పేస్ట్‌లా చేయాలి. ఈ మిశ్రమాన్ని కాళ్లపగుళ్లపై రాయాలి.
- కొద్దిగా గ్లిజరిన్ కలిపిన రోజ్‌వాటర్‌ని పగుళ్లపై రాసుకోవడం వల్ల పగుళ్లు మానిపోతాయి.
- వేపనూనెలో పసుపు వేసి మిశ్రమాన్ని తయారుచేసుకోవాలి. దాన్ని కాళ్ల పగుళ్ళున్న చోట రాసుకోవాలి.
- పారాఫిన్ మైనాన్ని కరిగించి, దానిలో కొద్దిగా ఆవనూనె కలపాలి. ఈ మిశ్రమాన్ని పగుళ్లకు రాసుకొని గంట తరువాత కడుక్కోవాలి.
- నిమ్మచెక్కను ప్రతిరోజూ పగుళ్లకు రుద్దుకోవడం ద్వారా కొన్నిరోజులకు కాళ్లు మృదువుగా తయారవుతాయి.

బావాజీ.. ఇదిగో సాక్ష్యం!!

"**పా**రాయణా..! క్యాంప్ ఆఫీసు బయట.. ఏమిటా? దద్దరిల్లే శబ్దాలు..? కొంపదీసి.. కరెంట్ ట్రాన్స్‌ఫారమ్‌గానీ పేలిపోయిందా.. ఏమీ?" కంగారుపడుతూ అడిగారు శ్రీశ్రీ రాజాబహదూర్ రాజావారు.

"అట్టాంటిదేమీ లేదు రాజావారు..! ఆ శబ్దాలకు కారణం.. మన వియ్యంకుల వారే" ఎంతో నింపాదిగా చెప్పాడు మంత్రి పారాయణ.

"ఏమీ.. మన వియ్యంకులవారా..? మన అంటే.. ఎవరి వియ్యంకులు? నీ వియ్యంకులా..? నా వియ్యంకులా? " నొసలు చిట్లించి అడిగారు రాజావారు.

"మర్యాదకోసం మన అని సంబోధించితినిగానీ.. వారు.. మీ వియ్యంకుల వారే.." నవ్వుతూ చెప్పిందే చెప్పాడు పారాయణ.

"ఇదిగో పొద్దున్నే.. సస్పెన్స్‌తో చంపక.. అసలే.. నంధ్యాల ప్రచారంలో నియోజకవర్గం అంతా తిరిగీ తిరిగీ.. ఒళ్ళంతా పులుసైపోయింది.. ఊరికే విసిగించమాక.." కాస్తంత విసుగు మొఖంపెట్టి అన్నారు రాజావారు.

"అయ్యా.. రాజావారు.. మీకు తెలియందేమున్నది.. మీ వియ్యంకులవారు.. అనగా.. మీకు స్వయాన బామ్మర్దిగారూ.. నంధ్యాల నుంచి సరాసరి ఇక్కడకు వచ్చు చున్నారు. వారి ఎంట్రీ అంటే.. అట్టాగే ఉంటుంది కదా..! కనీసం పాతిక సుమోలైనా.. గాల్లో లేవాల్సిందే..! పైగా డైరెక్టర్ గోయపాటి శీను కూడా ఆయన ఎంట్రీ విషయంలో బాగా శ్రద్ధ తీసుకుంటున్నారట..!!" అసలు విషయం పూసగుచ్చినట్టు చెప్పుకొచ్చాడు పారాయణ.

"మా బామ్మర్దిగారు.. సినిమా యాక్టరు కాబట్టి.. ఆమాత్రం హడావుడి ఉండాల్లేవయ్యా..! కావాలంటే.. భారీ ఎఫెక్ట్ కోసం ఇంకో పాతిక సుమోలు పెంచండి.. మన సౌండేంటో.. అటు జనాలకు.. ఇటు ఎగస్పార్టీవాళ్లకు బాగా అర్థంకావాలి. అవసరమైతే పార్టీ ఫండ్ నుంచి వందకోట్లు ఖర్చు పెట్టండి..



బామ్మర్దిగారి ఎంట్రీ మాత్రం అదిరిపోవాలంతే" ఎంతో హుషారుగా అన్నారు రాజావారు.

సుమోల ప్రతిధ్వనులు కాస్తంత.. తగ్గుమొఖం పట్టాక.. యాక్టర్ కమ్ ఎమ్మెల్యే కమ్ రాజావారి బామ్మర్దివర్యులు అయిన వింతకర్ణి దర్బార్‌లోకి ఎంతో.. ఆవేశభరితంగా.. ప్రవేశించారు.

"రండి.. రండి..! ఏం పుచ్చుకుంటారు..? టీ, కాఫీ, మజ్జిగ..??" ఎంతో సాదరంగా ఆహ్వానించారు రాజావారు.

"నో..! టీ, కాఫీ, మజ్జిగ తాగడానికి నేను ఇప్పుడే పుట్టిన బుడ్డోణ్ణికాదు.. అయామ్ లెజండ్. సింహా.. నా దాహం వేరే.. అయినా అవన్నీ ఇక్కడ బావుండదుగానీ.. మీ ప్రేమకు కడు సంతోషం.. ఈ పూటకి చల్లటి మంచినీళ్ళు ఇప్పించండి చాలు.." ఎంతో వినమ్రంగా అన్నారు ఎమ్మెల్యే వింతకర్ణి.

"నీలోని.. ఈ టాలెంట్‌కే.. నేను ఫిదా అయిపోతుంటా..! ఉమ్మ్మ్మ్.." దగ్గరకొచ్చి.. నెత్తిమీద గట్టిగా ముద్దుపెట్టి మరీ మెచ్చేసుకున్నారు రాజావారు.

"బావగారూ... మీ అభిమానానికి మనసు ఉప్పొంగిపోతుంది.. మీ కోసం నన్నేం చేయమంటారు చెప్పండి..? ఆజ్ఞగా భావిస్తాను..!" మరోసారి ఎంతో వినమ్రంగా అడిగాడు వింతకర్ణి.

"అవునూ.. మీరు ఎన్నికల ప్రచారానికి వెళ్ళారు కదా..?! మరి వెళ్ళిన పని ఏమైంది..? జనాలంతా మనకే గుద్దేస్తారుగా?" ఆసక్తిగా అడిగారు రాజావారు

"నేను మాట్లాడితే.. అవతలివారి ఒక చెవ్వు మాత్రమే.. పనిచేయాలా.. కాదంటే.. తర్వాత ఎలక్షన్లు చూడలేరూ.. అన్నట్టుగా.. జనాల్లోకి వెళ్ళి మరీ ప్రచారం చేశా..!" మీసం మెలేసి మరీ చెప్పుకొచ్చాడు ఎమ్మెల్యే వింతకర్ణి.

"మీరు అంతటి సమర్థులే అని.. మిమ్మల్ని అక్కడికి తోలితిని.. అన్నట్టు.. జనాలకు పంచమన్న డబ్బులన్నీ గుట్టుచప్పుడు కాకుండా అందరికీ పంచిపెట్టారా?" అడిగారు రాజావారు.

"నేను వెళ్ళిందే అందుకు కదా.. బావగారూ..! నాలుగు సుమోల్లో తీసుకెళ్ళిన సొమ్మంతా.. మూడోకంటికి తెలియకుండా.. స్వయంగా నా చేతులతో పంచిపెట్టేశా.. అంతా మనకే గుద్దేస్తారు.. నో డౌట్..! ఇక ఓటమి గురించి మాట్లాడుకోవడాల్లేవ్.." మరోసారి మీసం మెలేసి మరీ చెప్పాడు వింతకర్ణి.

"వెరీగుడ్.. వెరీగుడ్..! ఈసారి మనం అధికారంలోకొస్తే.. మీకు మంత్రి పదవి గ్యారంటీ.." హామీ ఇచ్చారు రాజావారు.

"బావగారు మరి.. నేను డబ్బులు పంచినట్టు.. సాక్ష్యం ఉండాలి కదా..! మరి చూస్తారా?" ఎంతో అమాయకంగా అడిగాడు వింతకర్ణి.

"అరే.. మీరు గుట్టుచప్పుడు కాకుండా డబ్బులు పంచిపెట్టామని చెప్పారు.. అది చాలాదా చెప్పండి.. దానికి మళ్ళీ సాక్ష్యమెందుకు..? మీపట్ల మాకు నమ్మకం ఉందిలెండి.." రాజావారు వారించబోయారు.

"అయినా.. దేనికైనా సాక్ష్యం ఉండాల్సిందే.. ఇదిగో చూడండి" అంటూ కొన్ని దినపత్రికలు చేతికందించాడు వింతకర్ణి.

జనాలకు డబ్బులు పంచుతున్నట్టుగా పేపర్లలో.. వచ్చిన బామ్మర్దివర్యుల వారి బేనర్ ఫోటోలు చూసి రాజావారికి దాదాపు మూర్ఛగిల్లినంత పనైంది.

"ఇదేంటి బామ్మర్దీ.. ఇట్లా చేసినావేంది?? పరువుతీశావు కదయ్యా..?" బావురుమన్నారు రాజావారు.

"అదేంటి బావగారూ..! నా ఫొటోలు చూసి మరీ కుళ్ళిపోతారు.. ఏం.. నా ఫొటోలు పేపరోళ్ళు వేయకూడదా..? ఆమాత్రం పబ్లిసిటీకి నేను తగనా.. చెప్పండి..??" అంటూ బుంగమూతి పెట్టి మరీ అడిగాడు వింతకర్ణి.

"అయ్యో.. బామ్మర్దీ..! నీవు చేసింది.. నీకు తప్పుగా అనిపించడం లేదా..? అయినా.. ఏ రాత్రిపూటో దొంగచాటుగా.. మన కార్యకర్తలతో డబ్బులు పంచిపెట్టాలిగానీ.. నువ్వే నేరుగా.. ఇలా పగటిపూట రంగంలోకి దిగి.. డబ్బులు పంచుతూ ఫొటోలకు ఫోజులిచ్చి.. పార్టీ పరువు, నా పరువు కృష్ణాగోదాట్లో కలుపుతావా..?" కన్నీరు మున్నీరయ్యారు రాజావారు.

"దొంగచాటుగా పంచిపెట్టడం మా ఇంటావంటా లేదు.. ఏదైనా ఫేస్ టు ఫేస్..! ఎనీప్లేస్.. ఏనీ టైమ్.. సింహా.. ఇక్కడ" కళ్ళింత పెద్దగా చేసుకుని మీసం మెలేశాడు వింతకర్ణి.

"నాకు బుద్ధితక్కువై.. మిమ్మల్ని ప్రచారానికి పంపించితిని.." చెంపలేసుకున్నారు రాజావారు.

"ఆ.. అన్నట్టు బావగారూ.. ప్రచారం అంటే గుర్తొచ్చింది.. నేను అక్కడకెళ్ళాక మన కార్యకర్తల్లో తెగ ఉత్సాహం వచ్చేసిందండీ.. నేనిచ్చిన ట్రీట్‌మెంట్ జన్మలో మరిచిపోలేరు.. గ్యారంటీగా వాళ్ళంతా మనకే గుద్దేస్తారు.. హిహ్హిహ్హీ.." తనదైన శైలిలో నవ్వుతూ.. చెప్పాడు వింతకర్ణి.

"డబ్బులు పంచే విషయం ఎలా ఉన్నా.. కనీసం.. మీ సినిమా గ్లామర్‌తో మన కార్యకర్తల్లోనైనా ఉత్సాహం పంచారు.. నాకది చాలు.." కాస్తంత తేలికపడ్డారు రాజావారు.

"దానికీ సాక్ష్యం ఉంది బావగారూ..! ఎవరక్కడ..? మన వీరాభిమానుల్ని ఇక్కడ ప్రవేశపెట్టండి..!" ఉత్సాహంగా చప్పట్లుకొట్టి పిలిచాడు వింతకర్ణి.

దవడ వాచిపోయిన ముగ్గురు కార్యకర్తలు బిత్తరచూపులు చూసుకుంటూ దర్బార్‌లోకి వచ్చారు.

"ఏంటీ బామ్మర్దిగారూ.. వీరి బుగ్గలపై హస్తం గుర్తు.. ఫ్యాన్ గుర్తులు ఉన్నవి..??" పైకీ కిందకీ చూస్తూ అనుమానంగా అడిగారు రాజావారు.

"ఆ గుర్తులు మేము వేసినవే.. గత ఎన్నికల్లో మా అభిమానుల్ని ఉత్సాహపరిచేందుకు..తొడకొట్టేవాడ్ని.. కొట్టి కొట్టి తొడ వాచిపోతుందని భయపడి.. ఈసారి అభిమానుల దవడలు పగులకొడుతున్నా.. పేపర్లో.. టీవీల్లో కూడా ఈ విషయం బోల్డన్నిసార్లు వేస్తున్నారు. ఇంతకంటే మనకు పబ్లిసిటీ ఏంకావాలి బావాజీ?" అంటూ గుబురు గెడ్డాన్ని సవరించుకుంటూ తెగ నవ్వుకోసాగాడు వింతకర్ణి.

అదిచూసి రాజావారు కడుశోకంతో.. దిగ్భ్రాంతికి గురై.. ఈసారి నిజంగానే మూర్ఛగిల్లారు.

రాత-గీత : గంగాధర్ వీర్ల

గ్రూప్స్, ఇతర పోటీపరీక్షల ప్రత్యేకం

'మైక్రో ప్రోపగేషన్' అంటే ఏమిటి ?



ఎస్.పి. మనోహర్ కుమార్,
టీచర్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
నున్న, కృష్ణాజిల్లా.
సెల్ : 9490300637

(జనరల్ సైన్స్)
జెనెటిక్ ఇంజనీరింగ్ (జీవసాంకేతిక శాస్త్రం)

జెనెటిక్ ఇంజనీరింగ్ అనే పదాన్ని మొట్టమొదట ఉపయోగించిన శాస్త్రవేత్త కార్ల్ ఎరిక్. సూక్ష్మజీవుల్లోని జన్యువులను ఉపయోగించుకునే సాంకేతిక పద్ధతులను తెలియజేసేదే జెనెటిక్ ఇంజనీరింగ్. మానవ జీవితానికి, మానవాళి సంక్షేమానికి అవశ్యకమైన ఉత్పత్తులను తయారుచేయడం కోసం, సూక్ష్మజీవుల ధర్మాలను, వాటి వల్ల కలిగే ఉపయోగాలను పారిశ్రామిక స్థాయిలో వినియోగించుకునే విజ్ఞానమే జీవసాంకేతిక శాస్త్రం.

జెనెటిక్ ఇంజనీరింగ్‌ను వైద్య శాస్త్రంలో వివిధ వ్యాధుల నివారణ కోసం ఉపయోగిస్తున్నారు. ఈ ప్రక్రియను ఉపయోగించి డిఎన్ఎ క్లోనులను తయారుచేసి, వాటిని వాణిజ్యపరంగా హార్మోన్‌లైన ఇన్సులిన్, వాక్సిన్స్, ఇంటర్‌ఫెరాన్‌ల సంశ్లేషణలో వినియోగిస్తున్నారు. సూక్ష్మజీవులను ఉపయోగించి విటమిన్‌లు, సూక్ష్మజీవనాశకాలు, ఇతర రసాయనాలను వాణిజ్యస్థాయిలో ఉత్పత్తి చేస్తున్నారు. ఈ ప్రక్రియను ఉపయోగించి **'హ్యూమ్యూలిన్'** అనే ఇన్సులిన్‌ను తయారుచేశారు.

★ **ఇంటర్‌ఫెరాన్ :** వీటిని ప్రధానంగా సకశేరుక అతిథేయిలు ఉత్పత్తి చేస్తాయి. వైరస్ ద్వారా వ్యాధిగ్రస్తమైన అతిథేయి కణం ఉత్పత్తిచేసే గ్లైకోప్రోటీనే ఇంటర్‌ఫెరాన్. ఇది వేరే అతిథేయి కణాన్ని వైరస్ తాకిడి నుంచి కాపాడుతుంది.

జీవసాంకేతిక విజ్ఞాన శాస్త్రంలో కంప్యూటర్ విజ్ఞానాన్ని విస్తృతంగా ఉపయోగిస్తున్నారు.

★ **బయోఇన్ఫర్‌మాటిక్స్ :** జీవశాస్త్ర అధ్యయనాన్ని పెంపొందించడానికి గణిత, కంప్యూటర్ పరిజ్ఞానాన్ని విశ్లేషించే శాస్త్రాన్ని బయోఇన్ఫర్‌మాటిక్స్ అంటారు. ఇది జీవసాంకేతిక శాస్త్రంలో ఎక్కువగా ఉపయోగపడుతుంది.

★ **ప్రోటియోమిక్స్ :** ఒక జీవి నుంచి ఉత్పత్తయ్యే ప్రోటీనులను గురించి కంప్యూటర్ పరిజ్ఞానం వినియోగించుకోవడం ద్వారా అధ్యయనం చేసే శాస్త్రాన్ని **'ప్రోటియోమిక్స్'** అంటారు.

★ **జీనోమిక్స్ :** కణంలోని ఏకస్థితిక క్రోమోజోమ్ గ్రూప్‌ను **'జీనోమ్'** అంటారు. దీని డిజైనింగ్‌ను కంప్యూటర్ పరిజ్ఞానం ద్వారా అధ్యయనం చేసే విధానాన్ని **'జీనోమిక్స్'** అంటారు.

★ **థర్మోసైక్లర్ :** పాలిమరైజ్ చైన్ రియాక్షన్ (పిసిఆర్) అనే ప్రక్రియను ఉపయోగించి జన్యుక్లోనింగ్ జరిపే పరికరం. కృత్రిమ విత్తనాలు, వ్యాధి నిరోధక మొక్కలను ఉత్పత్తి చేయడానికి జీవసాంకేతిక శాస్త్రం తోడ్పడుతుంది. బాసిల్లస్ తురెంజియన్సిస్ (బిటి పత్తి) టాక్సిన్ అనే విషపదార్థాన్ని కలిగిన పత్తి మొక్క కీటకాలను చంపేస్తుంది. జన్యుమార్పిడి (ట్రాన్స్‌జెనిక్) మొక్కలు వైరస్ నిరోధకత, కీటకనిరోధకత, మంచిపోషక పదార్థాలు కలిగిన జన్యుపరివర్తిత మొక్కలు ఉత్పత్తి చేశారు. జీవ ఎరువుల తయారీకి జీవసాంకేతిక విజ్ఞానాన్ని ఉపయోగిస్తున్నారు.


సూక్ష్మజీవులు, మొక్కలను ఉపయోగించి పర్యావరణ పరిశుభ్రతను సాధించే ప్రక్రియను **'బయోరెమెడియేషన్'** అని అంటారు. ఆయిల్ తెట్టును తినే బ్యాక్టీరియా సూడోమోనాస్ పుటిడ అనే సూపర్‌బగ్‌ను ఆనంద్ చక్రవర్తి అనే శాస్త్రవేత్త తయారుచేశారు.

★ **జన్యుపరివర్తిత మొక్కల వల్ల ఉపయోగాలు :** ఒక జీవిలోని ఉపయోగకరమైన జన్యువులను వివిధ వాహకాల ద్వారా పంట మొక్కల్లో ప్రవేశపెట్టి, ప్రయోజనాలను పొందడానికి ఏర్పరచిన పంటలను జన్యుపరివర్తిత పంటలు, జన్యుపరివర్తిత మొక్కలు, ట్రాన్స్‌జెనిక్ క్రాప్స్, **జెనిటకల్లీ మోడిఫైడ్ క్రాప్స్** అంటారు.

ట్రాన్‌జెనిక్ మొక్కలు వ్యాధిజనక బాక్టీరియాలకు శిలీంధ్రాలకు నిరోధకతను కలిగి ఉంటాయి. సూడోమోనాస్ అనే బ్యాక్టీరియాకు జన్యుపరివర్తిత టమాటో మొక్క నిరోధకతను చూపుతుంది. **'ఫైటాప్‌థోరా'** అనే శిలీంధ్రానికి జన్యుపరివర్తిత బంగాళాదుంప నిరోధకతను చూపుతుంది. జన్యు పరివర్తిత మొక్కలు ఆహార పదార్థాల తయారీ, పంట నాణ్యతకు అనుకూలంగా ఉంటాయి. జన్యు పరివర్తిత టమాటో రకం పగుళ్ళు లేకుండా, ఆలస్యంగా పక్వానికి రావడం వల్ల రవాణాకు అనుకూలంగా ఉంటుంది. గోల్డెన్ వరి రకం రైపీ అంథత్వాన్ని నివారించే విటమిన్ - **'ఎ'** ను అధికంగా కలిగివుంటుంది.

వైరస్‌లకు, కీటకాలకు గుల్మనాశకాలకు నిరోధకత చూపించే లాభదాయకమైన జన్యువులుండటం వల్ల ఎక్కువ దిగుబడినిచ్చే జన్యు పరివర్తిత పంటలను అభివృద్ధి చేయవచ్చు. జన్యుపరివర్తిత బొప్పాయిలో రింగ్‌స్పాట్ వైరస్‌కు వ్యాధినిరోధకత చూపిస్తుంది. బిటి (బయోటెక్నాలజీ) -పత్తి కీటక నిరోధకతను చూపుతుంది. రౌండ్ అప్ రెడీ రకం సోయాచిక్కుడు గుల్మనాశక సహనశీలత కలిగి ఉంటుంది.

సంకర విత్తనాల ఉత్పత్తికి ట్రాన్స్‌జెనిక్ మొక్కలు తోడ్పడతాయి. జన్యుపరంగా రూపాంతరం చెందిన పంటలు నిర్జీవ సంబంధ ప్రతికూల పరిస్థితులైన శీతల పరిస్థితులు, లవణీయత, అధిక ఉష్ణాలకు తట్టుకొనే శక్తిని కలిగి ఉంటుంది. వరిలోని బాస్మతి రకం వివిధ జీవ, నిర్జీవ సంబంధ ప్రతికూల పరిస్థితులకు నిరోధకతను చూపుతుంది.



జెనెటిక్ ఇంజనీరింగ్‌లో వివిధ ప్రయోగాలను **'రికాంబినెంట్ డిఎన్ఎ'** టెక్నాలజీ ద్వారా జరుపుతున్నారు. ఇందులోని వివిధ దశలు..

1. వాంఛనీయ జన్యువును విడదీయడం
2. విడదీసిన జన్యువును ఎంచుకున్న వాహకంలోకి ప్రవేశపెట్టడం
3. పునఃసంయోజక వాహకాన్ని అతిథేయిలోకి బదిలీచేయడం
4. జన్యుపరివర్తిత అతిథేయి కణాలను ఎన్నుకోవడం

★ **కణజాల వర్ధనం :** మొక్కలోని వేరు, కాండం కొన, పత్రం, అండం, అండాశయం వంటి భాగాల్లో ఏదైనా ఒక భాగాన్ని పోషకాలు కలిసిన యానకంలో పెంచి, కొత్త మొక్కలను ఉత్పత్తిచేసే విధానాన్ని **'కణజాల వర్ధనం'** (టిష్యూ కల్చర్) అంటారు. ఇది **'అలైంగిక ప్రత్యుత్పత్తి'**. ఈ వర్ధనం అభివృద్ధి చెందడానికి గల కారణం మొక్కలకు ఉన్న **'టోటిపొటెన్సీ'** అనే లక్షణం. టోటిపొటెన్సీ అనగా ఏదైనా ఒక మొక్క భాగానికి పూర్తి మొక్కగా ఏర్పడగల అంతర్గత సామర్థ్యం. కణజాల వర్ధనంలో మొక్క పెరగడానికి కావాల్సిన అన్నిరకాల పోషకాల మిశ్రమాన్ని **'పోషక యానకం'** అంటారు. దీనిని మొట్టమొదటిసారిగా తయారుచేసింది మురిషిగే, స్కూగ్. పోషకయానకంలో ఉపయోగించే మొక్క భాగాన్ని **'ఎక్స్‌ప్లాంట్'** అని అంటారు. ఈ ఎక్స్‌ప్లాంట్ పోషకయానకంలో ఉంచినపుడు అది విభజన చెంది, కణాల గుంపును ఏర్పరుస్తాయి. దీన్ని **'కాలస్'** అంటారు. దీనికి **ఆక్సిన్స్** అనే ఫైటోహార్మోన్‌ను కలపడం వల్ల వేర్లు, సైటోకైనిన్ అనే హార్మోన్‌ను కలపడం వల్ల కాండం ఏర్పడుతుంది. ఈ పోషక యానకాన్ని ఘనస్థితిలోకి మార్చడానికి **'అగర్- అగర్'** ను ఉపయోగిస్తారు. హార్టికల్చర్‌లో కణజాలవర్ధనాన్ని విస్తృతంగా ఉపయోగిస్తున్నారు.

కణజాలవర్ధనాన్ని ఉపయోగించి తక్కువకాలంలో ఎక్కువసంఖ్యలో మొక్కలను ఉత్పత్తిచేస్తారు. ఇలా ఉత్పత్తి చేయడాన్ని **'మైక్రో ప్రోపగేషన్'** అంటారు. టిష్యూకల్చర్ ద్వారా కృత్రిమ విత్తనాలను తయారుచేస్తారు. వైరస్ రహిత మొక్కలను ఉత్పత్తిచేయవచ్చు.

★ **మూలకణ సాంకేతికత :** దేహంలోని ఏదైనా కొంతభాగాన్ని కోల్పోవడం వల్ల వివిధ రకాల వ్యాధులు కలుగుతాయి. ఈ విధంగా కోల్పోయిన భాగాలను తిరిగి ఏర్పరచగల శక్తి ఉన్న కణాలను మూలకణాలు లేదా ఆధార కణాలు (స్టెమ్‌సెల్స్) అంటారు. ఈ మూలకణాలను ఐదు రకాలుగా విభజించవచ్చు. అవి...

1. పిండ మూలకణాలు : వీటిని ఐదు నుంచి ఏడు రోజుల పిండం నుంచి కొన్ని కణాలను సేకరించి మూలకణాలుగా ఉపయోగిస్తారు.
2. లింబస్ మూలకణాలు : ఇవి కంటిలో ఉంటాయి.
3. ఎముకమజ్జ మూలకణాలు : ఎముక మజ్జలో ఉంటాయి.
4. ఉల్బద్రవ మూలకణాలు : పిండం చుట్టూ ఉండే ఉల్బద్రవంలో ఉంటాయి.
5. బొడ్డుతాడు మూలకణాలు : శిశువు జన్మించేటప్పుడు తల్లికి, శిశువుకు మధ్యగల బొడ్డుతాడు నుంచి మూలకణాలను సేకరిస్తారు. ఈ స్టెమ్‌సెల్స్ నుంచి తయారుచేసే రక్తాన్ని **'కార్డ్ బ్లడ్'** అని అంటారు.

డయాబెటిస్, క్యాన్సర్, అల్జీమర్స్, నాడీక్షీణత, కండరక్షీణత, వెన్నెముక సంబంధిత వ్యాధులను ఈ మూలకణాలను ఉపయోగించి నిర్ధారించవచ్చు. భారతదేశంలో మొట్టమొదటి స్టెమ్‌సెల్స్ బ్యాంక్‌ను **'లైఫ్ సెల్'** పేరుతో చెన్నైయిలో ఏర్పాటు చేశారు. దీనికి ప్రస్తుతం బ్రాండ్ అంబాసిడర్‌గా 'ఐశ్వర్యారాయ్' వ్యవహరిస్తున్నారు. ★

ఉద్యోగాలు

హెచ్ఎంఅండ్ఎఫ్‌డబ్ల్యూలో ఆరు లెక్చరర్ల ఉద్యోగాలు

హెచ్ఎంఅండ్ఎఫ్‌డబ్ల్యూలో లెక్చరర్ల పోస్టుల భర్తీకి తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రకటన జారీచేసింది.
మొత్తం ఖాళీలు : ఆరు, **విభాగాలు :** రేడియోలాజికల్ ఫిజిక్స్, ఫిజిసిస్ట్స్. **వేతనం :** రూ.37,100-91,450
వయో పరిమితి : 2017 జులై 1 నాటికి 18-44 ఏళ్ల లోపు ఉండాలి. రిజర్వేషన్ కేటగిరీ అభ్యర్థులకు నిబంధనల మేర సడలింపు ఉంటుంది.
అర్హతలు : ప్రథమశ్రేణి మార్కులతో ఎంఎస్సీ (ఫిజిక్స్/ న్యూక్లియర్ సైన్స్) లేదా తత్సమాన విద్యార్హతతోపాటు బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్ (బార్క్) నుంచి ఏడాది హాస్పిటల్ ఫిజిక్స్, రేడియోలాజికల్ ఫిజిక్స్‌లో ఏడాది పీజీ ట్రైనింగ్ కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి.
దరఖాస్తు ఫీజు : రూ.320 (ఆన్‌లైన్ అప్లికేషన్ ప్రాసెస్ ఫీ- రూ.200 + ఎగ్జామినేషన్ ఫీ రూ.120), తెలంగాణకు చెందిన ఎస్సీ/ ఎస్టీ/ బీసీ/18-44 ఏళ్ల లోపు వయసున్న నిరుద్యోగులకు, ఎక్స్-సర్వీస్‌మెన్ కేటగిరీ అభ్యర్థులకు ఎగ్జామినేషన్ ఫీజు నుంచి మినహాయింపు ఉంది.
దరఖాస్తు విధానం : ఆన్‌లైన్ ద్వారా చేసుకోవాలి.
ఎంపిక విధానం : ఆన్‌లైన్/ ఓఎంఆర్ విధానంలో ఎగ్జామినేషన్ (ఆబ్జెక్టివ్ టైప్), ఇంటర్వ్యూ.
పరీక్ష విధానం : పార్ట్-ఎ కింద రాతపరీక్ష.. పేపర్-1, పేపర్-2 విభాగాలుగా ఉంటుంది. పేపర్-1లో జనరల్ స్టడీస్ అండ్ జనరల్ ఎబిలిటీస్ నుంచి 150 ప్రశ్నలు ఇస్తారు. మొత్తం మార్కులు 150, వ్యవధి రెండున్నర గంటలు. పేపర్-2లో రేడియోలాజికల్ ఫిజిక్స్/ మెడికల్ ఫిజిక్స్ (పోస్ట్ ఎంఎస్సీ డిప్లొమా లెవెల్) నుంచి 300 మార్కులకు 150 ప్రశ్నలు ఇస్తారు. వ్యవధి రెండున్నర గంటలు. పార్ట్-బి కింద 50 మార్కులకు ఇంటర్వ్యూ ఉంటుంది. పార్ట్-ఎ (పేపర్-1ంపేపర్-2), పార్ట్-బి (ఇంటర్వ్యూ) కలిపి మొత్తం 500 మార్కులు. వీటిలో వచ్చిన మార్కుల ఆధారంగా తుది ఎంపిక చేపడతారు.
దరఖాస్తు చివరి తేదీ : సెప్టెంబర్ 15, 2017
పూర్తి వివరాలు : వెబ్‌సైట్‌లో చూడొచ్చు.
వెబ్‌సైట్ : www.tspsc.gov.in

జిఎస్‌టితో 'అధోవృద్ధి'

- క్యూ1లో 6.3 శాతమే
- పారిశ్రామికోత్పత్తి దిగాలు
- రేటింగ్ ఏజెన్సీ ఇక్రా అంచనాలు

ముంబయి : మోడీ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోన్న వస్తు సేవల పన్ను (జిఎస్‌టి) వల్ల వృద్ధి రేటు మందగించనుందనే అంచనాలు ఊపందుకున్నాయి. ప్రముఖ రేటింగ్ ఏజెన్సీ ఇక్రా అంచనా ప్రకారం జిఎస్‌టి వల్ల ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి జూన్ త్రైమాసికం (క్యూ1)లో వృద్ధి రేటు 6.3 శాతానికి మందగించనుంది.



గతేడాది ఇదే త్రైమాసికంలో 7.6 శాతం వృద్ధి రేటు నమోదయ్యింది. వ్యవసాయం, అడవులు, చేపల పెంపకం, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, రక్షణ రంగ సేవల వృద్ధి రేటు 4.8 శాతానికి పరిమితం కావచ్చని ఇక్రా తన రిపోర్టులో పేర్కొంది. స్థూల కార్పొరేట్ పన్ను వసూళ్లు 4.8 శాతం పెరుగొచ్చని పేర్కొంది. ఇక్రా రేటింగ్ అంచనాల ప్రకారం ఇప్పటికే వరుసగా పడిపోతున్న ఎగుమతులు, రూపాయి మారకం విలువ తరుగుదల తదితర పరిణామాలు వృద్ధిపై ప్రభావం చూపనున్నాయి. తొలి త్రైమాసికంలో ఒత్తిడిలో ఉన్న బ్యాంకింగ్, టెలికం రంగాలు కూడా పెద్ద తోడ్పాటును ఇవ్వకపోవచ్చు.

ఇక్రా రిపోర్టు ప్రకారం క్రితం జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో పారిశ్రామికోత్పత్తి ఏకంగా 3.9 శాతానికి పడిపోవచ్చు. గతేడాది ఇదే త్రైమాసికంలో ఈ రంగం 7.4 శాతం వృద్ధిని సాధించింది. ఆ సమయంలో తయారీ, విద్యుత్, గ్యాస్, నీటి సరఫరా, నిర్మాణ రంగాలు మెరుగైన ప్రగతిని కనబర్చాయి. 2016-17 క్యూ1లో 9 శాతం వృద్ధి సాధించిన సేవల రంగం క్రితం జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో 8.2 శాతం వృద్ధితో సరిపెట్టుకోనుందని ఇక్రా విశ్లేషించింది. ఆ కంపెనీల రాబడిలో బలహీన పరిణామాలే ఇందుకు కారణం. బ్యాంకులు, టెలికం రంగాలు ఒత్తిడిలో ఉన్నాయి. టోకు ద్రవ్యోల్బణం సూచీ గతేడాది జూన్ త్రైమాసికంలో -0.7 శాతంగా ఉండగా, గడిచిన త్రైమాసికంలో ఇది 2.3 శాతానికి ఎగిసింది. ఇది కూడా పలు రంగాలపై ప్రభావం చూపనుంది.

పన్ను సమస్యలు పరిష్కరించాలి
ఎంఎస్ఎంఇ వర్గాలు

ప్రభుత్వం అమలు చేస్తోన్న సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఇ)లు జిఎస్‌టి వల్ల ఇప్పటికీ పలు సమస్యలు ఎదుర్కొంటున్నాయని ఆల్ ఇండియా మాన్‌ఫాక్చరర్స్ ఆర్గనైజేషన్ (ఎఐఎంఒ) ఆందోళన వ్యక్తం చేసింది. తమ సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించింది. జిఎస్‌టిఎన్ పోర్టల్‌తో అనుసంధానం క్లిష్టంగా మారిందని ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీకి ఎఐఎంఒ లేఖ రాసింది. ఆగస్టు 20 నుంచి 25వ తేదిల్లో జిఎస్‌టిఎన్ పోర్టల్ పన్ను చెల్లింపుదారుల ట్రాఫిక్ తాకిడితో సరిగా పనిచేయలేకపోయిందని ఇందులో తెలిపింది. ముఖ్యంగా జిఎస్‌టిఆర్-3బి ఫారంలో సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయని పేర్కొంది.

బ్యాంకు ఉద్యోగుల సమ్మె సక్సెస్

ప్రయివేటీకరణ, విలీనం వద్దని డిమాండ్

- స్తంభించిన లావాదేవీలు
- సిఐటియు, ఎఐటియుసి మద్దతు



విజయవాడ గాంధీనగర్ ఎస్‌బిఐ బ్యాంకు వద్ద నిరసన తెలుపుతున్న బ్యాంకు ఉద్యోగులు

ప్రజాశక్తి - యంత్రాంగం

ప్రయివేటీకరణ, విలీనం, కార్పొరేట్ సంస్థల రుణమాఫీలను వ్యతిరేకిస్తూ యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంకు యూనియన్ (యుఎఫ్‌బియు) ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా చేపట్టిన బ్యాంకు ఉద్యోగుల సమ్మె శతశాతం విజయవంతమైంది. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వరంగ బ్యాంకులన్నీ మంగళవారం మూతపడ్డాయి. దీంతో లావాదేవీలన్నీ పూర్తిగా స్తంభించిపోయాయి. బ్యాంకింగ్ సంస్కరణల ముసుగులో ప్రభుత్వరంగ బ్యాంకులపై జరుగుతున్న దాడికి వ్యతిరేకంగా పలు జిల్లాల్లో నిరసన ప్రదర్శనలు నిర్వహించారు.

విజయవాడలో బ్యాంకు ఉద్యోగులు, అధికారులు సమ్మె చేశారు. తొలుత గాంధీనగర్ ఎస్‌బిఐ బ్రాంచ్ ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో సిఐటియు, ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు ఎం.ఎ.గఫూర్, జి.ఓబులేసు మాట్లాడారు. కార్పొరేట్ సంస్థలకు రుణాలిచ్చి, రాని బాకీలను రుణమాఫీ చేయడాన్ని వ్యతిరేకిస్తున్నామని, వారిపై క్రిమినల్ చర్యలు తీసుకొని రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. 9 బ్యాంకుల యూనియన్ల నాయకులు పాల్గొన్నారు. కృష్ణా జిల్లాలో బ్యాంకు ఉద్యోగుల సమ్మె విజయవంతమైంది. సిఐటియు నాయకులు మద్దతు తెలిపారు. గుంటూరు జిల్లాలోనూ సమ్మె విజయవంతమైంది. ఈ సందర్భంగా నిర్వహించిన ఆయా సభల్లో బ్యాంకు ఉద్యోగ సంఘాల సమాఖ్య కన్వీనర్ పి.కిషోర్‌కుమార్, సిఐటియు, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శులు వై.నేతాజీ, రాధాకృష్ణమూర్తి, తదితరులు ప్రసంగించారు. శ్రీకాకుళం జిల్లాలో 3 వేల మంది ఉద్యోగులు విధులను బహిష్కరించి సమ్మెలో పాల్గొన్నారు. విజయనగరం జిల్లావ్యాప్తంగా సుమారు 200 బ్యాంకులు మూతపడటంతో రూ.200 కోట్ల లావాదేవీలు నిలిచిపోయాయి. సమ్మెకు సిఐటియు, ఎఐటియుసి మద్దతు తెలిపాయి. ప్రభుత్వరంగ బ్యాంకులను కాపాడుకునేందుకు జరిగే పోరాటానికి అండగా ఉంటామని ఆయా సంఘాల జిల్లా అధ్యక్షులు ఎం.శ్రీనివాస, వి.కృష్ణంరాజు అన్నారు. విశాఖలో జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద బ్యాంకు ఉద్యోగులు పెద్దఎత్తున ధర్నా నిర్వహించారు. ధర్నానుద్దేశించి యుఎఫ్‌బియు నగర కన్వీనర్ సిఎఎస్.ప్రభాకర్ మాట్లాడారు. విశాఖ గ్రామీణంలోనూ సమ్మె జయప్రదమైంది. తూర్పుగోదావరి జిల్లాలో 450 శాఖల్లోని 5 వేల మంది ఉద్యోగులు సమ్మె చేయడంతో రూ.300 కోట్ల మేర వ్యాపార లావాదేవీలు నిలిచిపోయాయి. పశ్చిమగోదావరి జిల్లాలో అన్ని బ్యాంకుల ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. వారికి సిపిఎం, సిఐటియు నాయకులు మద్దతు తెలిపారు. ప్రకాశం జిల్లాలో 474 బ్యాంకు బ్రాంచీలు మూతపడ్డాయి. సుమారు రూ.600 కోట్లు అన్ని రకాల బ్యాంక్ లావాదేవీలు నిలిచిపోయాయి. సమ్మెలో భాగంగా ఒంగోలులోని ఆంధ్రాబ్యాంక్ మెయిన్ బ్రాంచి వద్ద బ్యాంకు ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. ధర్నాలో యుఎఫ్‌బియు జిల్లా కన్వీనర్ వి పార్థసారథి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి పివిఆర్ చౌదరి మాట్లాడారు. ఈ సమ్మెకు సిపిఎం, సిపిఐ నేతలు మద్దతు తెలిపారు. పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో బ్యాంకు ఉద్యోగులు సమ్మె చేశారు. చిత్తూరు జిల్లాలో తొమ్మిది సంఘాల ఆధ్వర్యంలో బ్యాంకు ఉద్యోగులు సమ్మె నిర్వహించారు. వీరికి యుఎఫ్‌బియు తిరుపతి కన్వీనర్ చంద్రశేఖర్, ఎఐబిఇఎ నాయకులు ధన్వంతకుమార్, సిపిఐ రాష్ట్ర నాయకులు హరినాథరెడ్డి, సిఐటియు జిల్లా కోశాధికారి జిబిఎస్ మణ్యం, తిరుపతి మాజీ ఎంపి చింతామోహన్‌లు మద్దతు పలికారు. కడప జిల్లాలో ప్రధాన శాఖల వద్ద ఉద్యోగులు సమ్మె నిర్వహించారు. ఈ సమ్మెకు సిఐటియు, ఎఐటియుసి, ఎల్‌ఐసి యూనియన్, ఇతర బ్యాంకు యూనియన్ నాయకులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సిండికేట్ బ్యాంక్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి సి.శ్రీనివాసులరెడ్డి, ఆంధ్రాబ్యాంక్ ఇయు సిఇసి సభ్యులు సంజీవరాయుడు, బ్యాంకు ఉద్యోగులు పాల్గొన్నారు. కర్నూలు జిల్లాలో ప్రభుత్వ రంగ బ్యాంకు ఉద్యోగులందరూ సమ్మెలో పాల్గొన్నారు. ఈ సమ్మెనుద్దేశించి వి.వెంకటేశ్వర్లు మాట్లాడారు. సిఐటియు నాయకులు సంపూర్ణ మద్దతును ప్రకటించారు. అనంతపురంలో నిర్వహించిన సమ్మెకు సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు వి.రాంభూపాల్, జగదీష్ మద్దతు తెలిపారు. బ్యాంకు ఉద్యోగుల జెఎసి కన్వీనర్ రుష్యేంద్రబాబు, తదితరులు పాల్గొన్నారు.

కార్మిక సంఘాల ఉమ్మడి పోరాటాలు అవసరం

సమ్మెకు ఎం.ఎ.గఫూర్, జి.ఓబులేసు మద్దతు

దేశ ప్రజలకు ఆర్థిక సేవలందిస్తున్న బ్యాంకింగ్ రంగాన్ని కాపాడుకోవటం కోసం ఉద్యోగులు, కార్మికులు, కార్మిక సంఘాలు ఉమ్మడి పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.గఫూర్, ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు అన్నారు. యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ ఇచ్చిన దేశవ్యాప్త బంద్ పిలుపు మేరకు మంగళవారం విజయవాడలో గాంధీనగర్ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వద్ద 1500 మంది బ్యాంక్ ఉద్యోగులు, అధికారులు సమ్మె చేశారు. కార్యక్రమానికి సిఐటియు, ఎఐటియుసి సంపూర్ణ మద్దతు తెలిపాయి. నిరసనలో ఎం.ఎ.గఫూర్ మాట్లాడుతూ.. బ్యాంక్ ఉద్యోగులు చేస్తున్న సమ్మె కేవలం వారి హక్కులను సాధించుకోవటం కోసం మాత్రమే కాదని, దేశ భవిష్యత్తు, ఆర్థిక పరిపుష్టి కోసమని అన్నారు. బ్యాంకింగ్ రంగం నష్టాల్లోకి రావటానికి కారణమైన వారిపై చర్యలు తీసుకోకుండా ఉద్యోగులను ఇబ్బందులు పెడుతున్నారని అన్నారు. జి.ఓబులేసు మాట్లాడుతూ.. జనాభా పెరుగుతున్నకొద్దీ బ్యాంకులు విస్తరించాల్సిన అవసరం ఉందని, కానీ దానికి విరుద్ధంగా బ్యాంకులను విలీనం చేస్తున్నారని అన్నారు. అప్పులు కట్టలేదని రైతులను అరెస్టు చేస్తున్న ప్రభుత్వానికి వేల కోట్లు ఎగ్గొట్టి బ్రిటన్‌లో దాక్కున్న మాల్యాను అరెస్టు చేసే దమ్ము లేదా? అని ప్రశ్నించారు. ఎఐబిఎ సెక్రటరీ కె ఈశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వ నిరంకుశత్వాన్ని ఓడించాలని, ప్రభుత్వరంగ బ్యాంకులను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం స్పందించకపోతే సెప్టెంబర్ 15న పార్లమెంట్ వద్ద ధర్నా చేపడతామన్నారు. ఈ సమ్మె బ్యాంకు సిబ్బంది సొంత సమస్యల కోసం కాదని, ప్రజలపై భారం పడకుండా ఉండేందుకే చేస్తున్నామన్నారు.



ప్రచార జాతాలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి

రైతులను ఆదుకోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

ప్రజాశక్తి-బండి ఆత్మకూరు(కర్నూలు)

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను ఆదుకోవడంలో విఫలమయ్యాయని సిపిఎం జిల్లా కార్యదర్శి కె. ప్రభాకర్‌రెడ్డి విమర్శించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం సిపిఎం ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రచారజాతాను మంగళవారం ఆయన ప్రారంభించారు. కర్నూలు బండిఆత్మకూరు మండలం సింగవరం, సోమయాజులపల్లె, ఎరుకలికాలనీ, ఈర్నపాడు, కడమలకాల్వ, బి-కోడూరు, ఎ-కోడూరు, పార్నపల్లి గ్రామాల మీదుగా ప్రచారజాతా కొనసాగింది. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్‌లో వర్షాలు లేక కరువు పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. ప్రభుత్వం తక్షణం రైతులను ఆదుకోవాలని కోరారు. అక్కడక్కడ రైతులు పండించిన పంటలకు ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించాలన్నారు. వరి, మినుము, కందులు, మిర్చి పంటలకు స్వామినాథన్ కమిటీ సిఫార్సుల మేరకు మద్దతు ధర ప్రకటించాలని డిమాండ్ చేశారు. 28వ తేదిన తహశీల్దార్ కార్యాలయం ఎదుట జరిగే ధర్నాకు సిపిఎం నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల నాయకులు సానుభూతిపరులు పెద్దఎత్తున హాజరు కావాలని కోరారు.

మద్యం షాపులపై సిఎం ఆదేశాలు అమలు కావాలి : ఐద్వా

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

నివాస ప్రాంతాల్లో మద్యం షాపులపై ఎవరైనా అభ్యంతరాలు వ్యక్తం చేస్తే తక్షణమే ఆ దుకాణాన్ని తొలగించాలని సిఎం చంద్రబాబు ఇచ్చిన ఆదేశాలను అమలు చేయాలని ఐద్వా రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు బి. ప్రభావతి, డి.రమాదేవి మంగళవారం ప్రకటనలో కోరారు. నూతన మద్యం విధానాన్ని రద్దు చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బెల్టు షాపుల రద్దుపై 89.4 శాతం మంది హర్షం వ్యక్తం చేశారనేది వాస్తవానికి దూరంగా ఉందన్నారు. ప్రసాదంపాడు, భవానీపురం ప్రాంతాల్లో, అన్ని జిల్లాల్లో 47 రోజులుగా ధర్నా చేస్తున్నా ఆ ప్రాంతాల్లో షాపులను రద్దు చేయలేదని విమర్శించారు. సుప్రీం కోర్టు ట్రిపుల్ తలాక్ పై ఇచ్చిన చారిత్రాత్మక తీర్పుని ఐద్వా స్వాగతించిందని పేర్కొన్నారు. సంబంధిత సంఘాలను, రాజకీయ పార్టీలను సంప్రదించి ప్రభుత్వం ఒక సమగ్ర చట్టం చేయాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు.

పునరావాసం తర్వాతే ప్రాజెక్టు పనులు

ఏపి వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్

ప్రజాశక్తి- కొత్తూరు (శ్రీకాకుళం జిల్లా)

వంశధార నిర్వాసితులకు పూర్తి స్థాయిలో పునరావాసం కల్పించిన తర్వాతే ప్రాజెక్టు పనులు చేపట్టాలని ఏపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు, కార్యదర్శి క్రాంతికిరణ్ డిమాండ్ చేశారు. మంగళవారం వారు శ్రీకాకుళం జిల్లా కొత్తూరు మండలం ఇరపాడులో పర్యటించారు. అనంతరం కొత్తూరులో విలేకరులతో మాట్లాడారు. నిర్వాసితులకు పునారావాసం కల్పించాకే పనులు చేపట్టాలంటూ తమ సంఘం హైకోర్టులో పిల్ వేసిందని, అందుకనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఒక సూచన కూడా చేసిందని చెప్పారు. కోర్టు సూచనను ప్రభుత్వం పక్కన పెట్టి వంశధార నిర్వాసితులకు పూర్తి స్థాయిలో పరిహారం చెల్లించకుండా పనులు చేపడుతోందన్నారు. అడ్డుకున్న వారిని అక్రమంగా అరెస్టు చేయిస్తోందని విమర్శించారు. పాడలి గ్రామంలో అరెస్టు అయిన వారికి ఇంతవరకూ బెయిల్ మంజూరు కాలేదన్నారు. నిర్వాసితులకు సిపిఎం అండగా ఉంటోందని, సిపిఎం పోరాటం వల్లే నిర్వాసితులకు ప్రభుత్వం రూ.421 కోట్లను విడుదల చేసిందని గుర్తు చేశారు. వంశధార నిర్వాసితులకు 2013 భూసేకరణ చట్టాన్ని అమలు చేయబోమని జిల్లా కలెక్టర్ చెప్పడం దారుణమన్నారు. యూత్ ప్యాకేజీ కొందరికే ఇచ్చారని, ఇళ్ల పట్టాలు కూడా పూర్తి స్థాయిలో అందించలేదని తెలిపారు. అంతకుముందు హిరమండలం మండలంలోని పాడలి వెళ్లేందుకు సిద్ధమవ్వగా, పాడలి గ్రామం వద్ద పోలీసులు అడ్డుకున్నారు. దీంతో వారు అక్కడి నుంచి వెనుదిరిగారు.

కౌలు రైతు మృతి

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

వ్యవసాయం కోసం చేసిన అప్పులు తీర్చే మార్గం కానరాక తీవ్ర మనస్తాపానికి గురై ఆత్మహత్యాయత్నం చేసిన కౌలు రైతు రెండ్రోజులపాటు చావుతో పెనుగులాడి సోమవారం రాత్రి మృత్యువాత పడ్డాడు. బాధిత కుటుంబ సభ్యులందించిన వివరాల ప్రకారం గుంటూరు జిల్లా సత్తెనపల్లి మండలం నందిగంకు చెందిన వేలం వెంకట్రామయ్య(40) 3.25 ఎకరాలు కౌలుకు తీసుకుని పత్తి, మిర్చి సాగుచేశాడు. సరైన నీటి సదుపాయం లేక దిగుబడి తగ్గడంతోపాటు పంటకు మద్దతు ధరా దక్కక రూ.4.50 లక్షల వరకు అప్పులయ్యాయి. వీటిని తీర్చేమార్గం కానరాని వెంకట్రామయ్య ఆదివారం సాయంత్రం ఇంట్లో ఎవ్వరూ లేని సందర్భంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. గమనించిన స్థానికులు, కుటుంబీకులు వెంకట్రామయ్యను సత్తెనపల్లిలోని ప్రయివేటు వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మంగళగిరి వద్ద ఉన్న ఎన్‌ఆర్‌ఐ ఆస్పత్రికి తరలించారు. ఈ క్రమంలో సోమవారం రాత్రి మృత్యువాతపడ్డాడు. మృతునికి భార్య కనకదుర్గ, ఇద్దరు పిల్లలున్నారు. సత్తెనపల్లి రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్రజ్ఞ | జవాబులు

1. పోర్టు బ్లెయిర్, 2. చైనా, 3. బ్రిటన్
4.కేరళ 5. నాసా

కార్పొరేట్ కంపెనీలతో వైద్య రంగం నిర్వీర్యం

- మెడికల్ రిప్స్ ఆందోళనలో పిడిఎఫ్ ఎమ్మెల్సీల విమర్శ
- వేతనబోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్



కార్మికశాఖ అదనపు కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎంఎల్‌సిలు యండపల్లి శ్రీనివాసులురెడ్డి, బాలసుబ్రమణ్యం, ఎవి నాగేశ్వరరావు తదితరులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ కంపెనీలతో చేతులు కలపడం వల్ల వైద్య రంగం నిర్వీర్యం అవుతోందని పిడిఎఫ్ ఎమ్మెల్సీలు బొడ్డు నాగేశ్వరరావు, వై శ్రీనివాసులురెడ్డి విమర్శించారు. ఎపి మెడికల్, సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్, సిఐటియు ఆధ్వర్యం లో విజయవాడలోని రాష్ట్ర కార్మిక శాఖ కమిషనర్ కార్యాలయం వద్ద మంగళవారం ఆందోళన నిర్వహించింది. ఈ సందర్భంగా ఎమ్మెల్సీలు మాట్లాడుతూ మెడికల్ రిప్రజెంటేటివ్ లను అత్యంత నైపుణ్యం గల వారిగా గుర్తించి నెలకు రూ. 25 వేల వేతనాన్ని ఇవ్వాలన్నారు. కార్మిక శాఖ మంత్రి జోక్యం చేసుకుని తక్షణమే సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వైద్య రంగానికి వేతన బోర్డు ఏర్పాటు చేసి కనీస వేతనాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కనీసం వారికి గుర్తింపు కార్డులు అందజేయని స్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. ఆ రంగంలో పనిచేసే మహిళలకు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు ఇవ్వాలన్నారు. ఈ సమస్యలన్నింటిని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు శాసనమండలిలో ప్రస్తావిస్తామన్నారు. సిఐటియు రాష్ట్ర కోశాధికారి ఎవి నాగేశ్వరరావు మాట్లాడుతూ మెడికల్ చట్టం ప్రకారం మెడికల్ రిప్రజెంటేటివ్‌లను కార్మికులుగా గుర్తించాలన్నారు. రాష్ట్రంలో చాలా మందుల కంపెనీలున్నా, సేల్స్ ప్రమోషన్స్ ఎంప్లాయిస్ (ఎస్‌పిఇ) చట్టం మాత్రం అమలు కావడం లేదన్నారు. కానీ ఆయా కంపెనీలు సర్వీస్ బుక్, సర్వీస్ రూల్స్‌లాంటి నిబంధనలను అమలు చేయడం లేదని, వాటిని సక్రమంగా నిర్వహించని యాజమాన్యంపై కార్మికశాఖ తనిఖీ నిర్వహించడం లేదన్నారు. సేల్స్ ప్రమోషన్ ఉద్యోగులకు వర్తించే అన్ని రకాల చట్టాలను అన్ని యాజమాన్యాలు కచ్చితంగా అమలు చేసేలా చూడాలన్నారు. అనంతరం కార్మికశాఖ అదనపు కమిషనర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు.

గొడారీలకు ఎస్సీ ధ్రువీకరణ పత్రాల్ని జారీ చేయాలి : కెవిపిఎస్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఎస్సీ ఉపకుల జాబితాలో ఉన్న గొడారీలను ఎస్సీలుగా పరిగణిస్తూ కుల ధ్రువీకరణ పత్రాల్ని జారీ చేయాలని కెవిపిఎస్ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం తాడేపల్లిలోని సాంఘిక సంక్షేమ శాఖ సంచాలకులు రామారావుకు కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి అండ్ర మాల్యాద్రి, కృష్ణా జిల్లా అధ్యక్షులు జి నటరాజ్, విజయవాడ నగర నాయకులు సిహెచ్ శ్రీనివాస్ వినతి పత్రాన్ని సమర్పించారు. ఎస్సీ కులాల జాబితాలో మొత్తం 59 ఉపకులాలున్నాయని, వాటిల్లో గొడారి కూడా ఒకటి అని తెలిపారు. బతుకు తెరువు కోసం ఒక జిల్లా నుంచి మరొక జిల్లాకు వలసలు వెళ్తుంటారని, ప్రస్తుతం నివసిస్తున్న ప్రాంతాల్లోనే రేషన్, ఓటర్, ఆధార్ వంటి కార్డులు పొందుతుంటారని వివరించారు. ఒక జిల్లా నుంచి మరొక జిల్లాకు వలస వెళ్తే వీరికి ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రం ఇవ్వడం కుదరదని గతంలో కేంద్ర ప్రభుత్వం నిబంధనలు రూపొందించగా, రాష్ట్రంలో ఏ జిల్లాకు వెళ్లినా వారికి కుల ధ్రువీకరణ పత్రం ఇవ్వొచ్చంటూ రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలున్నాయని వినతిపత్రంలో పేర్కొన్నారు. కేవలం కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం మండల రెవిన్యూ అధికారులు వీరికి కుల ధ్రువీకరణ పత్రాల్ని ఇవ్వడంలేదని వివరించారు. దీంతో గొడారి కులస్తులు అనేక ఇబ్బందులకు గురవుతున్నాని పేర్కొన్నారు.

ప్రభుత్వ బ్యాంకింగ్ వ్యవస్థను రక్షించండి

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు ఊడిగం మాని, ప్రభుత్వ బ్యాంకింగ్ వ్యవస్థను పరిరక్షించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ డిమాండ్ చేశారు. వేల కోట్ల రూపాయలు బ్యాంకులకు బకాయిపడ్డ కార్పొరేట్ సంస్థల నుండి లోన్లు రికవరీ చేసేందుకు ప్రభుత్వం నిర్దిష్ట చర్యలు చేపట్టాలని మంగళవారం ఆయన ఒక ప్రకటనలో కోరారు. ఒకరోజు దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేశారని బ్యాంకు ఉద్యోగులకు అభినందనలు తెలిపారు. రైతులకు రుణమాఫీ చేయడాన్ని తప్పుపడుతూ వ్యాఖ్యలు చేసిన రిజర్వ్‌బ్యాంకు, కార్పొరేట్ కంపెనీలు తీసుకున్న వేల కోట్ల రూపాయల రుణాలను రద్దు విషయంలో నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. లోన్లు రికవరీ చేయాలని కోరుతూ సాక్షాత్తూ బ్యాంకు ఉద్యోగులే రోడ్డెక్కాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. బ్యాంకులకు బకాయిలున్న వారి నుండి రికవరీ చేసేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. బ్యాంకుల విలీన ప్రక్రియకు స్వస్తి పలకాలని, బ్యాంకు ఉద్యోగుల న్యాయమైన సమస్యలను తక్షణమే పరిష్కారించాలని, ప్రభుత్వరంగంలోనే బ్యాంకింగ్ వ్యవస్థ కొనసాగించే పద్ధతుల్లో ప్రభుత్వ నిర్ణయాలు ఉండాలని కోరారు.

ఎసిబి వలలో నిడదవోలు ఆర్‌టిసి డిఎం

ప్రజాశక్తి - నిడదవోలు(పశ్చిమగోదావరి)

ఎసిబి వలలో నిడదవోలు ఆర్‌టిసి డిపో మేనేజరు జిఎల్‌టివి సుబ్బారావు చిక్కుకున్నారు. రూ.5 వేలు లంచం తీసుకుంటూ మంగళవారం పట్టుబడ్డారు. ఎసిబి అధికారుల కథనం మేరకు.. పశ్చిమగోదావరి జిల్లా నిడదవోలు ఆర్‌టిసి డిపోలోని పారిశుధ్య విభాగంలో చైతన్యజ్యోతి సంస్థ పేరుతో కైలా రామకృష్ణరావు కొన్నేళ్లుగా లేబర్ కాంట్రాక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. ఇక్కడి పారిశుధ్య కార్మికులకు మూడు నెలలుగా జీతాల బకాయిలున్నాయి. ఈ ఫైల్ కదలాలంటే తనకు రూ.5 వేలు లంచం ఇవ్వాలంటూ డిఎం డిమాండ్ చేశారు. దీంతో బాధితుడు ఏలూరు ఎసిబి అధికారులను ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో మంగళవారం సాయంత్రం రూ.5 వేలు లంచం తీసుకుంటున్న ఆర్‌టిసి డిఎం సుబ్బారావును పట్టుకున్నారు.

ముంబయి పేలుళ్ళ నిందితులకు సెప్టెంబరు 7న శిక్ష ఖరారు

తీర్పు చెప్పనున్న టాడా కోర్టు

న్యూఢిల్లీ : ముంబయిలో 1993లో జరిగిన బాంబు పేలుళ్ళ కేసులో దోషులకు ప్రత్యేక టాడా కోర్టు సెప్టెంబరు 7న శిక్షను ఖరారు చేయనున్నది. ముంబయిని వణికించిన బాంబు పేలుళ్ళ ఘటనలో అబూ సలేంతో సహా ఐదుగురిని టాడా కోర్టు దోషులుగా గుర్తించింది. అంతకుముందు రెండు నెలల క్రితం ఈ కేసులో ఆరుగురిని దోషులుగా గుర్తించగా, ఆరవ దోషి ముస్తాఫా దోస్సా జూన్ 28న గుండెపోటుతో మరణించాడు. ఇక ఈ కేసులో ఫిరోజ్ ఖాన్, మహ్మద్ తహీర్ మర్చంట్ అలియాస్ తహీర్ తకల్య, కరీముల్లా ఖాన్, రియాజ్ అహ్మద్ సిద్ధికి దోషులుగా ఉన్నారు. వీరికి కోర్టు శిక్ష ఖరారు చేయనున్నది.

ముంబయి బాంబు పేలుళ్ళ ఘటనలో 257 మంది మృతి చెందగా, 713 మంది తీవ్రంగా గాయపడ్డారు. దాదాపు రూ.27 కోట్ల మేర ఆస్తినష్టం సంభవించింది. ఇవి ఆర్‌డిఎక్స్(రీసెర్చ్ డిపార్ట్‌మెంట్ ఎక్స్‌ప్లోజివ్స్)ను ఉపయోగించి ప్రపంచంలోనే తొలిసారిగా జరిగిన అతి పెద్ద ఉగ్రవాద దాడులు. రెండో ప్రపంచ యుద్ధం తరువాత ఇంత పెద్దఎత్తున ప్రేలుడు పదార్ధాలతో దాడులు ఎన్నడూ జరగలేదు. ముంబయిలో బాంబు దాడులు జరపడానికి ముందు కుట్రదారులు పదిహేనుసార్లు సమావేశమైనట్లు ప్రాసిక్యూషన్ వారు కోర్టుకు తెలిపారు.

రబ్రీదేవికి ప్రతిపక్ష నేత హోదాను నిరాకరించిన బీహార్ ప్రభుత్వం

నిబంధనల పేరుతో అడ్డుకుంటున్నారని రబ్రీ ఆగ్రహం

పాట్నా : బీహార్‌లో కొత్తగా ఏర్పడిన జెడి(యు)-బిజెపి ప్రభుత్వంపై ఆర్‌జెడి నాయకురాలు రబ్రీదేవి తీవ్రంగా విరుచుకు పడ్డారు. శాసన మండలిలో తనకు ప్రతిపక్ష నేత హోదాను ఇచ్చేందుకు ప్రభుత్వం నిరాకరించడంపై మంగళవారం ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. నిబంధనల ముసుగులో తనకు ఆ హోదాను నిరాకరిస్తున్నారని ఆమె విమర్శించారు. రబ్రీదేవికి ప్రతిపక్ష నేత హోదా కల్పించేందుకు తగినంత మంది ఎమ్మెల్సీలు ఆర్జేడికి లేరని ప్రభుత్వం పేర్కొంది. అంతకుముందు శాసన మండలిలో ఆర్జేడికి నలుగురైదుగురు సభ్యులు మాత్రమే వున్నప్పుడు గులామ్ గౌస్‌కు ప్రతిపక్ష నేత కల్పించారని, ఇప్పుడు నిబంధనల పేరుతో కాదంటున్నారని ఆమె విమర్శించారు. శాసన మండలిలో ప్రతిపక్ష నేతగా ఉండాలంటే ఆ పార్టీకి కనీసం 9 మంది ఎమ్మెల్సీలు ఉండాలి. కానీ ఆర్జేడికి ప్రస్తుతం 7గురు సభ్యులు మాత్రమే ఉన్నారు. అందువల్ల ఆర్జేడి అభ్యర్ధనను పరిశీలించలేక పోయినట్లు బీహార్ శాసన మండలి డిప్యూటి చైర్మన్ హరున్ రషీద్ తెలిపారు.

నీట్ నుంచి మినహాయింపు లేదు

కౌన్సిలింగ్ ప్రక్రియ ప్రారంభించండి

తమిళనాడుకు సుప్రీం ఆదేశం

న్యూఢిల్లీ : జాతీయ అర్హతా ప్రవేశ పరీక్ష (నీట్) నుంచి మినహాయింపు లేదని తమిళనాడు ప్రభుత్వానికి సుప్రీంకోర్టు తెలిపింది. కౌన్సిలింగ్ ప్రక్రియను వెంటనే ప్రారంభించి సెప్టెంబరు 4లోగా ముగించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. కేంద్రం కూడా నీట్ నుంచి తమిళనాడుకు మినహాయింపు లేదని తెలిపింది. తమిళనాడు ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేశామని, నీట్ నుంచి మినహాయింపు కోరడం చట్ట సమ్మతం కాదని తెలిపింది. వైద్య కళాశాలల్లో ప్రవేశం కోసం నిర్వహించే నీట్‌ను తమిళనాడు వ్యతిరేకిస్తోంది. సిబిఎస్‌ఈ విద్యార్థులకు నీట్ అనుకూలంగా వుందని, గ్రామీణ విద్యార్థులు నష్టపోతారని అంటోంది. అయితే తమిళనాడుకు మినహాయింపునిస్తే ఇతర రాష్ట్రాలు కూడా అదే డిమాండ్ చేస్తాయని ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది.

ప్రభుత్వ సేవా కేంద్రాల్లో పతంజలి ఉత్పత్తుల అమ్మకాలు

న్యూఢిల్లీ : ప్రభుత్వ సేవా కేంద్రాలు (సిఎస్‌సిఎస్)ల్లో ఇక నుంచి పతంజలి ఉత్పత్తులను విక్రయించనున్నారు. పతంజలి ఎఫ్‌ఎంసిజి, ఐఎఫ్‌ఎఫ్‌సిఓ ఉత్పత్తులను డిజి పే, ఆధార్ లింక్డ్ చెల్లింపుల విధానంలోనూ విక్రయిస్తారు. పతంజలి ఉత్పత్తులను విక్రయించడం ప్రభుత్వ సేవాకేంద్రాలకు మంచి ప్రోత్సాహకరంగా వుంటుందని కేంద్ర ఐటి, న్యాయశాఖా మంత్రి రవి శంకర్ ప్రసాద్ అన్నారు. తమ ఉత్పత్తుల అమ్మకాల కోసం సిఎస్‌సిలతో పతంజలి ఆయుర్వేద లిమిటెడ్ ఒప్పందం కుదుర్చుకుంది. దేశంలో గ్రామస్థాయిలోనూ విస్తృతంగా వున్న సిఎస్‌ఎస్‌ల ద్వారా పతంజలి విక్రయాలు మరింతగా పెరిగే అవకాశం వుంది. పతంజలి మెడికల్ టెలి కన్సల్టేషన్స్ సేవల కోసం కూడా సుమారు 40 వేలకు పైగా సిఎస్‌సిఎస్‌లు నమోదు చేసుకున్నాయని మంత్రి తెలిపారు. రేషన్‌కార్డులు, బర్త్ సర్టిఫికేట్లు, రైల్వే టిక్కెట్లు, నగదు బదిలీ.. వంటి సౌకర్యాలు అందించడానికి ప్రభుత్వ సేవా కేంద్రాలను ఏర్పాటు చేశారు. దేశవ్యాప్తంగా సుమారు 2,50,000కు పైగా ఈ కేంద్రాలు వున్నాయి.

నిన్న విలీనం.. నేడు తిరుగుబాటు

మొదటి పేజీ తరువాయి

మరో ముగ్గురు కూడా ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్నారని ఆయన పేర్కొనడం కలకలం రేపింది. సాయంత్రానికి మరో ముగ్గురు ఎంఎల్‌ఏలు కూడా గవర్నర్‌ను కలిసి, ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించినట్లు వార్తలు వచ్చాయి. అయితే, ఆ ముగ్గురు ఎవ్వరన్న విషయంలో స్పష్టత రాలేదు. గవర్నర్ కార్యాలయం కూడా దీనిపై స్పందించలేదు. అంతకుముందు గవర్నర్‌ను కలిసిన దినకరన్ గ్రూపునకు చెందిన ఎంఎల్‌ఏలు మీడియాతో మాట్లాడుతూ గవర్నర్ తమ లేఖలను అందుకున్నారని, తదుపరి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని వివరించారు. తరువాత గవర్నర్ ముంబయికి వెళ్లిపోయారని రాజ్‌భవన్ వర్గాలు తెలిపాయి. దినకరన్ మద్దతుదారుడైన ఆండిపట్టి ఎమ్మెల్యే తంగతమిళసెల్వం మీడియాతో మాట్లాడుతూ తాము ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెడతామని చెప్పారు. ముఖ్యమంత్రిని ఎలా మారుస్తామో మీరే చూస్తారు' అంటూ ఆయన వ్యాఖ్యలు చేశారు. తమను సంప్రదించకుండా పన్నీర్‌సెల్వం గ్రూపుతో విలీనం కావటాన్ని తాము పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని దినకర్ గ్రూపు సభ్యులు చెప్పారు.

పాండిచ్చేరిలో క్యాంపు

ప్రభుత్వం పై తిరుగుబాటు జెండా ఎగరవేసిన ఎంఎల్‌ఏలు ఆ వెంటనే పాండిచ్చేరికి తరలివెళ్లారు. సముద్రపు ఒడ్డున ఉన్న ఒక రెస్టారెంట్‌లో తిరుగుబాటు ఎంఎల్‌ఏల కోసం ప్రత్యేకంగా 22 గదులను ఏర్పాటు చేసినట్లు సమాచారం.పాండిచ్చేరిలో ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్న విషయం తెలిసిందే.

మెజార్టీకి మూడు స్థానాలు తక్కువ

ప్రస్తుత బలాబలాలు ఇదే విధంగా కొనసాగితే పళని స్వామి వర్గానికి సాధారణ మెజార్టీకి ముగ్గురు తక్కువ అవుతారు. మొత్తం 234 మంది శాసనసభ్యులున్న సభలో జయలలిత మరణంతో ఈ సంఖ్య 233కు తగ్గింది. గత ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం 134 స్థానాలను గెల్చుకున్న అన్నాడిఎంకె తరువాత జరిగిన రెండు ఉప ఎన్నికల్లో గెలుపొందటంతో ఆ పార్టీ బలం 136కు పెరిగింది. ప్రస్తుతం పళని స్వామి వర్గంలో 104 మంది ఎమ్మెల్యేలుండగా పన్నీర్ సెల్వం గ్రూపులో లో 10 మంది, దినకరన్ గ్రూపులో 20 మంది వున్నారు. అసెంబ్లీలో సాధారణ మెజార్టీకి 117 మంది సభ్యుల మద్దతు అవసరం కాగా ప్రస్తుతం పళనిస్వామి సర్కారుకు 114 మంది ఎమ్మెల్యేలు మాత్రమే మద్దతునిస్తున్నారు. దినకరన్‌తో కలిసి గవర్నర్‌కు లేఖలు ఇచ్చిన వారు కాకుండా మరో ముగ్గురు కూడా తిరుగుబాటు ఎగరవేశారన్న వార్తలు నిజమైతే ఈ సంఖ్య ఇంకా పడిపోనుంది.

విశ్వాసపరీక్షకు సిద్ధం: వైద్యలింగం

పళని స్వామి నేతృత్వంలోని అన్నా డిఎంకె ప్రభుత్వం అవసరమైన సమయంలో శాసనసభలో బలపరీక్షను ఎదుర్కొనేందుకు సిద్ధంగా వుందని పార్టీ ఆర్గనైజింగ్ సెక్రెటరీ, రాజ్యసభ సభ్యుడు ఆర్ వైద్యలింగం చెప్పారు. దినకరన్ వర్గం ఎమ్మెల్యేలు గవర్నర్‌కు లేఖలు సమర్పించటంపై మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నకు ఆయన స్పందిస్తూ అద్భుతంగా పనిచేస్తున్న ప్రస్తుత ప్రభుత్వం వచ్చే నాలుగేళ్ల పాటు అధికారంలో కొనసాగుతుందన్న ధీమా వ్యక్తం చేశారు. తనను పార్టీ నుండి సస్పెండ్ చేస్తున్నట్లు దినకరన్ చేసిన ప్రకటనపై అడిగిన ప్రశ్నకు ఆయన బదులిస్తూ ఆయన చర్యలేవీ తనకు వర్తించబోవన్నారు. తాను పార్టీ కార్యక్రమాలను యధావిధిగా కొనసాగిస్తానని వైద్యలింగం చెప్పారు. పార్టీ కార్యకర్తల ప్రయోజనాలను దృష్టిలో వుంచుకుని అధికార పార్టీలోని రెండు వర్గాలు సోమవారం నాడు విలీనమయ్యాయని ఆయన వివరించారు.

తెరపైకి ధన్‌పాల్

దినకరన్ గ్రూపు వ్యూహాత్మకంగా ప్రస్తుతం స్పీకర్‌గా ఉన్న ధన్‌పాల్ పేరును తెరపైకి తెచ్చింది. ఆయన్ను ముఖ్యమంత్రి చేయాలని ఆ గ్రూపు డిమాండ్ చేస్తోంది. ధనపాలన్ బిసిలకు చెందిన వ్యక్తి కావడంతో శాసనసభలో సభ్యులుగా మరో 27 మంది ఎస్‌సి. ఎస్టీ సభ్యుల మద్దతు పొందడమే దినకరన్ గ్రూపు లక్ష్యమని భావిస్తున్నారు.

తలాక్‌కి తలాక్

మొదటి పేజీ తరువాయి

ముడుచుకు కూర్చోలేదని ఆయన స్పష్టం చేశారు. ట్రిపుల్ తలాక్‌లోని మూడు పద్ధతులు (తలాక్ ఎ బిద్దత్, తలాక్ అహసాన్, తలాక్ హసన్) 1937నాటి షరియత్ చట్టం సెక్షన్ 2 పరిధిలో గుర్తింపు పొందినవేనన్నారు. ట్రిపుల్ తలాక్‌ను షరియత్ చట్టం గుర్తించినప్పటికీ, రాజ్యాంగంలోని ఆర్టికల్ 13(1) పరిధిలోకి వచ్చే చట్టపరమైన ప్రాథమిక హక్కులకు భంగం కలిగించేదిగా వుండరాదని ఆయన స్పష్టం చేశారు. ఆర్టికల్ 13లో 'చట్టం' అన్న పదానికి ఇచ్చిన నిర్వచనం ప్రకారం రాజ్యాంగానికి ముందు కానీ, తరువాత కానీ రూపొందించిన ఏ చట్టమైనా ప్రాథమిక హక్కులకు భంగం కలిగించరాదని ఆయన గుర్తు చేశారు. చంచలత్వంతో కూడిన ఊహాజనితమైన ఈ ముమ్మారు తలాక్ విధానానికి ఆర్టికల్ 25 ప్రకారం రాజ్యాంగ రక్షణ వుండదన్నారు. ఇది కేవలం పరస్పర ఆమోదమైనదే తప్ప మతపరమైన సంప్రదాయం కాదని, అందువల్ల దీనికి ఆర్టికల్ 25 పరిధిలో రాజ్యాంగపరమైన రక్షణ లభించదని న్యాయ మూర్తి నారీమన్ వివరణ ఇచ్చారు. ఈ తీర్పును తాను సమర్థిస్తున్నట్లు మరో న్యాయమూర్తి లలిత్ ప్రకటించారు.

స్వాగతిస్తున్నామన్న కాంగ్రెస్

సుప్రీంకోర్టు తీర్పును తాము స్వాగతిస్తున్నట్లు కాంగ్రెస్ ప్రతినిధి రణజిత్ సూర్జేవాలా చెప్పారు.ట్రిపుల్ తలాక్‌పై చట్టాన్ని రూపొందించాలన్న సూచనను న్యాయవ్యవస్థ పార్లమెంట్‌కు గతంలోనే చేసి వుండాల్సిందని పుదుచ్చేరి గవర్నర్ కిరణ్‌బేడీ ఒక ట్వీట్‌లో అభిప్రాయపడ్డారు. ఈ చారిత్రాత్మక తీర్పు వెలువడిన ఈ రోజు తమకు అత్యంత సంతోషకరమైన రోజని భారతీయ ముస్లిం మహిళా ఉద్యమ సహ వ్యవస్థాపకు రాలు జాకియా సోమన్ అన్నారు.

సుప్రీం తీర్పును స్వాగతించిన ఐద్వా

ట్రిపుల్ తలాక్ ఏకపక్షమని, చట్ట విరుద్ధమని సుప్రీంకోర్టు తీర్పు చెప్పడాన్ని ఐద్వా స్వాగతించింది. ఏకపక్షమైన, నిర్బంధమైన, తిరస్కరించడానికి వీలులేని, తొందరపాటుగా జరిగే ట్రిపుల్ తలాక్‌ను తాము మొదటినుంచి వ్యతిరేకిస్తున్నట్లు ఐద్వా తెలిపింది. లక్షలాది మంది ముస్లిం మహిళలు ట్రిపుల్ తలాక్‌తో కష్టాలు పడుతున్నారని పేర్కొంది. ట్రిపుల్ తలాక్‌తో ఆర్థికంగానూ, ఎలాంటి ఇతర సహాయం లేకుండా ముస్లిం మహిళలు వదిలివేయబడతారని, ఎస్‌ఎంఎస్, స్కైప్.. వంటి పద్ధతుల్లోనూ ట్రిపుల్ తలాక్ చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేసింది. అనేక ట్రిపుల్ తలాక్ కేసులపై ఐద్వా లీగల్ సెల్ పోరాటం చేసిందని, బాధిత మహిళలకు అండగా నిలబడిందని తెలిపింది. ఖురాన్ ప్రాథమిక సిద్ధాంతాలను, షరియత్ విలువలను ట్రిపుల్ తలాక్ ఉల్లంఘిస్తుందని సుప్రీంకోర్టు జస్టిస్ కురియన్ జోసెఫ్ పేర్కొనడాన్ని ఐద్వా ప్రశంసించింది. జస్టిస్ జోసెఫ్‌తో పాటు జస్టిస్ ఆర్‌ఎఫ్ నరిమాన్, జస్టిస్ యుయు లలిత్ కూడా ట్రిపుల్ తలాక్ అనేది ఇస్లాంలో భాగం కాదని, పాపమని పేర్కొన్నారు. అయితే ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఖేహర్, అబ్దుల్ నజీర్ అభిప్రాయాలను ఐద్వా అంగీకరించలేదు. ట్రిపుల్ తలాక్‌పై ఆరు నెలల నిషేధం విధిస్తూ, పార్లమెంట్‌లో చట్టం చేయాలని ధర్మాసనం సూచించింది. ప్రస్తుత ప్రభుత్వం ఇప్పటికే ముస్లింలను లక్ష్యంగా చేసుకుని ఉమ్మడి పౌర స్మృతి తేవాలని ప్రయత్నిస్తోందని, లింగ సమానత్వం, మత విశ్వాసాలను పట్టించుకోవడం లేదని ఐద్వా ఆరోపించింది.ట్రిపుల్ తలాక్‌పై తీర్పును క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం పూర్తిస్థాయిలో స్పందిస్తామని ఐద్వా పేర్కొంది.

చట్టం ద్వారా రద్దు చేయవచ్చు

తన మైనార్టీ తీర్పును చదివి వినిపిం చిన ప్రధాన న్యాయమూర్తి ఖేహర్ ఈ ట్రిపుల్ తలాక్ పద్ధతి సున్నీలలో విస్తృతంగా అమలులో వుందన్నారు. ట్రిపుల్ తలాక్ విధానం పర్సనల్ లాలో భాగమని, అందువల్ల 1937 నాటి షరియత్ చట్ట పరిధిలో చట్టబద్ధహోదా కలిగి వుందన్న వాదనను ఆయన తిరస్కరించారు. అయితే రాజ్యాంగ నైతికతకు వ్యతిరేకమన్న కారణంతో న్యాయస్థానం ఆదేశాల ద్వారా ఈ సంప్రదాయాన్ని రద్దు చేయలేమని ఆయన తన తీర్పులో పేర్కొన్నారు. ఈ విధానంలో ఎటువంటి మార్పు చేసినా అది చట్టబద్ధంగానే జరగాలన్నారు. వాస్తవానికి అంతర్జాతీయంగా అనేక ముస్లిం దేశాలలో ఈ ట్రిపుల్ తలాక్ విధానం రద్దయిందని ఆయన వివరించారు. ఈ విషయంలో మన దేశం వెనుకబడి వుండటం క్షమార్హం కాదన్నారు. వ్యక్తి గత ప్రయోజనాలను పక్కన పెట్టి ఈ విధానాన్ని మార్చేందుకు తగిన చట్టాన్ని రూపొందించాలని ఆయన రాజకీయ పార్టీలు, శాసనకర్తలకు విజ్ఞప్తి చేశారు.

ఖురాన్‌కు వ్యతిరేకం

ట్రిపుల్ తలాక్ విధానం ఖురాన్‌కు వ్యతిరేకమైందని మరో న్యాయమూర్తి కురియన్ తన తీర్పులో వెల్లడించారు. 'ఖురాన్ పరిధిలో నిషిద్ధమైన అంశం షరియత్ పరిధిలో మంచిది కాదని, దైవగ్రంధాలలో నిషిద్ధమైనది చట్టపరంగా మంచిది కాద'ని ఆయన అభిప్రాయపడ్డారు. ట్రిపుల్ తలాక్ 1400 ఏళ్ల నుండి అనుసరిస్తున్న సంప్రదాయం కనుక దీనికి రాజ్యాంగంలోని 25 ఆర్టికల్ కింద రక్షణ లభించదన్న ప్రధాన న్యాయమూర్తి ఖేహర్ అభిప్రాయంతో ఆయన విభేదించారు. ట్రిపుల్ తలాక్ పర్సనల్ చట్టంలోని భాగ మని, మత సంప్రదాయంలో భాగమన్న ఖేహర్ వ్యాఖ్యలతో సైతం ఆయన విభేదించారు. సంప్రదాయం ఎప్పుడూ ప్రజల నైతికతను, జీవనాన్ని, ఆరోగ్యాన్ని దెబ్బతీసే విధంగా వుండకూడదని కురియన్ స్పష్టం చేశారు.

విజయం వెనుక ఆ ఐదుగురు

సైరా బానో



ఉత్తరాఖండ్‌కు చెందిన సైరా బానో 2000వ సంవత్సరంలో అహ్మదాబాద్‌కు చెందిన స్థిరాస్థి వ్యాపారి రిజ్వాన్ అహ్మద్‌ను వివాహం చేసుకు న్నారు. దాదాపు పదిహేనేళ్ల తరువాత తెల్లని కాగితంపై ముమ్మారు తలాక్ అని రాసి బనో నుంచి రిజ్వాన్ విడాకులు తీసుకున్నారు. అంతేగాక తన ఇద్దరి పిల్లల్ని కూడా తల్లికి దూరంగా తీసుకుపోయాడు. దీంతో తలాక్‌ను రద్దు చేసి తనకు న్యాయం చేయాలంటూ 2016లో ఆమె సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అయితే ఆమె ఫిర్యాదును రిజ్వాన్ తోసిపుచ్చారు. తాము ముస్లిం పర్సనల్ లా అనుసరించి జీవిస్తామని, ఆ చట్టం ప్రకారమే బానోకు విడాకులు ఇచ్చానని ఆయన చెప్పారు. కేసును వెనక్కి తీసుకోవాలని ఆమెపై ఒత్తిడి తీసుకొచ్చారు. అయినప్పటికీ ఆమె వెనక్కి తగ్గకుండా పోరాటం కొనసాగించింది. కేసు విచారణలో రిజ్వాన్ సోదరులు, కుటుంబసభ్యులు తనపై చేసిన వేధింపులను ఆమె ప్రస్తావించారు. ఆరుసార్లు బలవంతంగా గర్భస్రావం చేయించారని, శారీరకంగా, మానసికంగా హింసించారనికోర్టులో వెల్లడించారు. దీంతో ఈ కేసులో ట్రిపుల్ తలాక్ అంశాన్ని కోర్టు కీలకంగా పరిగణించింది. ఆమె పిటిషన్ ఆధారంగానే కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది.

గుల్షన్ పర్వీన్

ఉత్తరప్రదేశ్‌లోని రామ్‌పూర్‌కు చెందిన గుల్షాన్ పర్వీన్ కూడా ట్రిపుల్ తలాక్ ద్వారానే 2015లో విడాకులు పొందారు. తన తల్లిదండ్రులను చూసేందుకు వెళ్లిన పర్వీన్‌కు రూ.10 స్టాంప్ పేపర్ మీద మూడుసార్లు తలాక్ రాసి ఆమె భర్త విడాకుల పత్రం పంపించారు. దీం తో రెండేళ్ల కొడుకు రిదాన్‌తో సహా కట్టుబట్టలతో రోడ్డు మీదకు రావాల్సిన పరిస్థితి ఏర్పడటంతో ఈ అంశంలో న్యాయం కోరుతూ ఆమె రామ్‌పూర్ ఫ్యామిలీ కోర్టును ఆశ్రయించారు. గతంలో తన భర్త గృహ హింసకు కూడా పాల్పడ్డారని ఆమె తన ఫిర్యాదులో పేర్కొన్నారు. విడా కులు స్వీకరించేది లేదని తన భర్తకు పర్వీన్ స్పష్టం చేశారు.

ఇష్రాత్ జహాన్



పశ్చిమబెంగాల్‌లోని ప్రముఖ నగరమైన హౌరాకు చెందిన ఇష్రాత్ జహాన్ కూడా 2016లోనే ట్రిపుల్ తలాక్ అంశంలో న్యాయం చేయాలని కోరుతూ కోర్టును ఆశ్రయించారు. దుబాయ్‌లో నివసిస్తున్న ముర్తాజా ఏప్రిల్, 2015లో ఫోన్ ద్వారా ఇష్రాత్‌కు మూడుసార్లు తలాక్ చెప్పి విడాకులు ఇచ్చాడు. తన నలుగురు పిల్లల్ని కూడా దుబాయ్‌కు తీసుకుపోయారు. అక్కడ మరో మహిళను ముర్తాజా వివాహం చేసుకున్నారని ఇష్రాత్ ఆరోపించారు. తన పిల్లల్ని తిరిగి అప్పగించడమేగాకుండా భరణం చెల్లించేలా ఆదేశించాలని కోరుతూ ఆమె కోర్టును ఆశ్రయించారు.

అఫ్రీన్ రహమాన్

రాజస్తాన్ రాజధాని జైపూర్‌కు చెందిన అఫ్రీన్ రహమాన్‌కు స్పీడ్ పోస్టు ద్వారా తన భర్త విడాకులు పంపడంతో ట్రిపుల్ తలాక్ అంశంపై 2016లో కోర్టుకెక్కారు. మ్యారేజ్ వెబ్‌సైట్ ద్వారా పరిచయమైన వ్యక్తిని అఫ్రీన్ 2014లో పెళ్లిచేసుకున్నారు. అనంతరం రెండు నెలలకే అత్తమామలు వరకట్న వేధింపులకు పాల్పడ్డారనీ, సెప్టెంబరు, 2015లో ఇంటి నుంచి బయటకు వెళ్లిపోవాలని ఒత్తిడి తెచ్చారని, వేధింపుల బాధపడలేక బయటకు వెళ్లిన కొద్ది రోజుల్లోనే స్పీడ్ పోస్టు ద్వారా ట్రిపుల్ తలాక్ రాసిన లేఖను పంపించారని అఫ్రీన్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో ఈ అంశంలో జోక్యం చేసుకోవాలని సుప్రీంకోర్టును ఆమె ఆశ్రయించారు.

అతియా సబ్రీ

ఉత్తరప్రదేశ్‌లోని షహరాన్‌పూర్‌కు చెందిన అతియా సబ్రీ 2012లో షహీద్ వలీని పెళ్లి చేసుకున్నారు. ఆ తరువాతి కాలంలో రూ.25 లక్షల వరకట్నం తేవాలని కుటుంబసభ్యులు వేధిస్తున్నారని పేర్కొంటూ భర్త, మామలపై 2015లో అతియా సబ్రీ కేసు పెట్టారు. ఈ నేపథ్యంలో ఓ చిత్తు కాగితంపై ట్రిపుల్ తలాక్ అని రాసి షహీద్ వలీ ఆమెకు విడాకులు ఇచ్చారు. దీంతో నాలుగేళ్లు కూడా పూర్తిగా నిండని ఇద్దరు ఆడపిల్లలతో సహా ఆమె పుట్టింటికి చేరారు. అకారణంగా విడాకులు ఇవ్వడాన్ని ప్రశ్నిస్తూ ఈ ఏడాది జనవరిలో ఆమె సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తన కుమార్తెల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని తనకు న్యాయం చేయాలని అతియా పిటిషన్‌లో పేర్కొన్నారు.

భారతీయ ముస్లిం మహిళా ఆందోళన్



సహ వ్యవస్థాపకులు జకీయా సోమన్

ముస్లిం పురుషులతో పాటు మహిళలకూ సమాన హక్కుల కోరుతూ పోరాటం చేస్తున్న భారతీయ ముస్లిం మహిళా ఆందోళన్(బిఎంఎంఎ) కూడా ట్రిపుల్ తలాక్‌కు వ్యతిరేకంగా సుప్రీంకోర్టును ఆశ్రయించింది. స్త్రీ, పురుషులు సమానమేనని అల్లా చెప్పినట్లుగా తన వాదనను వినిపించింది. 90 రోజుల పరిధిలో విడాకుల ప్రక్రియ జరగాలనీ, ట్రిపుల్ తలాక్‌తో ఆ తంతు పూర్తి కాదని తెలిపింది. మరోవైపు లింగ సమానత్వంపై మాట్లాడుతూ భారత రాజ్యాంగంలో దేశ ప్రజలందరికీ సమాన హక్కులు కల్పించే చట్టాలు లేవని వ్యాఖ్యానించారు

ఆరోగ్య సంస్థలను ప్రయివేటీకరించొద్దు



ఇండియా న్యూస్ నెట్‌వర్క్ - న్యూఢిల్లీ : ప్రభుత్వ ఆరోగ్య సంస్థలను ప్రయివేటీకరించొద్దని ఆశావర్కర్లు డిమాండ్ చేశారు. దేశరాజధానిలో మంగళవారం 11 రాష్ట్రాల నుంచి సుమారు ఆరు వేల మంది ఆశా వర్కర్లు రామ్‌లీలా మైదానం నుంచి జంతర్‌మంతర్ వరకూ భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జంతర్‌మంతర్ వద్ద సమావేశాన్ని నిర్వహించారు. సిఐటియు ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్ ఈ సమావేశాన్ని ప్రారంభించగా, ఎఐసిసిఎడబ్ల్యు రంజన నిరుల ఆశా వర్కర్లను ఉద్దేశించి ప్రసంగించారు.

అనంతరం తపన్‌సేన్ నేతృత్వంలోని ఆశావర్కర్ల బృందం 50 లక్షల మంది సంతకాలు చేసిన విజ్ఞాపన పత్రాన్ని కేంద్ర ఆరోగ్య శాఖ కార్యదర్శికి అందించారు. జాతీయ ఆరోగ్య మిషన్(ఎన్‌హెచ్‌ఎం)ను శాశ్వత కార్యక్రమంగా ప్రకటించాలని, ప్రజా వైద్య సంస్థలను ప్రయివేటీకరించొద్దని, వైద్య రంగంలో మౌలిక సదుపాయాలు మెరుగుపరచాలని, దీని నిమిత్తం జిడిపిలో ఆరు శాతం కేటాయించాలని, 45, 46వ అంతర్జాతీయ కార్మిక మండలి సమావేశాల్లో సూచించిన ప్రతిపాదనలను అమలుచేయాలని ఆశావర్కర్లు డిమాండ్ చేశారు. తమను రెగ్యులరైజ్ చేసి కనీసం వేతనం రూ.18 వేలుగా నిర్ణయించాలని, మిగిలిన ఉద్యోగులకు వర్తించినట్లుగానే ఇతర అలవెన్సులు ఇవ్వాలని విజ్ఞాపన పత్రంలో పేర్కొన్నారు. ఆ డిమాండ్ల పరిష్కారానికి ప్రయత్నిస్తానని కేంద్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి హామీ ఇచ్చినట్లు ఆశావర్కర్ల బృందం పేర్కొంది.

బ్లూవేల్ లింక్‌లు తొలగించండి

ఫేస్‌బుక్, గూగుల్, యాహూలకు ఢిల్లీ హైకోర్టు నోటీసు

న్యూఢిల్లీ: చిన్నారుల ఆత్మహత్యలకు దారి తీస్తున్న ప్రమాదకరమైన గేమ్ బ్లూవేల్ ఛాలెంజ్‌పై ఢిల్లీ హైకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. ఆ గేమ్‌కు సంబంధించిన లింక్‌లను వెంటనే తొలగించాలని ఫేస్‌బుక్, గూగుల్, యాహూలను ఆదేశించింది. ఈ మేరకు భారత్‌లోని ఆయా సంస్థల మేనేజింగ్ డైరెక్టర్లకు మంగళవారం నోటీసులు పంపించింది. సెర్చ్ ఇంజిన్లు, సామాజిక మాధ్యమాల్లో ఈ గేమ్ లింక్‌లు కనపడనీయకుండా చేయాలని ఆదేశించింది. బ్లూవేల్ గేమ్‌ను నిషేధించాలని కోరుతూ దాఖలైన పిటిషన్ విచారణ సందర్భంగా ఈ నోటీసులు జారీ చేసింది. ఈ గేమ్‌ను నిషేధించే అంశంపై ఢిల్లీ పోలీస్, కేంద్ర ప్రభుత్వంతో పాటు పలు సామాజిక మాధ్యమ సంస్థల ఎమ్‌డిలు తమ స్పందనలు తెలియజేయాలని కోర్టు పేర్కొంది. ఈ అంశంలో తదుపరి విచారణను సెప్టెంబరు 19కి వాయిదా వేసింది. రెండు వారాల పరిధిలో దేశవ్యాప్తంగా ఆరుగురు టీనేజర్ల బ్లూవేల్ గేమ్ ఆడి ఆత్మహత్య చేసుకున్న సంగతి తెలిసిందే.

భారత్ బలగాల ఉపసంహరణే ప్రతిష్టంభనకు పరిష్కారం

రాజ్‌నాథ్ వ్యాఖ్యలపై స్పందించిన చైనా

బీజింగ్ : సిక్కిం సెక్టార్‌లోని డోక్లామ్ వద్ద నెలకొన్న ప్రతిష్టంభనకు ఒకే ఒక్క పరిష్కారం భారత్ తన బలగాలను బేషరతుగా ఉపసంహరించుకోవడమేనని చైనా మంగళవారం పునరుద్ఘాటించింది. కేంద్ర హోం శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సోమవారం డోక్లామ్ ప్రతిష్టంభనకు త్వరలో పరిష్కారం లభిస్తుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

రాజ్‌నాథ్ వ్యాఖ్యలపై ఒకరోజు అనంతరం చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి హువా చునియింగ్ స్పందించారు. డోక్లామ్ ప్రాంతంలో చైనా నిర్మిస్తున్న రోడ్డును అడ్డుకునేందుకు భారత్ చేస్తున్న ప్రయత్నం హాస్యాస్పదంగా ఉందని వ్యాఖ్యానించారు. దీనికి ఒకే ఒక పరిష్కారం అంతకుముందు చెప్పిన విధంగా భారత్ తన బలగాలను, ఆయుధ సామాగ్రిని బేషరతుగా ఉపసంహరించుకో వడమేనన్నారు. డోక్లామ్ వద్ద భారత్ చర్యలు చైనా ప్రజల దృష్టిలో ప్రతికూల ప్రభావాన్ని చూపుతున్నాయని ఆమె అన్నారు.

శాంతి చర్చలకు సిద్ధం : మమత

కోల్‌కతా : ప్రత్యేక గూర్ఖాలాండ్ ఉద్యమకారులతో శాంతిచర్చలకు పశ్చిమబెంగాల్ ప్రభుత్వం అంగీకరించింది. ఈ నెల 29న సచివాలయం వద్ద గూర్ఖాలాండ్ ఉద్యమ నేతలతో ద్వైపాక్షిక సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపింది. ఈ ప్రకటనపై గోర్ఖా జాతీయ లిబరేషన్ ఫ్రంట్ చీఫ్ మన్ ఘీసింగ్ స్పందించారు. ప్రత్యేక గూర్ఖాలాండ్ ఉద్యమం 68వ రోజుకు చేరడంతో తక్షణమే ఈ అంశంపై జోక్యం చేసుకుని డార్జిలింగ్‌లో శాంతి నెలకొల్పాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరామని, మమత ప్రభుత్వం దీనిపై సానుకూలంగా స్పందించడం ఆహ్వానించదగ్గ పరిణామమని అన్నారు. మరోవైపు గూర్ఖాలాండ్ జన్‌ముక్తి మంచ్(జిజెఎం) నేత వినయ్ తమంగ్ మాట్లాడుతూ "డార్జిలింగ్‌లో శాంతి నెలకొల్పడం ఇక్కడి ప్రజలొక్కరి బాధ్యతే కాదన్నారు.



15కి పెరిగిన బార్సిలోనా మృతుల సంఖ్య

మాడ్రిడ్ : బార్సిలోనా, కేంబ్రిల్స్‌ల్లో గత గురువారం జరిగిన తీవ్రవాద దాడుల్లో మృతుల సంఖ్య 15కి పెరిగిందని స్పానిష్ అధికారులు తెలిపారు. కటలోనియా హోం మంత్రి జోయాక్విమ్ ఫార్న్ ఇక్కడ పత్రికా సమావేశంలో మాట్లాడుతూ, తాజాగా మరణించిన వ్యక్తిని పావూ పెరెజ్‌గా గుర్తించామన్నారు. దాడులు జరిగిన కొద్ది గంటల వ్యవధిలోనే పెరెజ్ తన కారులోనే కత్తిపోట్లకు గురయ్యాడు. దాడి జరిపిన అనంతరం లాస్ రాంబ్లాస్ నుండి పారిపోయిన వ్యాన్ డ్రైవర్, మొరాకో జాతీయుడైన యూనస్ అబూఖయూబ్ కాస్త దూరంలో కారులో వున్న పెరెజ్‌ను పొడిచాడని మంత్రి తెలిపారు.

ఆఫ్ఘన్‌లో పోరాటం కొనసాగుతుంది

ట్రంప్ ప్రకటన

వాషింగ్టన్: ఆఫ్ఘనిస్తాన్‌లో అమెరికా సైనిక జోక్యాన్ని మరికొంత కాలం కొనసాగించనున్నట్లు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఆఫ్ఘనిస్తాన్ విషయంలో అనుసరించే కొత్త విధానాన్ని సోమవారం రాత్రి ప్రకటించిన ట్రంప్ ఆఫ్ఘన్‌లో తాలిబన్ల దౌర్జన్యాలకు చరమగీతం పాడుతామన్నారు. అయితే అదనపు దళాలను ఏ మేరకు పంపుతారు, వారు ఎంత కాలం అక్కడ వుంటారన్న విషయాన్ని ఆయన ఇందులో వెల్లడించలేదు. ఆఫ్ఘన్ ప్రభుత్వం పౌర పాలనా పరంగానూ, సైనిక పరంగానూ మెరుగైన పాలన అందించేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు. పాకిస్తాన్ తన భూభాగం నుండి ఉగ్రవాద కార్యకలాపాలను ఇకపై ఎంతమాత్రం అనుమతించరాదని ట్రంప్ సూచించారు. తన సూచనను పాటించకపోతే తీవ్రంగా నష్టపోతారని హెచ్చరించారు.

నాలుగు వేల మంది అదనపు దళాలు



ఆఫ్ఘనిస్థాన్‌లో దేశ పునర్నిర్మాణానికి తాము ప్రయత్నించటం లేదని, ఉగ్రవాదులను అంతం చేసేందుకే తాము అక్కడ వున్నామని ట్రంప్ స్పష్టం చేశారు. ఆఫ్ఘన్‌లో ఉగ్రవాద భూతాన్ని తరిమికొట్టేందుకు మరికొంత మంది సైనికులను పంపనున్నట్లు ఆయన చెప్పారు. గత అధ్యక్షుడు ఒబామా చేసినట్లు యుద్ధ ప్రణాళికలను ముందుగానే వెల్లడించే తప్పు తాను చేయబోనని ఆయన అన్నారు. అయితే దాదాపు 4 వేల మంది సైనికులను ఆఫ్ఘన్‌కు పంపేందుకు సన్నాహాలు పూర్తయినట్లు ట్రంప్ సన్నిహిత వర్గాలు వెల్లడించాయి. ఆఫ్ఘనిస్తాన్ మళీ ప్రగతి బాటలో పయనిస్తూ భద్రతకు మారుపేరుగా మారితే తమకు ప్రయోజనకరమని ఆయన వివరించారు. ఆఫ్ఘన్ ప్రభుత్వానికి, తాలిబన్లకు చర్చలను సమర్థించేందుకు తాము సిద్ధంగా వున్నామని, అయితదిందుకు ఎటువంటి ముందస్తు షరతులూ వుండరాదని ఆయన చెప్పారు. ఆఫ్ఘనిస్తాన్‌లో అమెరికా యుద్ధం పెరుగుతున్న మాట వాస్తవమేనని ఆయన అంగీకరించారు.

ఉగ్రవాదాన్ని ఉపేక్షించం

పాకిస్తాన్‌ను ఉగ్రవాదులు స్వర్గధామంగా ఉపయోగించుకుంటుంటే తాము మౌనంగా వుండబోమని ట్రంప్ స్పష్టం చేశారు. ఉగ్రవాదులను తరిమికొట్టే విషయంలో ఆఫ్ఘనిస్తాన్‌తో చేతులు కలపాలని ఆయన పాకిస్తాన్‌కు సూచించారు.



ఇటలీ పర్యాటక కేంద్రంలో భూంకంపం

ఒకరు మృతి, పలువురికి గాయాలు

నాప్లెస్(ఇటలీ) : ఇటలీలోని ఇచియా అగ్నిపర్వత ప్రాంతానికి సమీపంలోని ప్రముఖ పర్యాటక కేంద్రంలో సోమవారం భూకంపం సంభవించింది. రిచ్‌టర్ స్కేలుపై దీని తీవ్రత 3.6గా నమోదైంది. ఈ భూకంప తీవ్రతకు స్థానిక మహిళ ఒకరు మరణించగా, పలువురు గాయపడ్డారు. అనేకమంది ఆచూకీ తెలియరావడం లేదు. వీరు కూలిపోయిన భవనాల కింద చిక్కుకుపోయి వుంటారని భావిస్తున్నారు. పలు భవనాలు ధ్వంసమయ్యాయని అధికారులు తెలిపారు. శిథిలాల కింద చిక్కుకుపోయి చనిపోయిన ఆ మహిళ మృతదేహాన్ని ఇంకా వెలికితీయలేదు. శిథిలాల వెలికితీతకు చర్యలు తీసుకుంటున్నామని, పెద్ద ఎత్తున గాలింపు చేపట్టామని అధికారులు తెలిపారు. శిథిలాల కింద చిక్కుకుపోయిన ముగ్గురు పిల్లలను కాపాడారు. ఆ దీవి నుండి ప్రజలను తరలించేందుకు బోట్లను, హెలికాప్టర్లను ఉపయోగిస్తున్నారు. గాయపడిన వారిని వైద్య సాయం నిమిత్తం హెలికాప్టర్లలో తక్షణమే నాప్లెస్‌కు తరలించారు. నాప్లెస్ నగరానికి సమీపంలో, ఇటలీ తీర ప్రాంతానికి 10కిలోమీటర్ల దూరంలో రాత్రి 9గంటల సమయంలో భూకంపం వచ్చినట్లు స్థానిక మీడియా వార్తలు తెలిపాయి.

పొంచివున్న అశాంతి ముప్పు

అమెరికన్లలో పెరుగుతున్న భయాందోళనలు

వాషింగ్టన్ : అమెరికాలో చోటు చేసుకుంటున్న రాజకీయ పరిణామాల కారణంగా ఆర్థిక వ్యవస్థ కుప్పకూలుతుందన్న, సామాజిక అశాంతి నెలకొంటుందన్న భయాందోళనలు పెరుగుతున్నాయి. అధ్యక్షుడుగా డొనాల్డ్ ట్రంప్ ఎన్నికైన వెంటనే పరుగులు తీసిన అమెరికా స్టాక్ మార్కెట్ ఇప్పుడు పెద్ద ఎత్తున తిరోగమన దిశగా అడుగులు వేయడం పట్ల అంతర్జాతీయ ఆర్థిక వర్గాల్లో ఆందోళనలు నెలకొన్నాయి. వాస్తవానికి, అమెరికాలోని రాజకీయ వర్గాలు ప్రచ్ఛన్న యుద్ధం దిశగా పయనిస్తున్నాయనే వాస్తవాన్ని ఈ ఆందోళనలు కప్పిపుచ్చుతున్నాయి. డౌ జోన్స్, ఇతర మార్కెట్ సూచీలు రికార్డు స్థాయిలో ఎగబాకడానికి ఆనాడు ట్రంప్ వాణిజ్యం సాయపడింది. అయితే ట్రంప్ విధానాల కారణంగా ఆర్థిక వ్యవస్థకు విఘాతం కలుగుతోందనే భావన వాల్‌స్ట్రీట్ స్పెక్యులేటర్లలో, కార్పొరేట్ ఎగ్జిక్యూటివ్‌ల్లో పెరుగుతోంది. వాణిజ్య వర్గాల్లో నెలకొన్న ఈ భావనకు ఇటీవల వర్జీనియాలోని చార్లెట్స్‌విల్లేలో జరిగిన హింసాకాండ, దానిపై ట్రంప్ వ్యాఖ్యలు ఆజ్యం పోసాయి. నయా నాజీలను సమర్థిస్తూ ట్రంప్ చేసిన వ్యాఖ్యలు అంతర్జాతీయంగా అమెరికా సామ్రాజ్యవాద ప్రయోజనాలకు విఘాతం కలిగించాయని భావిస్తున్నారు. దేశీయంగా సామాజిక, రాజకీయ అస్థిరత ముప్పు పొంచి వుందనే సంకేతాలు తలెత్తాయని భావిస్తున్నారు. ట్రంప్ కారణంగా తలెత్తిన ఈ అస్థిరత పట్ల గల ఆందోళనల వెనుక తీవ్రమైన భయాలు వున్నాయి. ట్రంప్ కన్నా మించి ప్రస్తుతం అమెరికా పాలక వర్గం ఎదుర్కొంటున్న సమస్యలు చాలా వున్నాయి. ప్రస్తుతం నెలకొన్న రాజకీయ ఘర్షణలను అమెరికా అధిగమించగలిగినట్టైతే ఆ ప్రభావం ఆర్థిక వ్యవస్థపై చాలా వుంటుందని, సమర్థవంతమైన ఆర్థిక, ద్రవ్య విధానాలు చూపే ప్రభావం కన్నా మించి వుండగలదని భావిస్తున్నట్లు ప్రపంచంలోనే అతిపెద్ద హెడ్జ్ ఫండ్ సంస్థ బ్రిడ్జి వాటర్ అధినేత రే డాలియో వ్యాఖ్యానించారు. లేదా 1937లోని ఆర్థిక సంక్షోభం నాటి పరిస్థితులకు మళ్లగలదని ఆయన



హెచ్చరించారు. ఇక్కడ 1937నాటి ప్రస్తావన చాలా కీలకమైనది. ఎందుకంటే ఆనాడు కూడా అంతర్గతంగా, బయట కూడా తీవ్రమైన రాజకీయ ఘర్షణలు నెలకొని వున్నాయి. ప్రజాస్వామ్య క్రమానికి ముప్పులు ఎదురయ్యాయి. యుద్ధాలు ఎప్పుడైనా సంభవించవచ్చనే ఆందోళనలు, భయాలు నెలకొన్నాయని డాలియో పేర్కొన్నారు. సాధారణంగా పరిశీలన జరిపితే అమెరికా ఆర్థిక వ్యవస్థ బాగుందనే ఎవరైనా నిర్ధారిస్తారని డాలియో పేర్కొన్నారు. అయితే గణాంకాలవారీగా పరిశీలిస్తే సంపద, ఆదాయాల మధ్య అంతరాలు చాలా ఎక్కువగా వున్న విషయం విదితమవుతుందని డాలియో పేర్కొన్నారు. దేశ నాయకత్వాన్ని, అది అనుసరిస్తున్న దిశా నిర్దేశాన్ని మెజారిటీ అమెరికన్లు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని అన్నారు. పైగా అమెరికా అంటే ఆర్థిక అవకాశాలు మెండుగా వుండే దేశమని ఇప్పటివరకు వున్న భావన కూడా నెమ్మదిగా కరిగిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. 2008 ఆర్థిక సంక్షోభం తర్వాత ప్రపంచ కేంద్ర బ్యాంకులు సృష్టించిన ఆర్థిక బుడగ పేలిపోతుందనే సంకేతాలు వెలువడుతున్న పరిస్థితుల్లో కార్మిక వర్గం జోక్యం చేసుకుంటుందనే ఆలోచనే పాలక వర్గాన్ని భయకంపితులను చేస్తోందని అన్నారు.



సైనిక విన్యాసాలు ఆపండి

అమెరికా, దక్షిణ కొరియాలను కోరిన చైనా

ప్రతీకార చర్య తప్పదన్న ఉత్తర కొరియా

బీజింగ్ : ఉమ్మడి సైనిక విన్యాసాలను నిలుపుచేయాలని అమెరికా, దక్షిణ కొరియాలను చైనా సోమవారం కోరింది. ఇరు దేశాలు వార్షిక విన్యాసాలు ప్రారంభించిన నేపథ్యంలో చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి హువా చునియాంగ్ స్పందిస్తూ, కొరియా ద్వీపకల్పంలో ప్రస్తుతం పరిస్థితి చాలా ఉద్రిక్తంగా, సున్నితంగా వుందని అన్నారు. ఈ ఉద్రిక్తతలను తగ్గించేందుకు అమెరికా, దక్షిణ కొరియాలు కృషి చేయాలని అన్నారు. ఉత్తరకొరియా అణు సమస్యను శాంతియుతంగా పరిష్కరించేందుకు ఆరు దేశాల చర్చలను పునరుద్ధరించాలని చైనా కోరుతోంది. ప్రస్తుత పరిస్థితుల్లో సంయుక్త విన్యాసాలకు అనువైన పరిస్థితి వుందని తాము భావించడం లేదని అన్నారు. విన్యాసాలను నిలుపు చేసే అంశాన్ని ఉభయ పక్షాలు పరిశీలించాలని హువా కోరారు. ఉద్రిక్తతలను తగ్గించడానికి ఇటువంటి విన్యాసాలు ఎంతమాత్రమూ దోహదపడవని అన్నారు. 'ఉలిచి ఫ్రీడం గార్డియన్' సంయుక్త సైనిక విన్యాసాల్లో అమెరికా, దక్షిణ కొరియాలకు చెందిన వేలాదిమంది సైనికులు పాల్గొంటున్నారు. కాగా ఈ వార్షిక విన్యాసాలను "దాడిచేసేందుకు రిహార్సల్" గా ఉత్తర కొరియా భావిస్తోంది. అమెరికా చేస్తున్న కవ్వింపు చర్యగానే పరిగణిస్తోంది. దక్షిణ కొరియాలో పెద్ద ఎత్తున జరిగిన ఈ సైనిక బలగాల మోహరింపు చిట్టచివరకు యుద్ధంగా పరిగణమించబోదన్న హామీని ఎవరూ ఇవ్వలేరని వ్యాఖ్యానించింది. అమెరికా సైనిక ఉన్నతాధికారులు దక్షిణ కొరియాను సందర్శించిన నేపథ్యంలో ఉత్తర కొరియా ఈ వ్యాఖ్య చేసింది. దక్షిణ కొరియాలో వివాదాస్పదమైన థాడ్ వ్యవస్థను మోహరించిన ప్రాంతాన్ని అమెరికా జనరల్స్ సందర్శించనున్నారు.

కలలు కని సాకారం చేసుకోండి

ప్రజలకు లూలా దసిల్వా పిలుపు



బ్రసీలియా : కలలు గని, వాటిని సాకారం చేసుకోవడం ద్వారా మళ్లీ ఎదగాలని మాజీ అధ్యక్షుడు లూయిజ్ ఇనాసియో లూలా డసిల్వా ప్రజలకు పిలుపునిచ్చారు. వర్కర్స్ పార్టీ నాయకత్వంలోని ప్రభుత్వాల హయాంలో జరిగినట్లుగా ఇప్పుడు కూడా అభివృద్ధి క్రమం సాగాలని కోరారు. వర్కర్స్ పార్టీ ప్రభుత్వ హయాంలో 2కోట్ల 20లక్షల ఉద్యోగాలు కొత్తగా సృష్టించబడ్డాయన్నారు. 60లక్షల చిన్నపరిశ్రమలు ఏర్పాటయ్యాయన్నారు. కనీస వేతనం 74శాతం పెరిగిందని, 10శాతం సంపన్నుల కన్నా మించి 10శాతం నిరుపేదల ఆదాయం పెరిగిందని పేర్కొన్నారు. ఈ కారణాల వల్లనే పెన్షన్ వ్యవస్థ అనేదాన్ని సంస్కరణ చర్యగా కాకుండా సమృద్ధి చర్యగా పరిగణించడం సాధ్యమైందన్నారు. పైగా, అది సంస్కరణ తీసుకురావడానికి ఉద్దేశించిన ప్రతిపాదన కూడా కాదని, ధ్వంసం చేయడానికి ఉద్దేశించిన చర్య అని లూలా వ్యాఖ్యానించారు. ఆర్థిక సంక్షోభ వ్యయాలను కార్మికులపై మోపడానికి టెమర్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. పెన్షన్ వ్యవస్థలో సంస్కరణలు తీసుకురావడాన్ని ఆమోదిస్తే, అది ప్రజలపై దాడి చేయడమే కాగలదని అన్నారు.

రిటైర్‌మెంట్, పెన్షన్ల వల్ల వచ్చే ఆర్థిక వనరులతో అనేక చిన్న నగరాలు పనిచేస్తున్నాయన్నారు. పేదలనేవారు సమస్య కాదని, పరిష్కరించాల్సిన అంశంలో భాగమని వర్కర్స్ పార్టీ ప్రభుత్వాలు రుజువు చేశాయన్నారు. ఆర్థిక, రాజకీయ నిర్ణయాలకు మార్కెట్ కేంద్రం కారాదని వ్యాఖ్యానించారు. ఆ స్థానంలో ప్రజలు వుండాలని ఆయన నొక్కి చెప్పారు.

మొదటి పేజీ తరువాయి

జీవో 279 రద్దు చేయకపోతే సమ్మె తప్పదు

చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా రైల్వే స్టేషన్ నుంచి అలంకార్ సెంటర్ వరకు మహాప్రదర్శన నిర్వహించారు. అనంతరం అక్కడ నిర్వహించిన మున్సిపల్ కార్మికుల గర్జన సభలో కార్మికులనుద్దేశించి సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఎ గఫూర్ మాట్లాడారు. ఏడాది నుంచి మున్సిపల్ కార్మికులు డిమాండ్లను పరిష్కరించాలని వివిధ రూపాల్లో ఆందోళనలు చేశారని గఫూర్ గుర్తు చేశారు. జీవో 279తో కార్మికులు ఆందోళనలో ఉన్నారని, అయితే ప్రభుత్వం ఈ అంశంపై చర్చించి, భరోసా ఇచ్చేందుకు సిద్ధంగా లేదని తెలిపారు. మధ్యాహ్న భోజన పథకం, ఆశా, అంగన్‌వాడీలు.. ఇలా కార్మికులందరినీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దూరం చేసుకుంటున్నారని, ఈ నేపథ్యంలో వచ్చే 2019 ఎన్నికల్లో టిడిపిని ఎవరూ కాపాడలేరని హెచ్చరించారు.

సెప్టెంబర్ 15 నాటికి మున్సిపల్ కార్మికులంతా సమ్మెకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి ఓబులేసు మాట్లాడుతూ ఎర్రజెండాను చూస్తే చంద్రబాబు సహించలేకపోతున్నారన్నారు. 279 జీవో అమలుకు అధికారులపై ముఖ్యమంత్రి ఒత్తిడి తెస్తున్నారన్నారు. ప్రభుత్వ విధానాలను వ్యతిరేకంగా కార్మిక సంఘాలన్నీ కలిసి పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అసంఘటిత కార్మిక వర్గాన్నీ కదిలిస్తామని తెలిపారు.

ఐక్య పోరాటాలకు పిలుపు

పిడిఎఫ్ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు మాట్లాడుతూ కార్మికుల ఐక్య పోరాటాల వల్లే ప్రభుత్వం ఒక అడుగు వెనక్కు వేసిందని, అయితే మున్సిపల్ కార్మికుల మెడపై కత్తిలా 279 జీవో వేలాడుతూనే ఉందని తెలిపారు. ఈ జీవో రద్దు కోసం ఐక్యంగా పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. మున్సిపల్ కార్మికులు రెండు రోజులు పనులు ఆపేస్తే నగరాలు చెత్తమయం అవుతాయని, ప్రజా జీవనం స్తంభించిపోగలదని హెచ్చరించారు. కార్మికులు చేసే ఆందోళనలకు సంపూర్ణ మద్దతు ఇస్తామని ప్రకటించారు. మరో పిడిఎఫ్ ఎమ్మెల్సీ వై శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వం కార్పొరేట్లకు కొమ్ముకాస్తోందని విమర్శించారు. మున్సిపల్ కార్మికుల పొట్టకొట్టే 279 జీవోను రద్దు చేసి, 151 జీవోను అమలు చేయాలని డిమాండ్ చేశారు. శాసనమండలి సమావేశాల్లో పిడిఎఫ్ తరపున కార్మికుల సమస్యలను ప్రస్తావించి, పరిష్కారానికి కృషి చేస్తామని హామీనిచ్చారు. బ్యాంక్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్ అజయ్‌కుమార్ హాజరై కార్మికుల ఆందోళనకు తమ ఫెడరేషన్ మద్దతును ప్రకటించారు. మున్సిపల్ జెఎసి నాయకులు కె ఉమామహేశ్వరరావు, తులసీచంద్ర అధ్యక్షత వహించిన ఈ సభలో జెఎసి నాయకులు ఎ రంగనాయకులు, నెక్కంటి సుబ్బారావు, పి వెంకటేష్, ఎస్ శంకరరెడ్డి, ఎం డేవిడ్, ఎస్ కమల్, ఎం రామారావు, జి సుబ్బారావు, ఇ మధుబాబు, ఐఎఫ్‌టియు నాయకులు ప్రసాద్, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

నీటి కోసం న్యాయ పోరాటం

చేశారన్నారు. రైతు బజార్ల సంఖ్యను 150కి పెంచనున్నట్లు చెప్పారు. 74 శాతం మంది గత నెల కంటే ఈ నెల ధరలు అధికంగా ఉన్నాయని తెలిపారన్నారు. పింఛన్ల పంపిణీపై 95 శాతం, రేషన్ పంపిణీపై అదే స్థాయిలో ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు చెప్పారు. చంద్రన్న బీమాను పిఎంఎవై చంద్రన్న బీమాగా మార్పు చేసి కొన్ని అంశాల్లో పరిహారం పెంచుతున్నట్లు చెప్పారు. ఈనెల 23వ తేదీ నుంచి గృహనిర్మాణ పథకాలపై సర్వే ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. నిర్ణీత సమయంలోగా వినతులు, ఫిర్యాదులను పరిష్కరించాలని అధికారులకు సూచించారు.

ప్రజలకు విపక్షనేత ఉన్మాదాన్ని ఎక్కిస్తున్నారు..

ప్రతిపక్షనేత ఉన్మాదాన్ని ప్రజలకెక్కిస్తున్నారని విమర్శించారు. 30 శాతం వర్షపాతం తక్కువగా ఉన్నా ఎక్కడా తాగునీటి సమస్య లేకుండా చేశామన్నారు. సెప్టెంబరు 15 నాటికి రియల్‌టైం గవర్నెన్స్ కార్యాలయాన్ని వెలగపూడికి తరలిస్తున్నట్లు చెప్పారు. ఇతర రాష్ట్రాల్లో ఉంటున్న తెలుగు ప్రజలు పరిష్కార వేదికకు ఫోన్ చేయాలంటే 18004254440కు నంబరు కేటాయించినట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా 'మూడేళ్ళలో రూ.2 లక్షల కోట్లతో సంక్షేమ పథకాలు' పుస్తకాన్ని సిఎం ఆవిష్కరించారు. హిజ్రాలకూ పింఛన్లు, ఇతర సంక్షేమ పథకాలు అమలు చేస్తామని హామీ ఇచ్చారు.

నంద్యాలలో నేడే పోలింగ్

ప్రజాశక్తి -నంద్యాల

రాష్ట్రవ్యాప్తంగా ఉత్కంఠతతో ఎదురు చూస్తున్న నంద్యాల ఉప ఎన్నికకు జిల్లా అధికార యంత్రాంగం సన్నాహాలు పూర్తి చేసింది. నేటి ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకూ జరిగే పోలింగ్‌కు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. సాయంత్రం ఆరు గంటల లోపు ఓటర్లు పోలింగ్ కేంద్రం అవరణలోకి వస్తే వారందరికీ ఓటు వేసే అవకాశం కల్పించారు. మంగళవారమే అన్ని కేంద్రాలకు పోలింగ్ సామాగ్రిని చేరవేశారు. రాష్ట్రంలో తొలిసారిగా ఓటర్లు తాము వేసిన ఓటును సరిచూసు కునేందుకు 'ఓటర్ వెరిఫైడ్ పేపర్ ట్రయిల్' (వివిపిఎటి) యంత్రాలను ఏర్పాటు చేయనున్నారు. ఇలా ఉండగా ప్రధాన పార్టీలు రెండూ ప్రలోభాలకు తెరలేపాయి. విచ్చలవిడిగా డబ్బు కుమ్మరిం చాయి. మహిళలకు ముక్కుపుడకలు, చీరలు కూడా పంపిణీ చేశారు.

నంద్యాల ఉప ఎన్నికల పరిధిలో 2,18,855 మంది ఓటర్లుకుగాను 255 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎన్నికల నిర్వహణకు దాదాపుగా 15 వేల సిబ్బందిని నియమించారు. 141 అతి సమస్యాత్మక, 74 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించారు. ఆరు కంపెనీల కేంద్ర పోలీసు బలగాలతో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. నంద్యాల పట్టణం, నంద్యాల రూరల్, గోస్పాడు మండలాల్లో పోలింగ్ జరగనుంది. అన్ని కేంద్రాల్లోనూ వెబ్ క్యాస్టింగ్ ఏర్పాట్లు చేశారు. నెట్ వర్కు లేని ప్రాంతాల్లోనూ నిరంతరం వీడియోలు తీసేలా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు.

మొత్తం 15 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. ప్రధాన పోటీ అధికార తెలుగుదేశం పార్టీ అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డి, ప్రధాన ప్రతిపక్ష పార్టీ వైసిపి అభ్యర్థి శిల్పా



పోలింగు సామాగ్రితో సిద్ధమవుతున్న ఎన్నికల సిబ్బంది

మోహన రెడ్డి మధ్యనే ఉంది. ఇక్కడ కాంగ్రెస్ అభ్యర్థిగా అబ్దుల్ ఖాదర్ పోటీలో ఉన్నారు. .

ప్రచార గడువు ముగిశాక స్థానికేతరులు నంద్యాలను విడిచిపోవాలని ఎన్నికల కమిషన్ ఆదేశించడం తో అధికార పార్టీకి చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, కీలక నాయకులు, కొందరు ప్రతిపక్ష నాయకులు నంద్యాల పరిసర ప్రాంతాల్లోనే మకాం వేశారు. మంత్రులు ఆదినారాయణరెడ్డి, అమర్‌నాథ్ రెడ్డి, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పక్కనే ఉన్న బనగాన పల్లెలో మకాం వేసి అక్కడి నుంచి ఫోన్‌ల ద్వారా మంత్రాంగాన్ని నడుపుతున్నారు. మహానంది, పాణ్యంలో ఉండే లాడ్జిలన్నింటినీ ముందుగా బుక్ చేసుకుని ప్రస్తుతం అక్కడి నుంచి మంత్రాంగాన్ని నడుపుతున్నారు. కోడ్ మూలాన నంద్యాలలో మద్యంషాపులు మూసివేయడంతో మైదుకూరు, ప్రొద్దుటూరు నుంచి గిద్దలూరు (ప్రకాశం) మద్యం తరలించేందుకు ఏర్పాట్లు చేసుకున్నట్లు తెలిసింది.

ఏజెంట్లకు ఆటంకం కల్గించొద్దు : హైకోర్టు

నంద్యాల ఉప ఎన్నికల్లో వైసిపి అభ్యర్థి తరపు పోలింగ్ ఏజెంట్ల విధులకు ఆటంకం కలిగించవద్దని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. అదే సమయంలో శాంతి భద్రతలకు భంగం కల్గిస్తే చర్యలు తీసుకోవచ్చని కూడా స్పష్టం చేసింది. పోలింగ్ ఏజెంట్లుగా తమ పేర్లు ఇచ్చిన వెంటనే పోలీసులు తమ ఇళ్లకు వచ్చి వేధింపులకు గురి చేస్తున్నారంటూ వైసిపి పోలింగ్ ఏజెంట్లు రిట్లను మంగళవారం జస్టిస్ చల్లా కోదండరామ్ విచారించారు.

శిల్పా ఇంట్లో సోదాలు

మొదటి పేజీ తరువాయి

పాల్పడడం తగదన్నారు. టిడిపి బెదిరింపులకు భయపడమని, నంద్యాలలో ప్రజలు మా వెంటే ఉన్నారన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు నిబంధనలను అతిక్రమించి డబ్బులు, చీరలు పంపిణీ చేసినా ప్రేక్షక పాత్ర వ్యవహరించిన పోలీసులు, మాపై ఉద్దేశపూర్వకంగా తనిఖీలు చేస్తున్నారని చెప్పారు. మంత్రి అఖిలప్రియ ఇంట్లో ఆళ్లగడ్డలో మకాం వేసిన మంత్రులు, నాయకులను పట్టించుకోవడం లేదన్నారు. మంత్రి ఆదినారాయణ రెడ్డి, ఎమ్మెల్సీ ఎన్ఎండి.ఫరూక్, ఎమ్మెల్యేలు సాయంత్రం దాకా డబ్బులు పంపిణీ చేశారని ఆరోపించారు. ఏజెంట్ ఫారాలు ఇవ్వకుండా పోలీసులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని చెప్పారు. డ్యూటీలో ఉన్న పోలీసు అధికారిని ఈ విషయం మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా పట్టణంలో 144 సెక్షన్ ఉన్నందున ఎక్కువ మందిని బయట తిరగకుండా జాగ్రత్త తీసుకుంటున్నామని ఉద్దేశ పూర్వకంగా ఏమీ చేయడం లేదన్నారు.

అంతర్ రాష్ట్ర బదిలీలకు మార్గదర్శకాలు ఇవ్వాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉపాధ్యాయుల అంతర్ రాష్ట్ర బదిలీలకు దరఖాస్తు చేసుకోవడానికి వీలుగా డిఇఒలకు మార్గదర్శకాలు ఇవ్వాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ కె సంధ్యారాణిని యుటిఎఫ్ కోరింది. ఇబ్రహీంపట్నంలోని డైరెక్టరేట్ కార్యాలయంలో కమిషనర్‌ను ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఐ వెంకటేశ్వరరావు, పి బాబురెడ్డి కలిసి ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. ప్రత్యామ్నాయంతో నిమిత్తం లేకుండా బదిలీ అయిన వారందరినీ రిలీవ్ చేయాలని, ఏజెన్సీలోని పోలవరం ప్రాజెక్టు ముంపు మండలాల్లో డిప్యూటేషన్‌పై పని చేస్తున్న వారందరినీ రిలీవ్ చేయాలని కోరారు. 610 జీవో అమలులో భాగంగా ప్రమోషన్లు నిలిపివేశారని, దీనిపై డిఇఒలకు తగిన ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. డిఇఒల నుంచి సమాచారం వచ్చిన వెంటనే రిలీవింగ్‌పై నిర్ణయం తీసుకుంటామని, అంతర్ రాష్ట్ర బదిలీలకు వచ్చిన ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపుతామని కమిషనర్ యుటిఎఫ్ నాయకులకు హామీనిచ్చారు. డిఎస్సీ మెరిట్ కం రోస్టర్ లిస్టు ఆన్‌లైన్‌లో ఉంచమని డిఇఒలకు ఆదేశాలు ఇస్తామని, 610 జీవో అమలు, ప్రమోషన్ల సమస్యలపై తగు ఆదేశాలు ఇస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు.

మోడల్ స్కూళ్ల టీచర్లకు వేతనాలు విడుదల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆదర్శ పాఠశాలల ఉపాధ్యాయులకు, సిబ్బందికి మూడు నెలల వేతనాలుగా రూ.41.22 కోట్లు విడుదల చేస్తూ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆదిత్యనాథ్ దాస్ మంగళవారం ఉత్తర్వులు విడుదల చేశారు. ఈ ఉత్తర్వుల పట్ల ఆంధ్రప్రదేశ్ మోడల్ స్కూల్స్ టీచర్స్ ఫెడరేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మురళీమోహన్, ఎన్ బోసుబాబు, ఎపిటిఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జి హృదయరాజు, కె వెంకటేశ్వరరావు హర్షం వ్యక్తం చేశారు.

రెబల్స్‌కు జై

మొదటి పేజీ తరువాయి

ఉండటంతో కనీసం 15 సీట్లు ఇవ్వాలంటూ ఆ పార్టీ నేతలు తీవ్ర ఒత్తిడి తీసుకొచ్చారు. చివరికి తొమ్మిది సీట్లు కేటాయించేలా ఒప్పించుకోగలిగారు. బిజెపికి 4, 5, 9, 29, 35, 36, 39, 41, 47 డివిజన్లను కేటాయించాలని పట్టు బట్టి మరీ తీసుకున్నారు. 5, 9, 47 డివిజన్లలో ఆ పార్టీకి కొంత పట్టుంది. మిగిలిన డివిజన్లలో జనంతో సంబంధం లేని వారిని ఎన్నికల్లో నిలబెట్టారు. దీంతో టిడిపిలో ఉండి సీట్లు ఆశించిన నాయకులు ఆయా డివిజన్లలో రెబల్స్‌గా పోటీ చేస్తున్నారు. కొన్ని డివిజన్లలో బిజెపి అభ్యర్థులు ప్రచారమే ప్రారంభించలేదు. మరికొన్ని డివిజన్లలో నామమాత్రం గా ప్రచారం సాగుతోంది. బిజెపి పోటీ చేస్తున్న డివిజన్లలో టిడిపి రెబల్స్ గట్టి పోటీ ఇవ్వడం, బిజెపికి కొన్ని ఓట్లు చీలిపోయి ప్రత్యర్థి సునాయాసంగా గెలుపొందే అవకాశా లుండటంతో టిడిపి, బిజెపి నాయకులు సమాలోచనలు చేసుకున్నారు. దీంతో గట్టి పోటీ ఇచ్చే టిడిపి రెబల్స్‌కు మద్దతు ఇచ్చి గెలిపించుకోవాలని నిర్ణయించారు. 35వ డివిజన్‌లో బిజెపి అభ్యర్థి కొండాబత్తుల ప్రసాద రావు ఎన్నికలకు ఇష్టపడని కారణంతోపాటు బలహీనంగా ఉన్నందున టిడిపి రెబల్‌గా పోటీ చేసిన బలుసూరి రామకృష్ణకు మద్దతు ఇచ్చారు. స్థానిక ఎంఎల్ఎ వనమాడి వెంకటేశ్వరరావు, బిజెపి జిల్లా అధ్యక్షుడు యెనిమిరెడ్డి మాలకొండయ్య కలిసి ఆ డివిజన్‌లో రామకృష్ణ తరపున ప్రచారం చేశారు. స్వతంత్రంగా బరిలో దిగిన రామకృష్ణ టిడిపి, బిజెపి కండువాలను వేసుకుని మరీ ప్రచారం చేస్తున్నారు. 39వ డివిజన్‌లో తోర కృష్ణప్రియకు బిజెపి సీటు ఇచ్చారు. టిడిపి నుంచి స్వతంత్ర అభ్యర్థిగా రంగంలో ఉన్న దుర్గాసి సుధారాణికి ఈ రెండు పార్టీలు మద్దతు ఇస్తున్నాయి. 47వ డివిజన్‌లో గుంటూరు పద్మను బిజెపి అభ్యర్థిగా నిలిపారు. అక్కడ టిడిపి రెబల్‌గా పోటీలో ఉన్న కొల్లాబత్తుల రాజ్యలక్ష్మికి మద్దతు ఇవ్వాలని టిడిపి, బిజెపి నేతలు నిర్ణయించినట్లు సమాచారం. 4, 29, 38 డివిజన్ల లోనూ రెబల్స్‌కే మద్దతు ఇచ్చే విషయంలో సమాలోచనలు జరుగుతున్నట్లు సమాచారం. బిజెపి నాయకుల తప్పిదం కారణంగా కొన్ని సీట్లను వదులుకోవలసి వస్తుందని టిడిపి నాయకులు బాహాటంగానే అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

కాకినాడలో టిడిపి విజయం ఖాయం : పత్తిపాటి

త్వరలో కాకినాడ కార్పొరేషన్ ఎన్నికలో టిడిపి భారీ మెజార్టీతో గెలుపొందడం ఖాయమని వ్యవసాయశాఖ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. తూర్పుగోదావరి జిల్లా కాకినాడలోని టిడిపి జిల్లా కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాకినాడ నగర అభివృద్ధికి రూ.1,200 కోట్లు కేటాయించి అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నామన్నారు. కాలుష్యరహిత నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళిక రూపొందించామన్నారు. కాంగ్రెస్ హయాంలో ఎటువంటి అభివృద్ధీ జరగలేదని విమర్శించారు. కార్పొరేషన్ ఎన్నికల్లో 48 డివిజన్లలో బిజెపి, టిడిపిలు గెలవడం ఖాయమన్నారు. వైసిపి అడ్రస్ పూర్తిగా గల్లంతవుతుందని చెప్పారు. కార్పొరేషన్‌లో రెబల్‌అభ్యర్థులను పిలిచి మాట్లాడుతున్నామన్నారు.

పెద్ద చెరువు రక్షణ చర్యలేంటి?

ప్రకాశం కలెక్టర్‌ను ఆదేశించిన హైకోర్టు

ప్రజాశక్తి - హైదరాబాద్

పర్చూరు మండలం దేవరపల్లిలోని కష్ణంరాజు చెరువు అనే పెద్ద చెరువు ఆక్రమణల వివరాలు, చెరువు రక్షణకు తీసుకున్న చర్యలను తెలపాలని ప్రకాశం జిల్లా కలెక్టర్, ఆ గ్రామ పంచాయతీ కార్యదర్శిని హైకోర్టు ఆదేశించింది. 39 ఎకరాలకుపైగా ఉన్న ఆ చెరువును కొందరు ఆక్రమించుకుని పంటలు సాగు చేసుకుంటే అధికారులు తమకేమీ పట్టనట్లుగా ప్రేక్షకపాత్ర పోషిస్తున్నారని, చెరువును కాపాడేలా ఆదేశాలివ్వాలని కోరుతూ ఎంపిటిసి సభ్యులు గండు సుబ్బారావు ప్రజాహిత వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. తాత్కాలిక ప్రధాన న్యాయ మూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి ఉమాదేవిలతో కూడిన డివిజన్ బెంచ్ మంగళవారం ఈవ్యాజ్యాన్ని విచారించింది. చెరువును రక్షించేందుకు చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులకు, పంచాయతీ కార్యదర్శికి బెంచ్ ఉత్తర్వులిచ్చి, తదుపరి విచారణ రెండు వారాలకు వాయిదా వేసింది.

స్తంభించిన బ్యాంకులు

ఈ సమ్మె జరిగింది. ప్రభుత్వం ప్రతిపాదించిన బ్యాంకుల ఏకీకరణ అంశంతో పాటు వినియోగదారులపై పడుతున్న అదనపు ఆర్థిక భారల సమస్యలపై సమ్మె చేయాలని ఫోరం పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే.

తమిళనాడులో : తమిళనాడులో 55 వేల మందికిపైగా బ్యాంకు ఉద్యోగులు సమ్మెలో పాల్గొన్నట్లు అఖిల భారత ఉద్యోగుల సంఘం నేత ప్రధాన కార్యదర్శి సిహెచ్ వెంకటాచలం తెలిపారు. పలు చోట్ల చెక్‌లు క్లియర్ కాకపోవడంతో 10,300 బ్రాంచీల్లో లావాదేవీలు కూడా నిలిచిపోయాయయనీ, రూ. 7,300 కోట్ల విలువైన 12 లక్షల ఆర్థిక లావాదేవీలు నిలిచిపోయాయని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా బ్యాంకు ఉద్యోగుల సమ్మె విజయవంతమైందని ఆయన చెప్పారు. సమ్మె కారణంగా అనేక బ్యాంకుల్లోను, బ్రాంచీల్లోనూ అన్ని కార్యకలాపాలకు ఆటంకం తప్పదని ఇదివరకే వినియోగదారులకు ఫోరం హెచ్చరించిందని ఆయన గుర్తు చేశారు. నిర్దేశిత సమయం కంటే ముందుగానే ఎటిఎంల్లో నగదు ఖాళీ అయ్యే అవకాశముందని తెలిపారు.

బెంగాల్‌లో : బ్యాంకింగ్ రంగం ప్రయివేటీకరణ, తదితర సంస్కరణలకు వ్యతిరేకంగా పెద్ద సంఖ్యలో బ్యాంకు ఉద్యోగులు సమ్మెలో పాల్గొన్నారని యుఎఫ్‌బియు పశ్చిమ బెంగాల్ కన్వీనర్ సిద్ధార్థ ఖాన్ చెప్పారు. మొండి బకాయిలు రూ.6.83 లక్ష కోట్లకు చేరడం ఆందోళనకర అంశమని, ప్రభుత్వ రంగ బ్యాంకుల పటిష్టత కోసం రక్షణాత్మక చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు.

మహారాష్ట్రలో : మరోవైపు మహారాష్ట్రలో లక్షా 50 వేల మంది ఉద్యోగులు సమ్మెలో పాల్గొన్నారు. ఐడిబిఐ సహా పలు బ్యాంకులకు చెందిన 42 వేల శాఖల్లో పూర్తిగా సేవలు నిలిచిపోయాయి. 18 ప్రభుత్వ రంగ బ్యాంకులు, 8 విదేశీ బ్యాంకులు, 56 ప్రాంతీయ, గ్రామీణ బ్యాంకుల్లో కూడా లావాదేవీలు పూర్తిగా స్తంభించినట్లు ఎఐబిఇఎ నాయకుడు విశ్వాస్ ఉతగి పేర్కొన్నారు.

టీజర్‌లో చెప్పింది ఇదే



ఓ కోట శిఖరంపై కాలిపోతున్న ఆంగ్లేయుల జాతీయ జెండా.. దాని చుట్టూ బ్రిటిషు సైనికుల శవాలు.. కోట బయట ఉయ్యాలవాడ నరసింహారెడ్డి.. ఈ దృశ్యాలతో ప్రచార చిత్రం చాలా ఆసక్తికరంగా ఉంది. కానీ చిరంజీవిని వెనుక నుంచి చూపించారు. ఆయన ముఖం కనపడలేదు. 'సై.. సైరా నరసింహారెడ్డి' అనే నినాదాలు బ్యాక్‌గ్రౌండ్‌లో వినిపించాయి.

సై..'సైరా... నరసింహారెడ్డి'



పరుచూరి బ్రదర్స్, వరుణ్ తేజ్, సరేందర్ రెడ్డి, అల్లు అరవింద్, రాజమౌళి, రామ్ చరణ్, సాయి ధరమ్ తేజ్

చిరంజీవి తన తదుపరి చిత్రంగా ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జీవిత కథను ఎంపిక చేసుకున్న విషయం తెలిసింది. దీనికి 'సైరా నరసింహారెడ్డి'ని టైటిల్‌గా ఖరారు చేస్తూ చిత్రబృందం చిరంజీవి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం ప్రకటించింది. ఈ చిత్రం మోషన్ పోస్టర్‌ను దర్శకుడు రాజమౌళి విడుదల చేశారు. టైటిల్ లోగోను అల్లు అరవింద్, నటీనటులు, సాంకేతిక నిపుణులకు సంబంధించిన పోస్టర్స్‌ను వరుణ్ తేజ్, సీనియర్ రచయితలు పరుచూరి బ్రదర్స్ ఆవిష్కరించారు. ఈ చిత్రాన్ని కొణిదెల ప్రొడక్షన్స్ కంపెనీపై రామ్ చరణ్ నిర్మిస్తున్నారు.

రాజమౌళి మాట్లాడుతూ 'మోషన్ పోస్టర్ ఫెంటాస్టిక్‌గా ఉంది. బ్యాక్ గ్రౌండ్‌లో వస్తోన్న ఆ మ్యూజిక్... ఆ కలర్స్, మెగాస్టార్ ముఖం చూపించకుండా వెనుక నుంచి డిజైన్ చేసిన ఆ లుక్ అదిరిపోయింది. అమితా బచ్చన్, విజయ్ సేతుపతి, సుదీప్, జగపతి బాబు వంటి స్టార్ క్యాస్టింగ్ సూపర్బ్‌గా ఉంది. 'బాహుబలి' సక్సెస్ అయిదంటే టెక్నీషియన్లే కారణం. ఈ సినిమాకు కూడా స్టార్ టెక్నీషియన్స్ పని చేస్తున్నారు. రెహమాన్ మ్యూజిక్, పరుచూరి కలం బలంకు తిరుగులేదు. ఇక దర్శకుడు సురేందర్ రెడ్డి 24 శాఖలపై మంచి పట్టున్న టెక్నీషియన్. ఇవన్నీ చూస్తుంటే చిరంజీవి 151వ సినిమాలా కాకుండా ఆయన మొదటి సినిమాలా ఉంది. ఈ సినిమా మోషన్ పోస్టర్ నా చేతుల మీదుగా లాంచ్ చేయడం అదృష్టంగానూ, గౌరవంగాను భావిస్తున్నాను. కొణిదెల ప్రొడక్షన్స్ మరో పెద్ద సక్సెస్ షురూ చేయడం ఖాయం' అని అన్నారు.

నాన్న గారికి దీనికి మించిన బర్త్ డే గిఫ్ట్ మరొకటి లేదు

రామ్ చరణ్ మాట్లాడుతూ 'మిమ్మల్నీ అందర్నీ చూస్తుంటే నాకు ఓ సందేహం వస్తుంది. మీరంతా మా అభిమానులా? లేక మేము మీ అభిమానులమా? అని. గత నెలల రోజులుగా నాన్నగారి పుట్టిన రోజు సందర్భంగా అమెరికాలోని 51 సెంటర్లలో 2000 మంది , ఏపీ, తెలంగాణ, ఇతర దేశాల్లో మొత్తం కలిపి 42000 మంది బ్లడ్ డొనేట్ చేశారంటే నిజంగా మీ అందరికీ హ్యాట్సాఫ్. మీరు మెగా అభిమానులు కాదు. మెగా బ్లడ్ బ్రదర్స్ అని నాన్నగారు ఎందుకన్నారో ఇప్పుడు తెలుస్తుంది. నాన్నగారికి దీనికి మించిన బర్త్ డే గిఫ్ట్ మరొకటి లేదు.

చిరంజీవి వేసిన రోడ్డుపైనే...

అల్లు అరవింద్ మాట్లాడుతూ 'చిరంజీవి సినీ పరిశ్రమకు వచ్చి 40 ఏళ్లు పూర్తయింది. అందులో నాది ఆయనతో 37 ఏళ్ల జర్నీ. అందులో నాకు ఎంత తృప్తి ఉంటుందో మీరు ఊహించుకోగలరు. ఆయన కష్టంతో ఓ తారు రోడ్డు వేశారు. అందువల్లే పవన్ కల్యాణ్ దగ్గర నుంచి రామ్ చరణ్, బన్నీ, వరుణ్, తేజ్, శిరీష్ అంతా ఆ రోడ్డులోనే నడుస్తున్నారు. మెగా ఫ్యామిలీ హీరోలకు అద్భుతమైన ఓపెనింగ్స్ వస్తున్నాయి. అదంతా మీ అభిమానుల వల్లే సాధ్యమైంది' అని తెలిపారు.

భగత్‌సింగ్ పాత్రలో చేయాలని అనుకున్నా

ప్రత్యేక వీడియో ద్వారా మెగాస్టార్ చిరంజీవి మాట్లాడుతూ 'ప్రత్యక్షంగా కాకపోయినా పరోక్షంగా అభిమానులను కలుసుకోవడం చాలా సంతోషంగా ఉంది. తక్కిన పుట్టిన రోజులు కంటే ఈరోజు నాకు చాలా ప్రత్యేకం. దానికి కారణం నా వృత్తి సినిమా...నా ప్రవృత్తి సినిమా. ఈ రెండు అనుభూతులను ఈరోజు ఇక్కడ ఆవిష్కరించడం చాలా సంతోషంగా ఉంది. అభిమానులు గర్వపడేలా సినిమాలు చేయగలను. పది కాలల పాటు చెప్పుకునే పాత్రలు చేయగలను. అందుకే 151వ సినిమాగా స్వాతంత్ర్య సమర యోధుడు ఉయ్యాల వాడ నరసింహారెడ్డి కథను తీసుకున్నాం. ఫ్రీడమ్ ఫైటర్ పాత్ర చేయాలని ఎప్పటి నుంచో ఉంది. అందులో భగత్ సింగ్ పాత్రలో నటించాలని చాలా సార్లు అనుకున్నాను. ఇన్నాళ్లకు ఉయ్యాల వాడ రూపంలో నా ఆశలకు..మీ ఆకాంక్షలకు ప్రతి రూపంగా నిలిచే పాత్ర దొరికింది' అని అన్నారు.

మహేష్ లాంటి హీరోను ఇంత వరకూ చూడలేదు

- దర్శకుడు ఎ.ఆర్.మురుగదాస్



"మీరు ఫైనల్ అవుట్‌పుట్ చూడండి. మరో ఐదారు సీన్స్ యాడ్ చేయాలంటే చేయండి. నేను చేయడానికి సిద్ధంగా ఉన్నాను. మీరు అయిపోందని చెబితేనే నా నెక్స్ట్ మూవీకి వెళతాను అని అన్నారు మహేష్. నేను చాలా ఎగ్జయిట్ అయ్యాను. స్పైడర్ సినిమాలో మహేష్‌ని తప్ప మరే హీరోను ఊహించుకోలేనంతగా ఇమిడిపోయాను. సినిమాను రెండు భాషల్లో సమాంతరంగా షూట్ చేశాం. ఎన్ని టేక్స్ అయినా చాలా కూల్‌గా ఉండి పూర్తి సహకారాన్ని అందించారు" అని మురుగదాస్ అన్నారు. మహేష్ హీరోగా మురుగదాస్ దర్శకత్వంలో రూపొందుతోన్న సినిమా 'స్పైడర్'. సెప్టెంబర్ 27న దసరా కానుకగా తెలుగు, తమిళ్, మలయాళం, అరబిక్‌లో విడుదల కానుంది. ఈ సందర్భంగా దర్శకుడు మంగళవారం మీడియాతో మాట్లాడారు.

'స్పైడర్' సినిమా ఎలా వచ్చింది?

సినిమా ఎక్స్‌ట్రార్డినరీగా వచ్చింది. హ్యాపీగా ఉన్నాం. స్టాలిన్ తర్వాత పదేళ్లకు నేను చేస్తున్న స్ట్రయిట్ తెలుగు మూవీ. స్టాలిన్ సినిమా చేస్తున్నప్పుడు పక్కనే పోకిరి సినిమా సాంగ్ షూట్ జరుగుతోంది. అప్పుడు పరుచూరి వెంకటేశ్వరరావు మహేష్‌ను పరిచయం చేశారు. తర్వాత కొన్ని రోజులకు మహేష్‌ను కలిసినప్పుడు నేను మీతో సినిమా చేయాలనుకుంటున్నానండి..అని అన్నాను. తను కూడా పాజిటివ్‌గానే రియాక్ట్ అయ్యారు. అయితే తర్వాత నేను గజినీతో హిందీ సినిమాల్లోకి ఎంట్రీ ఇచ్చాను. బిజీ అయ్యాను. తెలుగు, తమిళంలో ఓ సినిమా చేయాలనుకోగానే ఈ కథను అనుకున్నాం. కథలో హీరోయిజం ఉండాలి. ఫ్యామిలీ ఆడియెన్స్, ఫ్యాన్స్, రెగ్యులర్ ఆడియెన్స్‌కు సినిమా నచ్చేలా ఉండాలి. అలాగే తమిళంలో కూడా మహేష్ చేస్తున్న స్ట్రయిట్ మూవీ కాబట్టి బేలెన్సింగ్ కూడా కరెక్ట్‌గా ఉండాలి. కాబట్టి స్క్రిప్ట్ మోడ్రన్‌గా ఉండాలని నిర్ణయించుకున్నాం. తెలుగు, తమిళంలో డబ్బింగ్ కార్యక్రమాలు పూర్తయ్యాయి. ఒక సాంగ్ మినహా సినిమా పూర్తయింది. పదేళ్ల వెయిట్ చేసినందుకు తగ్గ సినిమా చేసినట్లు అనిపించింది. డెఫనెట్‌గా తెలుగు, తమిళ ఆడియెన్స్‌ను అలరిస్తుందని చెప్పగలను.

మహేష్‌తో వర్క్ చేయడం గురించి?

నేను చాలా మంది సూపర్‌స్టార్స్‌తో పనిచేశాను. మహేష్ వర్కింగ్ స్టైల్‌ను మరొకరితో కంపేర్ చేయలేను. అందరు దర్శకులు మహేష్‌తో ఒక్క సినిమా అయినా చేయాలని నేను కోరుకుంటున్నాను. ఏడాదిగా మహేష్‌తో ట్రావెల్ చేస్తున్నాను. తన లాంటి హీరోను ఇంత వరకూ చూడలేదు. తను దర్శకుల హీరో. స్పైడర్ సినిమాను 80 రోజులు పాటు రాత్రి షూట్ చేశాం. తను ఎంతో కో ఆపరేటివ్‌గా ఉండేవారు. స్క్రిప్ట్ విన్న తర్వాత తనెక్కడా ఇన్‌వాల్వ్ కాలేదు. చాలా ఎఫర్ట్ పెట్టి సినిమాలో నటించారు. ఇండియాలో మరే సూపర్‌స్టార్ ఇంతలా కష్టపడటం నేను చూడలేదు.

జేమ్స్‌బాండ్ తరహా సినిమాలా 'స్పైడర్' ఉంటుందనుకోవచ్చా?

జేమ్స్‌బాండ్ తరహాలో పూర్తిస్థాయి ఫ్యూచెరిస్టిక్ మూవీ కాదు. స్పై మూవీ. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల దృష్ట్యా ఇంటెలిజెన్స్ వ్యవస్థ మన దేశంలో ఎలా పనిచేస్తుంది. వారు దేశంలో మన కోసం ఏం చేస్తున్నారు అనేవి సినిమాలో చూపిస్తున్నాం. సినిమాలో ఎమోషన్స్ ఉంటాయి. సాధారణంగా నా సినిమాల్లో డైరెక్ట్ మెసేజ్ లేక ఇన్‌డైరెక్ట్ మెసేజ్‌లుంటాయి. స్పైడర్‌లో కూడా హ్యూమానిటీకి సంబంధించిన మెసేజ్‌తో ఉంటుంది. మనిషిలో హ్యూమానిటీ తగ్గిపోయినప్పుడు సొసైటీలో లంచం పెరిగిపోతుంది లేదా మరేదైనా వైపరీత్యం సంభవిస్తుంది. ఈ మెసేజ్‌ను నేను ఇన్‌డైరెక్ట్‌గా ఈ సినిమాలో చూపిస్తున్నాను.

తెలుగు, తమిళ్ క్లైమాక్స్‌ల్లో మార్పు ఉంటుందని వార్తలు వస్తున్నాయి కదా?

అలాంటిదేం లేదండి.. రెండు భాషల్లోనూ క్లైమాక్స్ ఒకేలా ఉంటుంది. సినిమాని పూర్తిగా రెండు భాషల్లో వేర్వేరుగా షూట్ చేశాం. ఆఖరికి సైలెంట్ సీన్స్‌ని కూడా సెపరేట్‌గానే చిత్రీకరించాం.

హీరోయిన్‌గా ముందు పరిణితి చోప్రాను అనుకున్నారు కదా?

అనుకున్నమాట నిజమే. అయితే సినిమాను రెండు భాషల్లో ఏకకాలంలో తీయాలనుకున్నప్పుడు రెండు భాషలు తెలిసిన హీరోయిన్ కావాలనిపించింది. పరిణితి చోప్రా ముంబై అమ్మాయి. తెలుగు, తమిళం రెండు భాషలు రావు. రెండు భాషల్లో భాష రాని అమ్మాయిని హీరోయిన్‌గా మెనేజ్ చేయడం కష్టం. అలాంటప్పుడు రకుల్ ప్రీత్ సింగ్ అయితే రెండు భాషలను అర్థం చేసుకుంటుందని చెప్పడంతో మేం రకుల్‌ని హీరోయిన్‌గా తీసుకున్నాం.

స్పైడర్ మూవీలో ఎలాంటి మెసేజ్ ఉంటుంది?

మెసేజ్ కంటే ముందు సినిమాలో మనం చెప్పే విషయాలు ఆడియెన్స్‌ను పాడు చేయకూడదు. మంచి మెసేజ్ ఇవ్వకపోయినా, తప్పుడు మెసేజ్ మాత్రం ఇవ్వకూడదు. ఉదాహరణకు మహేష్‌లాంటి ఫాలోయింగ్ ఉన్న హీరో సినిమాలో సిగరెట్ తాగుతూ కనపడితే ఆయన వీరాభిమాని గుడ్డిగా ఆయన్ను ఫాలో కావడానికి ప్రయత్నిస్తాడు. అలాంటి సన్నివేశాలు ఈ సినిమాలో కనపడవు. సినిమాలు ప్రజలపై ప్రభావం చూపుతాయి. సినిమాలనే కాదు, మీడియా తప్పకుండా ప్రభావం చూపుతుంది. సినిమా ఇంపాక్ట్ చూపాలి. ఆ ప్రభావం బాధ్యతతో కూడుకున్నదై ఉండాలి.

మీ తదుపరి చిత్రాలు?

తదుపరిగా నేను తమిళంలో ఓ సినిమా చేయబోతున్నాను. చర్చలు నడుస్తున్నాయి. ఇకపై నేను బాలీవుడ్‌లో చేసినా స్ట్రయిట్ మూవీనే చేయాలనుకుంటున్నాను. సల్మాన్‌ఖాన్‌గారిని కలిసి బేసిక్ ఐడియా, క్యారెక్టర్, ఇంటర్వెల్ బ్లాగ్ అన్ని చెప్పాను. ఆయనకి కూడా నచ్చింది. రజనీకాంత్‌గారికి కూడా ఓ కథ చెప్పాను. ఆయనకు కూడా నచ్చింది. అయితే ఆయన 2.0, కాలా చిత్రాలతో బిజీగా ఉన్నారు. ఈ రెండు చిత్రాలు పూర్తి కాగానే నా సినిమా ఉంటుంది. డేట్స్ అన్ని కుదిరితే సినిమా సెట్స్‌లోకి వెళ్లిపోతుంది.



సంజయ్ నోట గణేష్ హారతి...

ఎక్కడ చూసినా వినాయకుడి చలువ పందిళ్ల నిర్మాణానికి ఏర్పాట్లు కనిపిస్తున్నాయి. మరో రోజు ఆగితే గణపతి బప్పా మోరియా... అంటూ సందడి మొదలు కానుంది. ఈ నేపథ్యంలో బాలీవుడ్ నటుడు సంజయ్ దత్ ఆ అవకాశాన్ని వినియోగించుకున్నారు. ఆయనకు పాటలు పాడడం అంటే ఎంతో ఇష్టం. గతంలోనే దుర్గమ్మకు సంబంధించిన భక్తిగీతాన్ని పాడారు. ఇప్పుడు వినాయక చవితిని పురస్కరించుకుని గణపతి కోసం గణేష్ హారతి..గీతాన్ని ఆలాపించారు. ఇదంతా దేని కోసం అంటే...ఆయన హీరోగా చేస్తున్న 'భూమి' చిత్రం ప్రచారం కోసం. తండ్రీ కొడుకుల అనుబంధంపై తెరకెక్కుతోన్న ఈ సినిమా వినాయక చవితి తర్వాత ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ తరుణంలో ప్రచారానికి ఉపయోగపడుతుందని గణేష్ హారతికి చెందిన గీతాన్ని ఆలాపించి అభిమానులకు చేరవయ్యే ప్రయత్నం చేశారు సంజయ్. ఈ పాట సినిమా భాగం మాత్రం కాదు. ఈ చిత్రం కైరా అద్వానీ కథానాయిక. సెప్టెంబర్ 22న ప్రేక్షకుల ముందుకు రానుంది.

లాగే..మనస్సు లాగే

ప్రజాశక్తి - మండపేట (తూర్పుగోదావరి)

తూర్పుగోదావరి జిల్లా మండపేట మండలం ఏడిద బైపాస్‌రోడ్‌లో వల్లూరు మెహెర్ చైతన్యకు చెందిన గాయత్రీ ఎడిబుల్ ఆయిల్ కంపెనీ వద్ద మంగళవారం సినీ సందడి నెలకొంది. సాగర్ దర్శక పర్యవేక్షణలో ఫర్‌ట్యూన్ మూవీస్ వారి ఆధ్వర్యాన 'లాగే..మనస్సు లాగే..' సినిమా చిత్రీకరించారు. హీరో హీరోయిన్లుగా నితీష్, ఆనంద్ ప్రేమ్ రేఖ, గుర్లిన్ చోప్రా నటిస్తున్నారు. దీనా శ్రీను దర్శకత్వం. బి.సతీష్‌రెడ్డి నిర్మాత. 'ఇది కొత్త ప్రేమ కథా చిత్రం. పేద, ధనిక వర్గాల మధ్య ప్రేమ ఏర్పడితే ఆ యువత ఎదుర్కొనే ఇబ్బందులను ఈ చిత్రం ద్వారా తెరకెక్కిస్తున్నాం. తొలి షెడ్యూల్‌లో భాగంగా అమలాపురం, రాజవోలు, సఖినేటిపల్లి పరిసర ప్రాంతాల్లో షూట్ చేస్తాం. మూడు రోజుల పాటు మండపేట పరిసర ప్రాంతాల్లో పాటలు, కొన్ని సన్నివేశాలు చిత్రీకరిస్తాం' అని దర్శకుడు చెప్పారు. ఈ చిత్రానికి కెమెరామెన్ : యోగి, నృత్యం : దిలీప్, సంగీతం : జైలు .



ఆనంద్ ప్రేమ్‌రేఖ



జాక్విలిన్ పెర్నాండేజ్

మంచి నటుడిగా పేరు తెచ్చుకోవాలి



చంద్రకాంత్

'చంద్రకాంత్, రాధికా మెహరోత్రా'లను హీరోహీరోయిన్లు పరియమవుతూ రూపొందుతోన్న సినిమా "ప్రేమ ఎంత మధురం-ప్రియురాలు అంత కఠినం'. థర్డ్ ఐ క్రియేషన్స్ పతాకంపై రఘురాం రొయ్యూరుతో కలిసి గోవర్ధన్. జి. స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్న రొమాంటిక్ థ్రిల్లర్ ఇది. ఈ చిత్రం షూటింగ్ అధికభాగం అమెరికాలో జరిగింది. ఈ చిత్రం హీరో చంద్రకాంత్ మంగళవారం విలేకరులతో ముచ్చటించారు.

"చక్కటి రొమాంటిక్ థ్రిల్లర్‌తో హీరోగా పరిచయం కావడం అదృష్టంగా భావిస్తున్నాను. ఒక మంచి టీమ్ ఎఫర్ట్‌తో ఈ చిత్రం రూపొందింది. దర్శకుడు గోవర్ధన్ ఈ చిత్రం కోసం ప్రాణం పెట్టి జీవం పోశారు. ఈ చిత్రం తనకు మంచి బ్రేక్ ఇస్తుంది" అని అన్నారు. తాను పుట్టింది, పెరిగింది హైద్రాబాద్‌లోనేనని చెప్పారు. ఇంజినీరింగ్ పూర్తి చేసి నటనను కెరీర్‌గా తీసుకోవాలని డిసైడ్ అయ్యాక అమెరికాలో ట్రైనింగ్ తీసుకుంటున్నానని తెలిపారు. ఈ చిత్రంలో హీరోయిన్లుగా పరిచయమవుతున్న రాధిక, పల్లవి చాలా బాగా పెరఫామ్ చేశారని, వాళ్ళకి కూడా మంచి పేరు వస్తుందని పేర్కొన్నారు. తొలిచిత్రంలోనే తనికెళ్ళ భరణి, తులసి, జెమినీ సురేష్ వంటి సీనియర్స్‌తో నటించడం తనకు ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని చంద్రకాంత్ పేర్కొన్నారు. నటుడిగా మంచి పేరు తెచ్చుకోవాలన్నదే తన ఆశయమని తెలిపారు.



అనుకున్న తేదీకే


రజనీకాంత్, దర్శకుడు శంకర్ కలయికలో తెరకెక్కుతోన్న సినిమా ' 2.0'. తమిళం, తెలుగు, హిందీ భాషల్లో రూపొందుతోంది. లైకా సంస్థ సుమారు రూ.400 కోట్లతో నిర్మిస్తోంది. ఇందులో ఎమీ జాక్సన్ హీరోయిన్. బాలీవుడ్ హీరో అక్షయ్ కుమార్ ప్రతి నాయకుడిగానూ నటిస్తున్నారు. ఈ చిత్రం షూటింగ్ దాదాపు పూర్తయింది. ఈ సినిమాను దీపావళికి తెరపైకి తీసుకురానున్నట్లు చిత్ర వర్గాలు ప్రకటించినా, ఆ తరువాత నిర్మాణాంతర కార్యక్రమాల్లో ఆలస్యం కారణంగా జనవరి 25న విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. ఈ విషయం తెలిసిందే. ఇప్పుడు వీఎఫ్ఎక్స్ పనులు పూర్తి కాక సినిమా విడుదలను వాయిదా వేస్తారని ప్రచారం జరిగింది. అది సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. దీనిపై చిత్రబృందం స్పష్టత ఇచ్చింది. ఈ చిత్ర గ్రాఫిక్స్ వర్క్ ముమ్మరంగా జరుగున్నాయని, ఇంకా ఒక పాటను చిత్రీకరించాల్సి ఉందని తెలిపింది. 12 రోజుల పాటు రజనీకాంత్, ఎమీ జాక్సన్‌లపై చిత్రీకరించనున్న ఈ పాట కోసం చెన్నైలో బ్రహ్మాండమైన సెట్ సిద్ధం అవుతోందని పేర్కొంది. చిత్ర ఈ చిత్ర గ్రాఫిక్స్ వర్క్ నాలుగు దేశాల్లో శరవేగంగా జరుగుతోందని లైకా సంస్థ నిర్వాహకుడు రాజుమురుగన్ స్పం తెలిపారు. చిత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ అనుకున్నట్లుగా జనవరి 25వ తేదీన ప్రపంచ వ్యాప్తంగా విడుదలవుతుందని మరోసారి స్పష్టం చేశారు.

నాపై కరిష్మా పాత్ర ఒత్తిడి

సల్మాన్ ఖాన్, కరిష్మా కపూర్, రంభ కలసి నటించిన 1997 నాటి చిత్రం 'జుద్వా'. ఈ సినిమాకు సీక్వెల్‌గా 'జుద్వా2' దర్శకుడు ధావన్ రూపొందిస్తున్నారు. వరుణ్ ధావన్, జాక్విలిన్ ఫెర్నాండేజ్, తాప్సీ పన్ను నటిస్తున్నారు. ఈ సినిమా ట్రైలర్ ఆవిష్కరణ కార్యక్రమంలో జాక్విలిన్ మాట్లాడుతూ "ఈ సినిమాలో భాగమైన మాకందరికీ అందరి దీవెనలు ఉంటాయి. వరుణ్ ధావన్ డ్యూయెల్ రోల్ చేస్తున్న ఈ సినిమాలో ధానవ్(రోహిత్ పాత్ర)కు జోడీగా చేస్తున్నాను. అయితే 'జుద్వా'లో కరిష్మా కపూర్ చేసిన పాత్ర నాపై ఎక్కువ ప్రభావం చూపుతోంది. దాని వల్ల తీవ్రంగా ఒత్తిడికి గురవుతున్నాను" అని చెప్పింది. ఎప్పుడూ వ్యక్తిగత విషయాలు గురించి బయట చెప్పని జాక్విలిన్ మొదటి సారిగా వెల్లడించింది. 'నేను నా భర్తను అనుసరించే సాంప్రదాయాలను పట్టించుకోను. అతను చాలా బాలెన్స్‌డ్‌గా ఉంటారు. నాగరికత, సంప్రదాయలు గురించి పూర్తిగా ఆయనకు అవగాహన ఉంది" అని చెప్పింది. తన గురించి చెబుతూ "కమిట్‌మెంట్స్ అనేవి పెద్ద సమస్య కాదు. నేను ఎప్పుడూ రిస్క్ టేకర్‌గా ఉండడానికి ఇష్టపడతాను. నేను బాలీవుడ్‌లో ప్రవేశించేటప్పుడు కనీసం నా అన్న వాళ్లు ఎవరూ లేరు. ఆ భాష కూడా సరిగా రాదు. కానీ నన్ను నేనుగా అర్థం చేసుకునేవారు ఎవరా? అని ఆలోచించి వారితో పనిచేయడం మొదలు పెట్టాను' అన్నది. జాక్విలిన్ ప్రస్తుతం 'జుద్వా2' తో పాటు 'ఏ జెంటిల్‌మన్' చిత్రం కూడా చేస్తోంది. ఈ రెండు సినిమాలు ఒకదాని తర్వాత మరొకటి ప్రేక్షకుల ముందుకు రానున్నాయి.



అందమైన డిజైన్లు వేసిన గోడలు ఇంటి వాతావరణాన్నే మార్చేస్తాయి. సృజనాత్మక ఆలోచనలుండాలేగానీ తక్కువ వ్యయంతో మీ ఇంటిని ఎంతో వైవిధ్యంగా అలంకరించవచ్చు. ఇల్లు పెద్దదిగా కట్టుకుంటే గోడలు కూడా విశాలంగా ఉంటాయి. ఈ గోడల మీద అలంకరణలు లేకపోతే చూడటానికి బోసిపోయినట్లు కనిపిస్తాయి. గోడలు ఖాళీగా కనిపించకుండా ఉండటానికి ఫొటోలు, పెయింటింగ్స్‌తో అందంగా అలంకరించవచ్చు. అయితే ఈ అలంకరణ గోడలకు అందాన్ని చేకుర్చాలి. చేతికి వాచ్ లేకపోతే ఎంత వెలితిగా ఉంటుందో గోడలకు వాల్‌క్లాక్ లేకపోతే అంతే బోసిగా ఉంటుంది. అయితే గోడలకు అమర్చే వాల్‌క్లాక్ సమయాన్ని మాత్రమే చూపిస్తే సరిపోదు. అది ఇంటీరియర్ డిజైనింగ్‌లో కూడా భాగమవ్వాలి. ఇందుకోసం వాల్‌క్లాక్ సెలెక్షన్‌లో కొన్ని చిట్కాలు ఈ వారం 'నివాసం'లో తెలుసుకుందాం!!



వావ్ అనిపించే వాల్ క్లాక్స్

సాధారణంగా గోడలకు కేలండర్లు వేలాడదీస్తుంటారు. తేదీలు తెలుసుకోవడానికి ఒక కేలండర్ సరిపోతుంది. అలాగే సమయం తెలుసుకోవడానికి ఒక గడియారం అమర్చుకోవచ్చు. గోడ అంతా అందంగా కనిపించాలంటే మంచి పెయింటింగ్స్, ఫొటోలు అమర్చవచ్చు. మరి వాల్ క్లాక్స్ అలాకాదు. ఏ గదికి ఎలాంటి వాల్ క్లాక్ సెట్ అవుతుందో చూసి అమర్చుకోవాలి.

డెకరేటివ్ క్లాక్

ఇంటికొచ్చిన అతిథుల చూపులను కట్టిపడేయాలనుకుంటే వాకిలికి ఎదురుగా లేదా లివింగ్ రూమ్‌లో పెద్ద రస్టిక్ క్లాక్‌ను ఏర్పాటు చేయాలి. ఆకారంలో పెద్దదిగా ఉండి అంకెలు కూడా స్పష్టంగా కనిపించేలా ఉండాలి. ఫ్లోటింగ్ నంబర్స్, మోనోక్రొమాటిక్ కలర్ స్కీమ్ కలిగి ఉండే క్లాక్‌లు లివింగ్ రూమ్‌లో చక్కగా ఇమిడిపోతాయి. అయితే ఇలాంటి డెకరేటివ్ క్లాక్ గదిలోని ఫర్నిచర్‌ను డామినేట్ చేసేలా ఉండకుండా చూసుకోవాలి. గదిలోని మిగతా వస్తువులతో మ్యాచ్ అయ్యేలా ఉండాలి. ఇతర ఆర్ట్ పీస్‌లు, ఫొటోగ్రాఫ్‌లు ఏవీ లేకుండా ఖాళీగా ఉండే గోడ మీద ఓవర్‌సైజ్ రెట్రోక్లాక్‌ను అమరిస్తే లివింగ్‌రూమ్ మరింత ఎట్రాక్టివ్‌గా కనిపిస్తుంది.





డిజిటల్ క్లాక్స్

సమయాన్ని తేలికగా తెలుసుకునేందుకు డిజిటల్ క్లాక్స్ చక్కగా ఉపయోగపడతాయి. స్కూల్‌కి వెళ్లే పిల్లలు, ఉద్యోగస్తులు ఉండే ఇంట్లో ఇలాంటి డిజిటల్ క్లాక్ ఉండటం ఎంతో అవసరం. అయితే వీటిలోనే రేడియో అలారం కూడా ఉంటుంది ఇలాంటిది ఇంట్లో ఉంటే ఉదయాన్నే నిద్ర లేవటానికి ఉపయోగంగా పడుతుంది. అలాగే ఎమ్‌పీ3 కలిగుండే డిజిటల్ అలారం క్లాక్‌ను కొంటే చక్కటి పాటలతో అలారంక్లాక్ నిద్ర లేపుతుంది. పొద్దున్నే చీకట్లో నిద్ర లేచేవారికి బ్రైట్ డిస్‌ప్లే కలిగి ఉండే డిజిటల్ అలారం క్లాక్స్ ఎంతో ఉపయోగకరం.

పెండ్యూలమ్ వాల్‌క్లాక్స్

పెద్ద గడియారం..! దాని అడుగు నుంచి వేలాడుతూ రెండువైపులకూ ఊగుతూ ఉండే పెండ్యులమ్. ఇలాంటి పాతకాలంనాటి గడియారాలే లేటెస్ట్ ఫ్యాషన్‌గా మారాయి. నిశ్శబ్దంగా పనిచేస్తూపోయే గోడ గడియారాలకంటే కదలికలతో చూపరులను ఆకర్షించే పెండ్యులమ్ వాల్‌క్లాక్స్ లివింగ్ రూమ్‌కు ప్రత్యేక ఆకర్షణ తెచ్చిపెడతాయి. అలాగే పెండ్యూలమ్ కదలికలతో వెలువడే టిక్ టక్ శబ్ధం ఈ క్లాక్‌లకు మాత్రమే ఉండే ప్రత్యేక లక్షణం.



అటామిక్ క్లాక్స్

సమయం కచ్చితంగా తెలిసేలా ఉండాలనుకుంటే అటామిక్ క్లాక్స్‌నే ఎంచుకోవాలి. అత్యంత కచ్చితమైన సమయాన్ని తెలిపే అటామిక్‌క్లాక్స్‌ను జీపీఎస్ నావిగేషన్, ఇంటర్‌నెట్ సింక్రనైజేషన్‌కి ఉపయోగిస్తారు. ఇలాంటి మోడర్న్ క్లాక్స్‌ను ఇంట్లో, బయటా ఉపయోగించుకోవచ్చు. అటామిక్ క్లాక్‌లు మిగతా గడియారాల్లా బ్యాటరీ అయిపోగానే నెమ్మదిస్తాయనే భయం లేదు. కాబట్టి వంట గదిలో ఎక్కువ రద్దీగా ఉండే గదుల్లో వీటిని ఏర్పాటు చేసుకుంటే ఇంటిల్లిపాదీ సమయానికి అన్ని పనులూ చేసుకోగలుగుతారు.

టేబుల్ క్లాక్స్



గోడల మీదే కాదు క్లాక్‌లు ఎక్కడున్నా ప్రత్యేకమైన స్టయిల్‌ను సృష్టిస్తాయి. కాబట్టి లివింగ్ రూమ్‌లోని సెంటర్ టేబుల్ మీద, బెడ్‌రూమ్‌లోని సైడ్ టేబుల్ మీద టేబుల్‌క్లాక్‌లకు చోటు కల్పించాలి. గ్లాస్ టేబుల్ మీద గుండ్రటి టేబుల్ క్లాక్‌ను ఉంచితే టేబుల్‌కే కొత్త ఆకర్షణ చేకూరుతుంది. టేబుల్‌క్లాక్స్‌ను టేబుళ్లకే పరిమితం చేయాలనే రూలేం లేదు. వీటిని అల్మారాల్లో కూడా అమర్చవచ్చు. హాల్ వేలో, బాత్‌రూమ్ క్యాబినెట్‌లో కూడా ఏర్పాటు చేసుకోవచ్చు. గదికి పురాతనకాలపు లుక్ తెప్పించాలంటే రోమన్ అంకెలతో, పెండ్యూలమ్ కూడా కలిగి ఉండే ఉడెన్ మ్యాంటిల్‌క్లాక్‌ను ఏర్పాటు చేయాలి.

లైటెడ్ వాల్‌క్లాక్స్

ఈ రకం వాల్‌క్లాక్స్‌లో ఎనలాగ్ లేదా డిజిటల్ రకానికి చెందినవి ఉంటాయి. నియాన్, ఫ్లోరెసెంట్ లేదా ఎల్‌ఈడీ వెలుగును వెదజల్లే ఎలాంటి వాల్‌క్లాక్ అయినా ఉపయోగానికి ఎంతో అనువుగా ఉంటుంది. చీకట్లో వెతుక్కునే శ్రమను తగ్గిస్తుంది. కాబట్టి వెలుగు తక్కువగా ఉండే గదుల్లో ఈ క్లాక్‌లకు స్థానం కల్పించాలి.

సేకరణ : త్రిభువన్ ఆకుల



డైనింగ్ టేబుల్‌ను అందంగా సర్దేద్దాం!

ఇంటికి వచ్చే అతిథుల్ని ఆకర్షించేలా డైనింగ్ టేబుల్‌ని సర్దడం మనచేతుల్లోనే ఉంది. టేస్ట్‌కి తగ్గట్టుగా డైనింగ్ టేబుల్‌ని డిజైన్ చేసుకుంటే వంటిల్లు ఎంతో బాగుంటుంది. ఇల్లు చిన్నదైనా డైనింగ్ టేబుల్‌ని అమర్చుకునే విధానం, దాని శుభ్రత కిచెన్‌ని అందంగా మార్చేస్తుంది. డైనింగ్ టేబుల్ శుభ్రంగా ఉంచడానికి కొన్ని చిట్కాలు..

1. డైనింగ్ టేబుల్ డిజైన్‌కి తగ్గ క్లాత్‌ని సెలెక్ట్ చేసి దానిమీద వేస్తే డైనింగ్‌టేబుల్ అందంగా కన్పిస్తుంది. కాబట్టి మంచి డిజైన్ ఉన్న క్లాత్‌ని ఎంపిక చేసుకోవాలి.

2. డైనింగ్ టేబుల్ పై అన్ని వస్తువులూ తీసేసి సబ్బునీళ్లలో తడిపిన స్పాంజ్‌తో తుడిచి ఆరబెట్టాలి. ఆ తర్వాత పొడి స్పాంజ్‌తో తుడవాలి.

3. ఉదయం టిఫిన్ ఐటెమ్స్ చట్నీ, హాట్‌బాక్స్‌లో ఇడ్లీలు, వేరేవి ఏవైనా ఉంటే వాటిని నీట్‌గా టేబుల్‌పైన సర్దాలి.

4. కుటుంబసభ్యులు తినే టైంలోనే ప్లేట్లు, నీళ్లగ్లాసులు ఉంచాలి. తిన్నవెంటనే ఆ సామాన్లు తోమేందుకు వేసేయాలి. ఎట్టి పరిస్థితులలోనూ తినేసిన కంచాలు, ప్లేట్లను టేబుల్‌పైన ఉంచకూడదు.

5. వంటింట్లో వండిన పదార్థాలు టేబుల్‌పైన పెట్టే ముందు చిన్న స్టీల్‌స్టాండ్‌ను టేబుల్‌పైన ఉంచి, వాటిపైన ఆ పదార్థాల పాత్రల్ని పెట్టాలి. ఇలా చేయడం వల్ల టేబుల్‌పైన ఎలాంటి గీతలు పండేందుకు అవకాశం ఉండదు.

6. వండినపదార్థాలు, తినే పదార్థాలు మినహా ఇతర ఏ వస్తువులూ టేబుల్‌పై పెట్టకూడదు.

7. మామిడిపండ్లు లేదా సీజనల్ పండ్లను టేబుల్ అంతా పరవకుండా, పెద్ద ప్లాస్టిక్ లేదా స్టీలు గిన్నెలో ఉంచాలి.

8. చాలామంది మిగిలిపోయిన పులుసు, చారు వంటివి టేబుల్‌పైన పెట్టి అలాగే ఉంచేస్తారు. సాధ్యమైనంత మేరకు ఏరోజు వండిన పదార్థాల్ని ఆ రోజే ఖాళీ చేసేయాలి. స్వీట్స్ ఎప్పుడూ తినే గంట ముందు మాత్రమే ఫ్రిజ్ నుంచి బయటికి తీయాలి. ఏమైనా మిగిలితే వెంటనే ఫ్రిజ్‌లో ఉంచాలి.

9. తినబోయే పదార్థాలు మినహా మిగిలినవి ఏవీ అంటే బొమ్మలు, పచారీ సామాన్లు వంటివి ఏవీ టేబుల్‌పైన పెట్టకూడదు.

10. అందరి భోజనాలు పూర్తయిన వెంటనే డైనింగ్ టేబుల్‌ని తడిబట్టతో శుభ్రంగా తుడిచేయాలి. అవసరమైతే డెట్టాల్ వేసి తుడిచేయాలి. అలా చేయడం వల్ల బ్యాక్టీరియా టేబుల్‌పైన చేరకుండా ఉంటుంది.

11. సాల్ట్, పెప్పర్ వంటివి చిన్నచిన్న ప్లాస్టిక్ డబ్బాల్లో పోసి టేబుల్‌పైన ఉంచాలి. పెరుగు, నెయ్యి, నూనె వంటివి టేబుల్‌పైన ఉంచకూడదు.

12. ఈ రోజుల్లో డైనింగ్ టేబుల్ మీద మనీప్లాంట్‌గానీ, చిన్నగ్లాస్‌లో నీరు పోసి పెంచే మొక్కల్ని డైనింగ్ టేబుల్ మీద పెట్టుకుంటున్నారు. మీకు అలాంటి టేస్ట్ ఉంటే అందంగా అలంకరించుకోండి. అయితే ఒక్క సంగతి మాత్రం మరువకండి. ప్లాంట్‌లో పోసిన నీటిని రోజు విడిచి రోజు మార్చాలి. ఇలాంటి చిట్కాలు పాటించడం వల్ల డైనింగ్ టేబుల్ ఎంతో అందంగా కన్పిస్తుంది. అంతేకాదు ఆరోగ్యం పదికాలాల పాటు పదిలంగా ఉంటుంది.

- లక్ష్మి తేజశ్విని





పొడుపు కథ

తలపైన పూసే పువ్వు, ఎండా వాన నుంచి కాపాడేపువ్వు , గుండ్రని పువ్వు, వాడిపోని పువ్వు, అది ఏంటి?

జోక్ :

వాసు : నేను కొండమీద కోతినైన కో అని రప్పిస్తాను తెలుసా..!

వెంకి : కోతలు కొయ్యకురా.. ఈ సిటిలో కొండలెక్కడున్నాయి..!

వాసు కోతలు కాదు..! కోతులు

వెంకి : ఆ..!!??






నల్ల వడ్రంగి పిట్ట...


పిల్లలూ.. మీకు నల్ల వడ్రంగి పిట్ట గురించి తెలుసా? ఇవి ప్రమాదకర పక్షుల నుంచి తప్పించుకోవడానికి చెట్లలో తన గూటికి పెద్ద తలుపులు ఏర్పాటు చేసుకుంటాయి. ఇవి ఎక్కువగా యూరప్, స్పెయిన్, నార్వే, స్వీడన్, ఫిన్‌లాండ్, ఈశాన్య చైనా ప్రాంతాలలో కనపడతాయి. ప్రతిరోజూ ఎనిమిది వేల నుంచి 12 వేల సార్లు చెట్ల బెరడును తొలుస్తాయట. వీటి నాలుక పుర్రెకు చుట్టుకుని నోటి నుంచి కొంచెం బయటికి కనపడుతుంది. వీటి ముక్కు నేరుగా, సూదిలాగా, బలంగా, పసుపు రంగులో ఉంటుంది. నెత్తిన ఎరుపు రంగులోను, మిగతా శరీరమంతా నలుపు రంగులోనూ ఉంటాయి. దీని బరువు 12 ఔన్సులు. పొడవు 19 అంగుళాలు. రెక్కలు 27 అంగుళాలు. మార్చి – మే మధ్య కాలంలో గుడ్లు పెడతాయి. చెట్లపై కీటకాలు, పురుగులను తింటాయి. ★





గుర్తించండి!

పిల్లలూ.! పైనున్న ఫోటోలోని కూరగాయలను చిన్నవాటి నుంచి పెద్దవాటిని సైజుల వారీ గుర్తించండి!



జజారియా, సర్దార్‌కు ఖేల్‌రత్న

- 17 మందికి అర్జున, ఏడుగురికి ద్రోణాచార్య
- ముగ్గురికి ధ్యాన్‌చంద్ లైఫ్‌టైమ్ అవార్డులు
- 29న జాతీయ క్రీడోత్సవంలో అవార్డుల ప్రధానం


దేవేంద్ర జజారియా


సర్దార్ సింగ్

న్యూఢిల్లీ: క్రీడల్లో ప్రతిభ చాటిన క్రీడాకారులు, వివిధ వర్గాల కోచ్‌లకు ఖేల్‌రత్న, అర్జున, ద్రోణాచార్య అవార్డులతో పాటు లైఫ్‌టైమ్ ఎచీవ్‌మెంట్ అవార్డుల ఎంపికైన జాబితాను కేంద్ర క్రీడాశాఖ మంగళవారం అధికారికంగా ప్రకటించింది.జావెలిన్ త్రో ఎఫ్-46 విబాగంలో రియో పారా ఒలింపిక్స్‌లో స్వర్ణం సాధించిన పారా అథ్లెట్ దేవేంద్ర జజారియా, భారత సీనియర్ హాకీ జట్టు మాజీ కెప్టెన్ సర్ధార్ సింగ్‌లకు ఖేల్‌రత్నను కేంద్రం ప్రకటించింది. అర్జునకు ఎంపికైన 17 మందిలో భారత క్రికెటర్లు చటేశ్వర్ పూజరా, మహిళా జట్టు వైస్ కెప్టెన్ హర్‌మన్ ప్రీత్ కౌర్‌లతో పాటు, పారా ఒలింపిక్స్ అథ్లెట్లు మరియప్పన్ తంగవేలు, వరుణ్ భాటి, గోల్ఫర్ చౌరాసియా, ఏపి నుంచి ఆర్చరీ వెన్నం జ్యోతి సురేఖలున్నారు. ఖేల్‌రత్న, అర్జున అవార్డుల ఎంపిక కమిటీకి ఛైర్మన్‌గా రిటైర్డు సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి సికె టక్కర్, ద్రోణాచార్య,ధ్యాన్‌చంద్ అవార్డుల కమిటీకి ఛైర్మన్‌గా మాజీ బ్యాడ్మింటన్ ఆటగాడు పుల్లెల గోపీచంద్ వ్యవహరించారు. ఈ కమిటీ ఈ నెల 3వ తేదీన కేంద్రానికి ఇచ్చిన ప్రతిపాదనలు ఆధారంగా వివిధ అవార్డులకు కేంద్రం పచ్చజెండా ఊపింది. పారా కోచ్ సత్యనారాయణపై ఢిల్లీ కోర్టు పరువు నష్టం కేసు పెండింగ్‌లో ఉండటంతో అతన్ని జాబితా నుంచి తొలగించిన విషయం తెల్సిందే. హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ జయంతోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 29న రాష్ట్రపతి భవన్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్రపతి రామనాథ్ కోవింద్ అవార్డులను వీరికి ప్రదానం చేయనున్నారు.రాజీవ్‌గాంధీ ఖేల్‌రత్నకు 7.5లక్షలు, అర్జున, ద్రోణాచార్య అవార్డు గ్రహీతలకు రూ.5లక్షల నగదు, మెమెంటో, సర్టిఫికెట్లను ప్రదానం చేయనున్నారు.

అర్జున అవార్డుకు ఎంపికైన 17 మంది వీరే...

విజె సురేఖ(ఆర్చరీ), కుష్బీర్ కౌర్, ఆరోఖ్య రాజీవ్(అథ్లెటిక్స్), ప్రశాంతి సింగ్(బాస్కెట్‌బాల్), చటేశ్వర్ పూజరా, హర్‌మన్ ప్రీత్‌కౌర్ (క్రికెట్), ఓయినమ్ బెమ్‌బెమ్ దేవి(ఫుట్‌బాల్), ఎస్ఎస్‌పి చౌరాసియా(గోల్ఫ్), ఎస్‌వీ సునీల్(హాకీ), జస్వీర్ సింగ్(కబడ్డీ), పిఎన్ ప్రకాష్(షూటింగ్),ఎ అమల్‌రాజ్(టేబుల్ టెన్నిస్), సాకేత్ మైనేని(టెన్నిస్), సత్యవర్త కడియాన్(రెజ్లింగ్), మరియప్పన్, వరుణ్ భాటి(పారా అథ్లెట్స్).

ద్రోణాచార్య అవార్డులు: డాక్టర్ ఆర్ గాంధీ(అథ్లెటిక్స్) హీరా నంద్ కటారియా(కబడ్డీ),లైఫ్‌టైమ్ ఎచీవ్‌మెంట్ కింద జిఎస్ఎస్‌వి ప్రసాద్(బ్యాడ్మింటన్), బ్రిజ్ భూషణ్ మొహంతి(బాక్సింగ్), పిఎ రాఫెల్(హాకీ), సంజయ్ చక్రవర్తి(షూటింగ్), రోషన్ లాల్(రెజ్లింగ్).


హర్‌మన్ ప్రీత్


పూజారా

ధ్యాన్‌చంద్ లైఫ్‌టైమ్ అవార్డులు:

భూపేందర్ సింగ్ (అథ్లెటిక్స్), సయ్యద్ షాహిత్ హాకీమ్(ఫుట్‌బాల్), సమురై తెతి (హాకీ)లకు ధ్యాన్‌చంద్ లైఫ్‌టైమ్ అవార్డులు వరించాయి.

గోల్ఫ్‌లో ఓటమెరుగని చరిత్ర

పుణె బాలుడు ఆర్యమాన్ సింగ్ ఘనత



పుణె :పదేళ్ల ప్రాయంలోనే గోల్ఫ్‌లో అలుపెరగని విజయాలతో దూసుకెళ్తున్నాడు.ఈ బుడ్డోడు. వీడు మహా ప్లేయర్ అవుతాడని అందరి ముక్కున వేలేసుకునే రీతిలో ఆటతో ముందంజ వేస్తున్నాడు. పుణె నగరానికి చెందిన ఆర్యమాన్ సింగ్ నాలుగో తరగతి చదువుతున్నాడు. ఇండియన్ గోల్ఫ్ యూనియన్ వెస్ట్ జోన్‌లో ఈ ఏడాది వరుసగా ఐదు ఈవెంట్లు గెలిచాడు. జూనియర్స్ విభాగంలో ప్రాంతీయ, జాతీయ స్థాయిల్లో తన రికార్డులను తానే తిరగ రాసుకున్నాడు. ఆర్యమాన్‌కు జోనల్ స్థాయిలో నాలుగేళ్ల నుంచి ఓటమి అన్నదే లేదు. అతడి విజయ పరంపర 1,266 రోజులుగా సాగుతోంది.భారత జూనియర్స్ గోల్ఫ్ చరిత్రలో ఇదే అత్యుత్తమం.. ఇదే అత్యధిక రోజులు కావడం విశేషం. నాలుగేళ్ల కాలంలో వరుసగా కెన్స్‌విల్లే గోల్ఫ్ కోర్స్(అహ్మదాబాద్), పూనా క్లబ్ గోల్ఫ్ కోర్స్, ఆక్స్‌ఫర్డ్ గోల్ఫ్ అండ్ కంట్రీ క్లబ్(పుణె), గైక్వాడ్ బరోడా గోల్ఫ్ కోర్స్(వడోదర), గుల్‌మొహర్ గ్రీన్ గోల్ఫ్ కోర్స్(వడోదర)ల్లో పాల్గొన్న ప్రతీ ఈవెంట్‌లోనే విజేతగా నిలిచాడు.

ప్రి క్వార్టర్స్‌కు సింధు

- రెండో రౌండ్‌కు ప్రణీత్,జయరామ్
- ప్రపంచ ఛాంప్‌లో భారత్‌కు మిశ్రమ ఫలితాలు



గ్లాస్గో(స్కాట్లాండ్): ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో భారత షట్లర్లకు మిశ్రమ ఫలితాలు లభించాయి. తొలి రౌండ్ బై లభించిన ఒలింపిక్స్ రజత పతక విజేత పివి సింధు రెండో రౌండ్‌లో పోరాడి విజయం సాధించి ప్రి క్వార్టర్స్‌లోకి దూసుకెళ్లింది. మంగళవారం నాటి పోరులో నాలుగో సీడ్ పివి సింధు కిమ్ హో మిన్(కొరియా)పై 21-16, 21-14తో వరుస సెట్లతో ఘన విజయాన్ని సాధించింది. సుదీర్ఘంగా ర్యాలీ షాట్లతో సాగిన మ్యాచ్‌లో సింధుకు మరింత ప్రాక్టీసుకు అవకాశం దొరికింది. 49 నిమిషాల్లోనే ప్రత్యర్థిపై విజయం సాధించింది.2013, 2014ల్లో రెండు సార్లు కాంస్యం సాధించిన సింధు ఈ సారి ఎలాగైనా స్వర్ణం సాధించాలన్న పట్టుదలతో బరిలో దిగింది.భారత 13వ సీడ్ అజయ్ జయరామ్ లూకా రాబర్(ఆస్ట్రేలియా)పై 21-14, 21-12తో సునాయాసంగా విజయం సాధించాడు. సింగపూర్ ఓపెన్ ఛాంప్,15వ సీడ్ బి సాయి ప్రణీత్ వుయ్ నాన్ (హాంకాంగ్)పై వరుస సెట్లలో 21-18, 21-17తో జయభేరి మోగించాడు.ప్రణీత్ రెండో రౌండ్‌లో ఆంథోనీ సిన్సుకా(ఇండోనేషియా)తో తలపడనున్నాడు.మిక్స్‌డ్ డబుల్స్‌లో సుమిత్‌రెడ్డి, అశ్విన్ పొన్నప్ప, రంకిరెడ్డి, మానీషలు పోరాడి ఇంటిముఖం పట్టారు.

గుజరాత్ దూకుడు

పుణేరిపై ఘన విజయం

లక్నో: ప్రొ కబడ్డీ(పికెఎల్) ఐదో సీజన్‌లో గుజరాత్ తన జైత్రయాత్రను కొనసాగిస్తోంది. బాబు బనారసి దాస్ ఇండోర్ స్టేడియంలో మంగళవారం జరిగిన తొలి మ్యాచ్‌లో గుజరాత్ ఫార్చ్యూన్‌జెయింట్స్, పుణేరి పల్టన్‌పై 35-21 పాయింట్లతో భారీ విజయాన్ని నమోదు చేసింది. ఈ సీజన్‌లో ఇంత భారీ పాయింట్ల తేడాతో ఏకపక్ష విజయం సాధించడం ఇదే ప్రధమం.తొలి అర్ధ భాగంలోనే జెయింట్స్ ఆటగాళ్లు భారీ పాయింట్లతో కదంతొక్కారు. దీంతో 16-7తో ఆ జట్టు ముందంజ వేసింది. రెండోఅర్ధభాగంలోను పల్టన్ జట్టును కోలుకోనీయకుండా పాయింట్లతో మట్టికరిపించారు. ఏ దశలోను పుణేరి జట్టు గుజరాత్‌ను ప్రతిఘటించలేక చేతులెత్తేసింది. గుజరాత్ జట్టులో ఫాజెల్ అత్యధికంగా 9 రైడ్ పాయింట్లతో దూసుకెళ్లాడు. కెప్టెన్ సుకేష్ హెగ్డే 5, అబ్జోర్ 4 పాయింట్లను సాధించారు.

గర్జించిన బెంగాల్

రెండో మ్యాచ్‌లో యూపి యోధ, బెంగాల్ వారియర్స్ జట్ల మధ్య జరిగింది. అనుహ్యాంగా బెంగాల్ యోధపై 32-31తో విజయం సాధించింది. తొలి అర్ధభాగంలో బెంగాల్ వారియర్స్ 19-14తో ముందంజ వేసింది.చివరి కంటూ అదే దూకుడుతో ముందుకు సాగి చివరి నిమిషంలో 32-31తో యోధను మట్టికరిపించింది.


పుణేరి పల్టన్ గుజరాత్ జట్ల మధ్య మ్యాచ్

నేటి మ్యాచ్‌లు

రాత్రి 8 గంటలకు హర్యానా స్టీలర్స్ × దంబంగ్ ఢిల్లీ

రాత్రి 9 గంటలకు యూపి యోధ × తమిళ్ తలైవాస్

జూనియర్ హాకీ కోచ్‌గా సెబాస్టియన్



న్యూఢిల్లీ: భారత పురుషుల జూనియర్ హాకీ జట్టు కోచ్‌గా మాజీ కెప్టెన్ జుడి ఫెలిక్స్ సెబాస్టెయిన్ మంగళవారం నియమితులయ్యారు. యూరప్ పర్యటనను భారత్ విజయవంతంగా ముగించిన నేపథ్యంలో కోర్ టీమ్ అభివృద్ధిలో ఫెలిక్స్ పాత్ర ఉంది. దీంతో అతన్ని కోచ్‌గా హాకీ ఇండియా నియమించింది. 1995లోనే అర్జున అవార్డును సాధించిన ఫెలెక్స్ నాయకత్వంలో ప్రపంచ ఛాంపియన్ టైటిల్ సాధనకు 36 మంది సభ్యులతో కూడిన జూనియర్ జట్టుకు శిక్షణ ప్రారంభం కానుంది. 2020, 2024 ఒలింపిక్స్‌లో భారత్ రాణింపే ధ్యేయంగా హాకీ ఇండియా నిర్మాణ కార్యక్రమంలో భాగంగానే కోచ్ నియామకం జరిగింది.

పరిమళించిన పల్లె సొగసులు

ఉత్సాహంగా ప్రపంచ జానపద దినోత్సవం

ప్రజాశక్తి - సత్యనారాయణపురం (విజయవాడ)

ప్రపంచ జానపద దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ సృజనాత్మక సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన జానపద ఉత్సవంలో పల్లె సొగసులు పరిమళించాయి. విజయవాడ దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాలలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. ప్రపంచీకరణ నేపథ్యంలో కళాకారులు చేసిన నృత్య ప్రదర్శనలతో పల్లె వాసనలు గుభాళించాయి. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రజా కళాకారుడు కర్నాటి లక్ష్మీనరసయ్య మాట్లాడుతూ.. ప్రజలు సృష్టించిన జానపదాలు తెలుగు వారికి అమూల్యమైన సంపద అన్నారు. తరాలు మారుతున్న సందర్భంగా మార్పును స్వాగతిస్తూనే సంస్కృతిని భవిష్యత్ తరాలకు అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. సృజనాత్మక, సాంస్కృతిక కమిషన్ సిఇఒ డాక్టర్ విజయభాస్కర్ మాట్లాడుతూ.. తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవటం కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు.


విజయవాడలోని బిఆర్‌టిఎస్ రోడ్డులో నృత్య ప్రదర్శన చేస్తున్న కళాకారులు


తప్పెటగుళ్లు ప్రదర్శిస్తున్న కళాకారులు


బిఆర్‌టిఎస్ రోడ్డులో దేవీరూపాలు ప్రదర్శిస్తున్న కళాకారులు


తుమ్మలపల్లి కళాక్షేత్రంలో లంబాడి నృత్య ప్రదర్శన చేస్తున్న కళాకారులు

తొట్లకొండ బీచ్ ప్రైవేటుకే

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మొదట్నించీ ప్రైవేటుకు పెద్దపీట వేస్తున్న రాష్ట్ర పర్యాటక శాఖ మరో ప్రాజెక్టును కూడా ప్రైవేటుకే అప్పగించింది. విశాఖపట్నం జిల్లా తొట్లకొండ బీచ్ నిర్వహణ పనుల్ని ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టింది. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎపిటిడిసి) ఓ ప్రైవేటు సంస్థతో ఇటీవల ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ప్రకారం పర్యాటకులకు పదేళ్ల పాటు వినోద సేవల్ని అందించాల్సి ఉంటుంది. విశాఖపట్నం నుంచి 15 కిలోమీటర్ల దూరంలో భీమిలికి వెళ్లే మార్గంలో తొట్లకొండ బీచ్ ఉంది. 2015-16లోనే రూ.2.80 కోట్ల వ్యయంతో తొట్లకొండ బీచ్ ముందు రెస్టారెంట్, పార్కింగ్ వంటి సౌకర్యాల్ని అభివృద్ధి చేసింది. వాటి నిర్వహణా బాధ్యతల్ని కూడా ఈ ప్రైవేటు సంస్థకే అప్పగించింది. ఈ బీచ్‌ను కూడా విశాఖపట్నంలోని ఆర్‌కె బీచ్ స్థాయిలో అభివృద్ధి చేయాలని పర్యాటక యోచిస్తోంది.

ఒకే చోట చదువుకోని వారికీ స్థానికత ధృవీకరణ పత్రం

స్వీయ హామీ పత్రంతో సర్టిఫికేట్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర విభజన నేపథ్యంలో ఎపిలో స్థానికత్వ ధ్రువీకరణ పత్రాలను అందించే విధానంలో మార్పులు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఒకచోట విద్యాభ్యాసం చేయకుండా, రాష్ట్రంలో స్థానికతకు దరఖాస్తు చేసుకున్న వారికీ ధ్రువీకరణ పత్రాలను ఇవ్వాలని నిర్ణయించారు. వాస్తవంగా నాలుగో తరగతి నుంచి పదో తరగతి వరకు చదువుకున్న వారికి, స్థానికంగా ఎప్పటి నుంచో నివాసం ఉంటున్న వారికి స్థానికత్వ ధ్రువీకరణ అందించాలని ముందుగా నిర్ణయించి, ఆమేరకు అమలు చేస్తున్నారు. అయితే ఆధార్‌తో సరైన అనుసంధానం లేని వారికి ఈ ధ్రువీకరణ పత్రాల జారీలో ఇబ్బందులు ఎదురవుతున్నట్లు గుర్తించారు. ఎప్పటి నుంచో ఒకేచోట నాలుగు నుంచి పదో తరగతి వరకు చదువుకుని, అక్కడే నివాస చిరునామా ఉన్న వారికి సమస్యలు లేవని, వారు ఇతర ప్రాంతాల్లో ఉన్నత విద్యాభ్యాసం చేసుకున్నా ఇబ్బందులు లేవని అధికారులంటున్నారు. అందుకే తాజా సవరణ ఉత్తర్వుల్లో స్థానికులే అయినప్పటికీ, ఒకే చోట నాలుగు నుంచి పదో తరగతి వరకు చదువుకోని వారికీ స్థానికత్వ ధ్రువీకరణ ఇవ్వాలని భూ పరిపాలన ప్రధాన కమిషనర్ చేసిన ప్రతిపాదనను రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించింది. ఇటువంటి వారికి ఇకపై స్థానికత్వ పత్రాలను అందించనున్నట్లు వెల్లడించింది. అటువంటి వారి నుంచి స్వీయ హామీ పత్రాన్ని తీసుకుని స్థానికత్వ ధ్రువీకరణ ఇవ్వనున్నట్లు ఈ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

సముద్ర జలాల్లో వ్యూహాత్మక విధానం

- జాతీయ సెమినార్‌లో భారత నౌకాదళాధిపతి సునీల్‌లాంబ
- తూర్పునౌకాదళంలో గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి

సముద్ర జలాల్లోనూ, తీర ప్రాంతాల్లోనూ నౌకాదళం వ్యూహాత్మకంగా వ్యవహరించడమే ప్రధానమైన విధానమని భారత నౌకాదళాధిపతి సునీల్‌లాంబ ఉద్ఘాటించారు. తూర్పునౌకాదళ గోల్డెన్ జూబ్లీ ఉత్సవాల్లో భాగంగా మంగళవారం 'నేషనల్ మేరిటైం పవర్స్' అనే అంశంపై సెమినార్ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సునీల్‌లాంబ మాట్లాడారు. సముద్ర ప్రాంతాల్లో అత్యంత బలమైన శక్తిగా తూర్పు నౌకాదళం ఎదగాలని, దేశ నావికాదళాల్లోనే ఇఎన్‌సి (ఈస్ట్ నేవల్ కమాండ్)కి ఆ బలముందని కొనియాడారు. తీర ప్రాంత లక్ష్యాలకు అనుగుణంగా వ్యూహం రచించుకోవాలని సూచించారు. తొలిరోజు జరిగిన జాతీయ సెమినార్‌లో తూర్పునౌకాదళ మాజీ చీఫ్‌లు ప్రిసైడింగ్ అధికారులుగా వ్యవహరించారు. నేవీ అధికారులు తమ దృష్టికోణాలను వేదికపై వెల్లడించారు. తీర ప్రాంతం పట్ల అత్యంత శ్రద్ధతోనూ, జాగరూకతతోనూ వ్యవహరించాలని సూచించారు. మంగళవారం జరిగిన సెమినార్ మూడు సెషన్స్‌గా నడిచింది. అనేక మంది నావికాదళ నిపుణులు ఇందులో పాల్గొన్నారు. పోర్టులను రక్షించడం, నౌకల నిర్మాణం, మౌలిక వసతుల ఏర్పాట్లు అత్యంత కీలకమైన లక్ష్యాలుగా సెమినార్‌ల్లో వివిధ సెషన్స్‌లో నిపుణులు అభిప్రాయపడ్డారు. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆసెన్ టెక్నాలజీ (ఎన్ఐఒటి) మెరైన్ టెక్నాలజీని అభివృద్ధి చేయాలని సూచించారు. మెరిటైం సెక్యూరిటీ విషయంలో నేషనల్ మేరిటైం ఫౌండేషన్ (ఎన్ఎంఎఫ్) జాగ్రత్త వహిస్తుందన్నారు. గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలను ఇఎన్‌సి, ఎన్ఎంఎఫ్ సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. ప్రారంభ సభా వేదికపై అతిథులను తూర్పునౌకాదళధిపతి హెచ్‌సిఎస్ బిస్త్ స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో పూర్వ నేవీ చీఫ్ ఆర్‌కె.ధోవన్, వివిధ విభాగాలకు చెందిన నావికాదళ అధిపతులు పాల్గొన్నారు.


సెమినార్‌కు హాజరైన వివిధ విభాగాల ఉన్నతాధికారులు

Published and Printed by Paturu Ramaiah on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governarpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Paturu Ramaiah, Ph : 2577248, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68